
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 240

మంగళవారం 14-5-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నాలుగో దశలో 67.70% పోలింగ్

6 లో

సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో దశ పోలింగ్ స్వల్ప ఘర్షణ ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం 10 రాష్ట్రాల్లోని 96 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకు 67.70 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.



తెలంగాణలో 64.93% పోలింగ్

తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు తెలంగాణ వ్యాప్తంగా 64.93% పోలింగ్ నమోదైనట్టు అధికారులు అంచనా వేశారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు.

2 లో



చురుగ్గా రబీ ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 10.05 లక్షల టన్నుల సేకరణ
- 1.02 లక్షల మంది రైతుల నుంచి రూ.2,196 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
- ఇప్పటికే రూ.వెయ్యి కోట్లకు పైగా చెల్లింపులు పూర్తి

3 లో



చంద్రబాబుకు బాంబే హైకోర్టు షాక్

- కేసు కొట్టివేతకు నిరాకరణ
- 2010లో పోలీసులపై దాడి చేసిన బాబు, నక్కా ఆనంద్‌బాబు
- ఇందుకు తగిన ఆధారాలు ఉన్నాయన్న ధర్మాసనం
- అనేకమంది పోలీసులు గాయపడ్డారు
- వైద్య ధ్రువీకరణ పత్రాలు ఇదే అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి

5 లో

మరోసారి ఫ్యాన్ సునామీ

పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే ఓటర్ల బారులు

ఉప్పెనలా కదలివచ్చిన వృద్ధులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు

పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక శాతం ఓటింగ్

సాయంత్రం 5 గంటలకు 68.04 శాతం పోలింగ్ నమోదు

- 6 గంటల వరకు క్యూలైన్లలో ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పించిన ఈసీ
- పలుచోట్ల రాత్రి 10 వరకూ కొనసాగిన పోలింగ్.. 76.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వర్గాల వెల్లడి
- ఫలితాలను నిర్దేశించేది మహిళలు, గ్రామీణులేనన్న ఇండియాటుడే టీవీ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్.. ప్రభుత్వ సేవలను బట్టే 80 శాతం మహిళలు ఓట్లు వేస్తారన్న యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా
- సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దే ప్రజలకు ప్రభుత్వం సేవలు

2 లో


తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు జెడ్పీ హైస్కూలు వద్ద ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో బారులుదీరిన మహిళలు

- సంక్షేమాభివృద్ధి పథకాలతో ఇంటింటా వచ్చిన విప్లవాత్మక మార్పును ప్రతిబింబించిన పోలింగ్ సరళి
- ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందంటున్న రాజకీయ పరిశీలకులు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వంపై సానుకూలత (పాజిటివ్) పోటెత్తింది. ఓటు వేసేందుకు వెల్లువెత్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు భారీ ఎత్తున కదలివచ్చారు. సాయంత్రం 5 గంటలకు 68.04 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లే కనిపించారు. వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని

మిగతా 2వ పేజీలో ▶

పోటెత్తిన ఓటర్లు

ఉ.6 గంటల నుంచే భారీ క్యూలైన్లలో ఓటర్లు



- ఎన్నడూలేని విధంగా పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు, వృద్ధులు
- సా.6 తర్వాత కూడా 3,500 కేంద్రాల్లో కొనసాగిన పోలింగ్
- గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెరుగుతుందని అంచనా
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు, గాలివాన బీభత్సంతో మందకొడిగా సాగిన పోలింగ్
- చెదురుమదురు సంఘటనలు తప్ప ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- హింసాత్మక ఘటనల కారకులపై కేసు నమోదు
- ఇప్పటివరకు ఎక్కడా రీపోలింగ్ కోరుతూ అభ్యర్థనలు రాలేదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

2 లో

పచ్చ ముఠాల విధ్వంస కాండ


పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ముందు ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ గూండాలు

ఓటమి భయంతో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు

రాళ్లదాడులు, కత్తులతో బీభత్సం, బాంబులతో భయోత్పాతం

యథేచ్ఛగా విధ్వంసం సృష్టించిన టీడీపీ, జనసేన

- చంద్రబాబు పక్కా పన్నాగంతోనే ధ్వంస రచన
- ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసినా ఈసీ ఉదాసీనత
- శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువులో యువకుడుకి కత్తిపోట్లు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కత్తెరతో 'చింతమనేని' అనుచరుల హత్యాయత్నం.. వైఎస్సార్ జిల్లాలో రెచ్చిపోయిన పచ్చ మూకలు
- అన్నమయ్య జిల్లాలో బరితెగించి రౌడీయిజం
- వైఎస్సార్ జిల్లా మబ్బు చింతలపల్లెలో కారు అద్దాలు ధ్వంసం
- జంగాలపల్లి పోలింగ్ బూత్‌లో బరితెగించిన టీడీపీ కార్యకర్తలు
- చిత్తూరు జిల్లా పెరుమాళ్ల కండ్రిగలో ఇళ్లపై దాడులు, కార్లు ధ్వంసం
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మితిమీరిన టీడీపీ నేతల ఆగడాలు

13 లో


పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడలో పెట్రోల్ బాంబులు విసరడంతో దగ్ధమవుతున్న బైక్‌లు


బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లంలో టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు

పల్నాట పచ్చ మూక బీభత్సకాండ

10 లో

మాచర్ల ఎమ్మెల్యే పీఆర్కే తనయుడు గౌతమ్, డ్రైవర్‌పై టీడీపీ గూండాల దాడి

తంగెడలో పెట్రోలు బాంబులతో దాడి.. 8 మందికి తీవ్ర గాయాలు.. చోద్యం చూసిన పోలీసులు

క్యాన్సర్‌ను ముందే గుర్తించేందుకు చర్యలు

- పెద్ద ఎత్తున స్క్రీనింగ్
- నేటి నుంచి సిబ్బందికి శిక్షణ
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



సాక్షి, అమరావతి: ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే బాధితులు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇందుకోసం చర్యలు చేపట్టనున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రణాళిక రచించామన్నారు. దీన్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించడానికి భారీ శిక్షణ కార్యక్రమాలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ సమన్వయం, సహకారంతో ఏపీ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీలకు చెందిన ప్రివెంటివ్ ఆంకాలజిస్టులు మూడు బ్యాచ్‌లలో సెన్సిటైజేషన్ కార్యక్రమానికి హాజరవుతారని వివరించారు. మొత్తం 3,244 మంది వైద్యాధికారులు (పీహెచ్‌సీల నుంచి 2702 మంది, యూపీహెచ్‌సీల నుంచి 542 మంది), అన్ని ప్రాంతాల సామాజిక ఆరోగ్యాధికారులు, అర్బన్ ఏఎన్ఎంలు, సెకండరీ హెల్త్ ఆసుపత్రుల సిబ్బంది సుశిక్షితులవుతారన్నారు.

మూడు రకాల క్యాన్సర్‌ల నిర్ధారణ

నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార ఇలా మూడు రకాల క్యాన్సర్‌ల స్క్రీనింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సెకండరీ, ప్రైమరీ హెల్త్ కేర్ ఉద్యోగులందరికీ శిక్షణ ఇవ్వడానికి ఒక ప్రత్యేకమైన ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇది జూన్ చివరి నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.


ఎందుకు సార్! ఫలితాలు తేడాగా వచ్చేట్లున్నాయా సార్!!


మూడు రోజులు ముందుగానే 'నైరుతి'!

ఈనెల 22కు బదులు 19నే దక్షిణ అండమాన్ సముద్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం

- ఇది సానుకూల పరిణామమంటున్న నిపుణులు
- ఈ ఏడాది కేరళకూ సకాలంలోనే రుతుపవనాలు!
- భారత వాతావరణ విభాగం అంచనా

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏటా దక్షిణ అండమాన్ సముద్రంలోకి మే 22న నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి వారం, పది రోజుల్లో కేరళను తాకుతాయి. ఈ ఏడాది మాత్రం నైరుతి రుతుపవనాలు మూడు రోజులు ముందుగా అంటే.. మే 19నే దక్షిణ అండమాన్ సముద్రంతో పాటు దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం వెల్లడించింది. దీంతో కేరళలోకి జూన్ ఒకటో తేదీకల్లా ప్రవేశించే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ రుతుపవనాలు కేరళను సకాలంలో తాకాలంటే అరేబియా సముద్రంలో అనుకూల వాతావరణం

మిగతా 5వ పేజీలో ▶



ఉప్పెనలా ప్రభుత్వ సానుకూలత

తమ సంక్షేమానికి కృషి చేసిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలిచారు

భారీ ఎత్తున పోలింగ్‌కు తరలిరావడమే ఇందుకు నిదర్శనం



- సీఎం వైఎస్ జగన్ అజెండాను ప్రజలు ఆమోదించారు
- ఇది చూసి నిరాశా నిస్పృహలతో టీడీపీ దుశ్చర్యలకు ఒడిగట్టింది
- ఓటర్లను భయభ్రాంతులను చేసేందుకు మారణాయుధాలతో దాడులకు దిగింది
- టీడీపీ గుండాలు రెచ్చిపోతుంటే పోలీసులు ఏపక్షంగా వ్యవహరించారు
- పోలింగ్‌కు ముందు రోజు కూడా అన్యాయంగా అధికారుల్ని బదిలీ చేశారు.. సస్పెన్షన్‌లో ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు టీడీపీ ఆఫీసులో కూర్చుని ఎస్పీలను బెదిరించారు
- కుప్పంతో సహా పలు నియోజక వర్గాల్లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడింది
- ఆధారాలతో సహా 80కి పైగా ఫిర్యాదులు చేశాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

- వివరాలు 2లో

నరసరావుపేటలో తీవ్ర ఉద్రిక్తత

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై టీడీపీ గూండాల రాళ్ల దాడి
- ఇల్లు, ఆస్పత్రిపై దాడి.. మూడు కార్లు ధ్వంసం
- ఎమ్మెల్యే మామ, డ్రైవర్, మరో యువకుడికి తీవ్ర గాయాలు
- దగ్గరుండి దాడి చేయించిన టీడీపీ అభ్యర్థి అరవిందబాబు
- అర్ధరాత్రి కూడా కొనసాగుతున్న ఉద్రిక్తత
- ఇరువురి గృహాల వద్ద కంచె వేసిన పోలీసులు
- బాష్పవాయు గోళాల ప్రయోగం

- వివరాలు 10లో

మహిళల్లో చైతన్యం

పోలింగ్ సరళిపై పేర్ని నాని



మచిలీపట్నం: మహిళలు పెద్దసంఖ్యలో ఓటు వేయడానికి తరలివచ్చారని, వారిలో ఓట్ల చైతన్యం వచ్చిందని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో సోమవారం ఓటు వేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ఉదయం ఏడుగంటలకు మొదలైతే మహిళలు ఉదయం ఆరుగంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి క్యూలో నిలబడ్డారని చెప్పారు. ఓట్లపై మహిళలు చైతన్యవంతులయ్యారన్నారు. ఓటు విలువపై మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో మహిళల్లో అవగాహన పెరిగిందని, అందుకే ఇంతమంది మహిళలు ఓటు వేయడానికి వచ్చారని చెప్పారు. ఒకేసారి రావడంతో ఓటింగ్ స్లోగా జరుగుతోందన్నారు. ఇతర రాష్ట్రాలు, పక్క ఊళ్లలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఓటు వేయడానిక సొంతూళ్లకు వచ్చారని తెలిపారు. స్థానిక ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ ఇక్కడ ఓటుహక్కు ఉన్నవారిని పిలిపించేవారని ఈసారి ఎలాంటి పిలుపులు లేకుండా స్వచ్ఛందంగా వచ్చారని పేర్కొన్నారు. చిన్న చిన్న పనులు చేస్తూ ఇతర ప్రాంతాల్లో ఉండేవారు కూడా ఓటు వేయడానికి స్వగ్రామాలకు తరలివచ్చారని పేర్కొన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాల నుంచి ఎన్నారైలు ఓటు వేయడానికి వచ్చారని, తనతో వారు మాట్లాడారని చెప్పారు. వారి సంతానానికి ఇక్కడ ఓటు లేదని, వారికి మాత్రమే ఉండటంతో ఓటు వేయడానికి వచ్చామని చెప్పారన్నారు. ఓట్ల చైతన్యంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. ఆడవాళ్లకు మంచి జరిగితే రాష్ట్రానికి శుభం కలుగుతుందని ఆయన చెప్పారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం వైఎస్ జగన్, భారతమ్మ

పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురంలోని పోలింగ్ కేంద్రంలో తన సతీమణి వైఎస్ భారతి రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఓటు వేశారు. పులివెందులలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి కూడా ఓటు వేశారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇడుపులపాయలోని మల్లేలమ్మ తల్లి నగర్‌లో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, అనికుమార్ ఓటు వేశారు.





తెలంగాణలో 61.16 శాతం పోలింగ్

వివిధ ఘటనల్లో 38 కేసుల నమోదు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 61.16 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. మావోయిస్టు ప్రభావిత 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా అన్నిచోట్లా సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. గడువు ముగిసే సమయానికల్లా పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. దీనితో సాయంత్రం 7 గంటల తర్వాత కూడా సుమారు 1,400 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వివరించారు.

ఉప్పెనలా ప్రభుత్వ సానుకూలత

తమ సంక్షేమానికి కృషి చేసిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలిచారు

సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళిని చూస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సానుకూలత ఉప్పెనలా కనిపించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఐదేళ్లలో సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పేదలందరి అభివృద్ధి, మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని తెలిపారు. అందుకే సీఎం జగన్‌కు అట్టడుగు వర్గాలు అండగా నిలిచి ఓటింగ్‌కు పెద్ద ఎత్తున వచ్చి అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు తరలివచ్చి స్వేచ్ఛగా ఓటు వేశారన్నారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. '2019లోనూ ఉప్పెనలా పోలింగ్ జరిగింది. అప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత కనిపించింది. ఈసారి ఓటింగ్ సరళి, భారీ పోలింగ్ ప్రభుత్వ సానుకూలతను చూపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇది అరుదు' అని చెప్పారు. ఈ ఎన్నికల్లో మంచికి ఓటేయాలని ప్రజలు ముందుగానే నిర్ణయించుకొన్నట్టు ఇది సూచిస్తోందన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతకు, రాజకీయ చైతన్యానికి ఇదొక తార్కాణంగా అభివర్ణించారు. ఇంకా ఆయన ఎమన్నారంటే..

నైరాశ్యంలో టీడీపీ దాడులు

ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేందుకు టీడీపీ దుష్టపన్నాగాలు చేసింది. వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలు ఓట్లేయడం చూసి టీడీపీ రౌడీ మూకలు నిరాశ, నిస్పృహలతో దాడులకు తెగబడ్డాయి. రాష్ట్రమంతటా టీడీపీ గూండాలు విశృంఖలంగా రోడ్లపై కత్తులు, కర్రలు వంటి మారణాయుధాలతో భీతావహ వాతావరణాన్ని సృష్టించారు. చిత్తూరు, నరసరావుపేట, మాచర్ల, దాచేపల్లి, పెనమలూరు, తాడిపత్రి, పొన్నూరు, జీడీ నెల్లూరు, అద్దంకి, పీలేరు, ఆత్మకూరు, జగ్గయ్యపేట, సత్తెనపల్లిలో విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసు అధికారులు, ఎన్నికల కమిషన్ అబ్జర్వర్ల అండతోనే టీడీపీ హింసాకాండకు పాల్పడింది. ఏదో రకంగా పోలింగ్‌ను అడ్డుకోవాలనే దుస్సాహసం టీడీపీలో కనిపించింది. ఎన్నికల అబ్జర్వర్లు పల్నాడు జిల్లాను బందిఖానా చేసినా.. టీడీపీ గూండాలు ఎలా రెచ్చిపోయారు? ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని వైఎస్సార్‌సీపీ ఎంతో సంయమనంతో వ్యవహరించింది. టీడీపీ మాత్రం ప్రభుత్వ అనుకూల ఓటరు బయటకు రాకూడదని కుట్రలు చేసింది. కచ్చితంగా పోలీసులు టీడీపీతో కుమ్మక్కయ్యారు. ఎన్నికల అధికారుల నుంచి కూడా పోలీసులపై ఒత్తిడి వచ్చింది. మరోవైపు సస్పెన్షన్‌లో ఉన్న పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వర్లు టీడీపీ ఆఫీసులో కూర్చుని అధికారంలోకి వచ్చేస్తున్నామంటూ ఎస్పీలను బెదిరించారు. చివరికి పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో దాడులకు తెగబడ్డారు. మరోవైపు పోలింగ్‌కు ఒక రోజు ముందు కూడా అన్యాయంగా పోలీసులను బదిలీ చేశారు. వారి ఆగడాలకు అడ్డుగా ఉంటారనే ఎటువంటి ఫిర్యాదులూ లేకపోయినా తప్పించేశారు. 2019 ఎన్నికల్లోనూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని చంద్రబాబు దబాయించారు. ఇప్పుడు కేంద్రంతో ఒత్తిడి చేయించి వారి కార్యాన్ని నేరవేర్చుకోవాలని చూశారు. ఎన్నికల కమిషన్‌కు వీలైనంత సపోర్టు ఇవ్వాలనే ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ వారి ప్రతి నిర్ణయాన్ని అంగీకరించింది. మేము ఎంత సర్దుకుపోయినా దానిని లోకువగా తీసుకున్నారు.

సీఎం జగన్ అజెండా పోలింగ్‌లో స్పష్టమైంది

టీడీపీ అజెండా ప్రజల ఆకాంక్షలకు దూరంగా ఉంది. అధికారం, అండ కోసం టీడీపీ కేంద్రంలో ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకుని, ఓట్ల కోసం ఓ పెద్ద సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కలుపుకొన్నా ఫలితం శూన్యమైంది. చెప్పుకోవడానికి గతంలో చేసిందేమీ లేకపోవడం, భవిష్యత్తులో చేసే దానిపై స్పష్టత ఇవ్వకుండా పోలింగ్ రోజు వరకు నాటకాలాడారు. సీఎం జగన్‌పై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. వారి పప్పులు ప్రజల దగ్గర ఉడకలేదని తెలిసిన తర్వాత దాడులకు తెగబడ్డారు. సీఎం జగన్ పేద కుటుంబాల అభివృద్ధికి ఎప్పుడైతే యజ్ఞం ప్రారంభించారో అప్పుడే ఆయన అజెండా రూపుదిద్దుకుంది. అప్పటి నుంచి దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అజెండా ఉండాలని ప్రజలు భావించడం పోలింగ్‌లో స్పష్టంగా తెలుస్తోంది. సీఎం జగన్ అజెండాతో పోటీపడే శక్తి లేకపోవడంతోనే కృత్రిమ అజెండాలతో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై దుష్ప్రచారం చేసినా టీడీపీ పాచికలు పారలేదు.

కుప్పంలో టీడీపీ రిగ్గింగ్

వెబ్ కాస్టింగ్ వచ్చిన తర్వాత కూడా టీడీపీ నిర్లజ్జగా రిగ్గింగ్‌కు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. కుప్పంలోనే 1, 2, 57, 92, 93, 94, 194, 195, 203 పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్ చేశారు. మాచర్ల, టెక్కలి, వేమూరు, గుంటూరు వెస్ట్, వినుకొండ, సత్తెనపల్లి, అద్దంకి, పొన్నూరు, అమలాపురంలో జరిగిన రిగ్గింగ్ ఘటనలపై ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాం. టీడీపీ నేతలు ఉక్రోశంతో ఈవీఎంలను పగలగొట్టారు. ఇలా టీడీపీ దుశ్చర్యలపై 80కి పైగా ఫిర్యాదులు చేశాం.

పోటెత్తిన ఓటర్లు

- ఉ.6 గంటల నుంచే భారీ క్యూలైన్లలో ఓటర్లు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం పోటెత్తింది. ఉదయం ఆరు గంటల నుంచే వారు భారీ క్యూలైన్లలో వేచిఉండి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపించారు. గతంలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాల కొనసాగింపునకు మద్దతుగా మహిళలు, వృద్ధులు పెద్దఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చెదురుమదురు సంఘటనలు తప్ప రాష్ట్రంలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసిందని, ఎక్కడా రీపోలింగ్ అవసరం ఏర్పడలేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం సాయంత్రం ప్రకటించారు. తొలిసారి ఓటర్లు, వృద్ధులు పెద్దఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారని, దీంతో గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. సా.6 గంటల దాటిన తర్వాత కూడా 3,500 పోలింగ్ స్టేషన్లలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, రాత్రి 8.30 గంటలకు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసిందని మీనా తెలిపారు. మరో 360 పోలింగ్ స్టేషన్లలో రాత్రి 10.30 గంటల వరకు పోలింగ్ కొనసాగిందన్నారు. దీంతో తుది పోలింగ్ శాతం మంగళవారం ప్రకటిస్తామని, సాయంత్రం ఐదు గంటలకు 68.04 శాతం నమోదైందని మీనా తెలిపారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడం, గాలివాన బీభత్సాలతో పోలింగ్ మందకొడిగా సాగిందన్నారు.

చెదురుమదురు సంఘటనలు

ఇక రాష్ట్రంలో ఎటువంటి హింసాత్మక సంఘటనలు, రీపోలింగ్ లేకుండా ఎన్నికలు నిర్వహించాలన్న ఎన్నికల సంఘం గత కొన్ని నెలలుగా చేసిన కసరత్తు సత్ఫలితాలిచ్చిందని మీనా చెప్పారు. పల్నాడు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో హింసాత్మక సంఘటనలు జరుగుతాయన్న భావనతో ముందస్తు భద్రత ఏర్పాట్లు చేశామని.. దీంతో సంఘటన జరిగిన వెంటనే స్పందించి వాటిని అదుపులోకి తెచ్చామన్నారు. ఈ సంఘటనలకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించారన్నారు. వివిధ ప్రాంతాల్లో మొత్తం 11 ఈవీఎంలను ధ్వంసం చేయగా వాటిని బెల్ అధికారులు పరిశీలించి అందులోని డేటా సురక్షితంగా ఉందని నిర్ధారించడంతో రీపోలింగ్ అవసరంలేకుండా కొత్త ఈవీఎంలతో పోలింగ్‌ను కొనసాగించినట్లు తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఈ రెండు ఈవీఎంల డేటాను పరిగణనలోకి తీసుకుంటారని మీనా స్పష్టంచేశారు. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 12 హింసాత్మక సంఘటనలు జరిగాయన్నారు. తెనాలి, నరసరావుపేటల్లో ఎమ్మెల్యేలను.. అనంతపురంలో ఇరు పార్టీల అభ్యర్థులను గృహనిర్బంధం చేయడం ద్వారా ఉద్రిక్త వాతావరణాన్ని నియంత్రించినట్లు ఆయన తెలిపారు. ఇక పుంగనూరులో జరిగిన సంఘటనలో నిందితులను వదిలేసిన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. పీలేరులో ఏజెంట్ల కిడ్నాప్ విషయం దృష్టికి రాగానే పోలీసులు రంగం ప్రవేశంచేసి వారిని తీసుకొచ్చి పోలింగ్ కొనసాగించినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే.. మంగళవారం పోలింగ్ పరిశీలకులు, రాజకీయ పార్టీలతో 17ఏ స్క్రూటినీ పూర్తయిన తర్వాత రీ–పోలింగ్‌పై ఒక స్పష్టత వస్తుందని మీనా చెప్పారు.



విశాఖపట్నంలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

ఇక ఎన్నికల ప్రక్రియ పూర్తియిన చోట్ల ఈవీఎం మిషన్లను పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చినట్లు మీనా తెలిపారు. కొన్నిచోట్ల 10.30 వరకు పోలింగ్ కొనసాగే అవకాశం ఉండటంతో అక్కడ అర్ధరాత్రి దాటిన తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకుంటాయన్నారు. ఈవీఎంలను రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చి ఆ తాళాలను సీఆర్‌పీఎఫ్ వారికి అందిస్తారన్నారు. 24 గంటలూ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్‌లు ఉంటాయని, రాజకీయ పార్టీలకు చెందిన వారు కూడా అక్కడ 24 గంటలు కాపలాగా ఉండటానికి అనుమతిస్తామన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మీనా

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఉ.7.30కు తన ఓటు హక్కును విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే ఫంక్షన్ హాల్లో వినియోగించుకున్నారు.



విజయవాడలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



పెనమలూరు నియోజకవర్గం కానూరు కెనడీ పాఠశాలలో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ప్రజలు



ఒంగోలు సెయింట్ థెరిస్సా హైస్కూల్ పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో బారులుదీరిన ఓటర్లు

టీడీపీలో భయాందోళనలు

- పోలింగ్ సరళితో గెలుపు చాలా కష్టమని అంతర్గతంగా అభిప్రాయాలు
- మహిళలు, వృద్ధుల ఓటింగ్ పెరగడంతో నష్టం జరుగుతుందని అంచనా
- వారి ఓట్లు తమకు పడే అవకాశం లేదంటున్న తమ్ముళ్లు

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైన, ఆయన ప్రభుత్వం పైన ఎంతగా విష ప్రచారం చేసినా ఉపయోగంలేకపోయిందని, ప్రజలంతా వారికి మేలు చేసే జగన్ వైపే ఉన్నారని తెలుగుదేశం పార్టీ నేతలకు తెలిసొచ్చింది. సోమవారం జరిగిన పోలింగ్ సరళిని చూస్తే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచే అవకాశాల్లేవని, ఈసారీ పరాజయం తప్పదని, మళ్లీ తమది ప్రతిపక్ష పాత్రేనని టీడీపీ నేతలు అంచనాకు వచ్చేశారు. టీడీపీ నేతలు పైకి గెలుస్తున్నామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా అంతర్గత లెక్కలు మాత్రం అనుకూలంగా లేవని పార్టీ సీనియర్ నేతల ద్వారా తెలుస్తోంది. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని వారు చర్చించుకుంటున్నారు. పోలింగ్ మొదలైనప్పటి నుంచి రెండు, మూడు గంటలు పోలింగ్ సరళి టీడీపీకి అనుకూలంగా ఉందని ఊదరగొట్టినా, ఆ తర్వాత పరిస్థితి మరింత తేటతెల్లం కావడంతో ఆ గాలి ప్రచారాన్ని తగ్గించేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, కొందరు ఎన్ఆర్ఐలు, టీడీపీ శ్రేణులతో కలిసి స్థానికంగా ఎక్కడికక్కడ ఓటర్లను మభ్యపెట్టేందుకు, తికమకపెట్టేందుకు శాయశక్తులా ప్రయత్నించారు.

మహిళలు బారులు తీరడంతో కలవరం

మహిళలు, వృద్ధులు గతంలోకంటె ఎక్కువగా పోలింగ్ బూత్‌లలో బారులు తీరి గంటల తరబడి నిలుచున్న దృశ్యాలు టీడీపీ శ్రేణుల్ని నివ్వెరపరిచాయి. తాము ఆశించిన దానికి భిన్నంగా సంక్షేమ పథకాలు అందుకున్న మహిళలు అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లేస్తుండటంతో తప్పుడు ప్రచారాలను నమ్ముకుని విర్రవీగిన టీడీపీ శిబిరమంతా నీరసించిపోయింది. ప్రతి నెలా ఇంటి వద్దే పింఛన్లు అందుకున్న వృద్ధులు వైఎస్ జగన్‌కు ఓటేయడం తమ బాధ్యతగా భావించినట్లు ఓటింగ్ సరళి తెలియజెప్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సెంటిమెంటు మరింత ఎక్కువగా కనిపించడంతో చంద్రబాబును నమ్ముకున్న పచ్చ మూకలన్నీ అంతర్మథనంలో మునిగిపోయాయి. పట్టణాల్లోకంటే గ్రామాల్లో ఓ టింగ్ పూర్తిగా తమకు వ్యతిరేకంగా జరిగిందనే అభిప్రాయం టీడీపీ శ్రేణుల నుంచి వ్యక్తమవుతోంది. యువత ఓట్లపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నప్పటికీ, అది కూడా నెరవేరలేదని చెబుతున్నారు. గత ప్ర భుత్వాలకంటే వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎక్కువగానే ఉద్యోగాలు రావడంతో యువత మద్దతును టీడీపీ పూర్తిగా పొందలేకపోయినట్లు అంచనా .

ఎన్ని దుష్ప్రచారాలు చేసినా పనిచేయలేదే?

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని రకాల దుష్ప్రచారాలు చేసినా, టీడీపీకి అనుకూలంగా ఎంత హడావుడి చేసినా ఉపయోగం కనిపించలేదని రాజకీయ వర్గాలు అంచనకు వచ్చాయి. ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి లబ్ధి పొందాలనే ప్రయత్నం కూడా బెడిసికొట్టిందని భావిస్తున్నారు. ఎంత తప్పుడు ప్రచారం చేసినా, చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలు నమ్మలేదని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆయన ఏడాది క్రితమే సూపర్ సిక్స్ పేరుతో జగన్ పథకాలను కాపీ కొట్టి ప్రకటించుకున్నారు. సీఎం వైఎస్ జగన్ సమర్థవంతంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి, రైతు భరోసా పథకాల పేర్లు మార్చి కొంచెం ఎక్కువ ఇస్తానని చెప్పినా చంద్రబాబును జనం పట్టించుకోలేదని తేలినట్లు చెబుతున్నారు. చివరికి పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఇస్తానని, ఏప్రిల్ నుంచే ఇస్తానని చెప్పినా వృద్ధులు లెక్క చేయలేదని స్పష్టమైంది. తాము అనుకున్నవేమీ జరగకపోవడం, ఓటింగ్ సరళి తమకు వ్యతిరేకంగా ఉండడంతో టీడీపీ శ్రేణులన్నీ నైరాశ్యంలో మునిగిపోయాయి. మరోవైపు పోలింగ్ జరుగుతున్నప్పుడే చంద్రబాబు కూడా చేతులెత్తేసినట్లు మాట్లాడటంతో టీడీపీ ఓటమి ఖాయమని ఆ పార్టీ శ్రేణులకు అర్థమైపోయింది.

తెనాలి ఎమ్మెల్యేపై యువకుడి దాష్టీకం

- సామాజికవర్గం ముసుగులో అన్నాబత్తునిపై దుర్భాషలు



ఎమ్మెల్యే శివకుమార్‌పై దాడి చేస్తున్న గొట్టుముక్కల సుధాకర్

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై సామాజికవర్గం ముసుగులో కూటమికి చెందిన ఓ యువకుడు ఆయన భార్య సమక్షంలోనే అవమానించి... రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించారు. ఆగ్రహించిన ఆయన చేయి చేసుకోవడంతో సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి తెగబడ్డారు. అంతేగాకుండా ఈసీకి ఫిర్యాదు చేసి ఆయన్ను తిరగనీయకుండా గృహనిర్బంధం చేశారు. అయితానగర్‌లో సోమవారం ఉదయం ఓటు వేసేందుకు భార్యతో సహా వచ్చిన ఎమ్మెల్యే శివకుమార్‌ను అప్పటికే క్యూలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గొట్టిముక్కల సుధాకర్ అడ్డుకున్నాడు. క్యూలో వెళ్లకుండా నేరుగా లోపలకు వెళ్లడమేంటన్న మిషతో దుర్భాషలాడాడు. అయినా మౌనంగా లోపలకు వెళ్లి ఓటేసి వస్తుంటే, మళ్లీ అదే వ్యక్తి అడ్డుకున్నాడు. కులాల పేర్లు ప్రస్తావిస్తూ 'ఆ పార్టీలో ఉండటమేమిటి' నువ్వు కమ్మోడివి కావా?' అని రెచ్చగొట్టాడు. ఇంకా కవ్వింపు చర్యలకు పాల్పడటమే గాకుండా భార్య ముందే అసభ్యంగా మాట్లాడటంతో తట్టుకోలేకపోయిన శివకుమార్ అతడి చెంపపై కొట్టాడు. సుధాకర్ కూడా తిరిగి చేయి చేసుకోవడంతో ఎమ్మెల్యే పక్కనే ఉన్న కార్యకర్తలు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదుచేసి, పోలింగ్ సరళిని పర్యవేక్షించే అవకాశం లేకుండా గృహనిర్బంధం విధించేలా చేశారు. ఈ ఘటనపై పోలీస్ కేసు నమోదు చేశారు.

మనోహర్‌తో కలిసి చేసిన కుట్ర

తనను రెచ్చగొట్టి ఏదోలా గొడవ సృష్టించి పోలింగ్ రోజున డ్యామేజ్ చేయాలని జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్, గొట్టిముక్కల సుధాకర్ కుట్ర పన్నారని ఎమ్మెల్యే శివకుమార్ ఆరోపించారు.

మరోసారి ఫ్యాన్ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం కల్పించింది. కొన్ని కేంద్రాల్లో రాత్రి పది గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. 76.50 శాతం పోలింగ్ నమోదయినట్లు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎండల ప్రభావం తగ్గడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి దోహదం చేసింది.

నిర్దేశించేది మహిళలు, గ్రామీణ ఓటర్లే..

పోలింగ్ సరళిపై ఇండియాటుడే ఛానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సోమవారం రాత్రి టీవీలో చర్చ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను విస్తారంగా పర్యటించానని.. మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. ఈ చర్చలో పాల్గొన్న సెఫాలజిస్ట్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించే యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా దీనిపై ఏకీభవించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల ఫలితాలను మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. రోడ్ల గురించి కాకుండా ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయన్నదే ప్రామాణికంగా తీసుకుని 80 శాతం మంది మహిళలు ఓటు వేస్తారని తెలిపారు.

ఇంటింటి అభివృద్ధిని ప్రతిబింబించిన పోలింగ్ సరళి..

నవరత్నాల పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు, సుపరిపాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఓట్లు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలను పెత్తందారులు – పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా బడుగు, బలహీన వర్గాలు భావించడం వల్లే భారీగా పోలింగ్ నమోదైందని పేర్కొంటున్నారు.

మోపిదేవిలంకలో బాలశౌరి తనయుడి వీరంగం

- వైఎస్సార్‌సీపీ నాయకులపై జనసేన, టీడీపీ నేతల దాడి
- అవనిగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేతలపై మరోసారి దాడికి యత్నం

మోపిదేవి (అవనిగడ్డ): ఓటమి భయంతో టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం మోపిదేవిలంకలో సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. మహిళలు అని కూడా చూడకుండా కిందపడేసి పిడిగుద్దులు గుద్దడమేగాక కాళ్లతో తన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అనుదీప్‌తో వచ్చిన జనసేన నాయకులు కూడా ఈ దాడులకు పాల్పడ్డారు. మోపిదేవిలంకలో ఏజెంట్లు టీ అడగడంతో స్థానికంగా ఉండే యార్లగడ్డ అంకరాజుతో తెప్పించారు. లోపలికి వెళుతున్న అంకరాజుపై జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అనుదీప్‌తో వచ్చిన జనసేన నాయకులు, కొందరు టీడీపీ నేతలు దాడిచేశారు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం మోపిదేవి మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు మీద జనసేన నేతలు బల్లా సీతారాం ప్రసాద్, బల్లా మునికుమారి, బల్లా దినేష్, శ్రీనివాసరావు, పవన్ తదితరులు దాడిచేసి కొట్టారు. నాగేశ్వరరావు కుమార్తె కేశాని తేజశ్రీని కిందపడేసి పిడిగుద్దులు గుద్ది కాళ్లతో తన్నారు. అడ్డువచ్చిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావుతో పాటు రాజులపాటి సుజాత, నరసారావు, వినయ్ బాబు, శివనాగరాజులను తీవ్రంగా కొట్టారు. బాధిత వైఎస్సార్‌సీపీ నాయకులు మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అవనిగడ్డ వైద్యశాలలో చేరారు. వీరికంటే ముందే.. దాడిచేసిన టీడీపీ నాయకులు ఆస్పత్రిలో చేరారు. తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు హాస్పటల్‌లో చేరగా అదే వార్డులో ఇరువర్గాలను ఉంచారు. టీడీపీ నాయకురాలు బల్లా మునికుమారిని పరామర్శించేందుకు వచ్చిన ఆమె సోదరులు అక్కడే చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి యత్నించారు. ఎస్ఐ రమేష్ ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అనంతరం ఇరువర్గాలను మచిలీపట్నం ఆస్పత్రికి పంపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు వైద్యశాలకు వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించారు. ఈ దాడుల్ని ఎమ్మెల్యే సింహాద్రి తీవ్రంగా ఖండించారు.



అవనిగడ్డ వైద్యశాలలో వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

క్లుప్తంగా...

సీబీఎస్‌ఈ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్‌ విజయకేతనం


చంద్రకాంత్‌ (484)


ఎం.హితేష్‌ (483)


ఎం.హాసిని (483)


కె.హ్రితికారెడ్డి (483)


గుంటూరు ఎడ్యుకేషన్‌: సీబీఎస్‌ఈ–2024 టెన్త్‌ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్‌ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్‌ భాష్యం రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థి ఎస్‌.హైందవ చంద్రకాంత్‌ 500 మార్కులకు 484 మార్కులు సాధించి సత్తా చాటాడని పేర్కొన్నారు. అలాగే ఎం.హితేష్‌ 483, ఎం.హాసిని 483, కె.హ్రితికారెడ్డి 483, ఎల్‌.అక్షిత 482, బి.అనూష్‌రెడ్డి 482, తనీష్‌ సాయి 482, అవని బిస్ట్‌ 481, పి.అనంత రాఘవేంద్ర 481, టి.కావ్యశ్రీ 480, కె.కార్తికేయన్‌ 480, బీవీఎల్‌ సుస్మిత 480 వంటి అత్యుత్తమ మార్కులతో విశేష ప్రతిభ చూపినట్లు తెలిపారు. 475కు పైగా 21 మంది, 450కు పైగా 101 మంది విద్యార్థులు మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్‌ హనుమంతరావు అభినందించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో విజయవాడ రీజియన్‌ సత్తా

సాక్షి, అమరావతి: సెంట్రల్‌ బోర్డు ఆఫ్‌ సెకండరీ ఎడ్యుకేషన్‌ (సీబీఎస్‌ఈ) 10, 12వ తరగతి ఫలితాల్లో విజయవాడ రీజియన్‌ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతిలో 99.60 శాతం, 12వ తరగతిలో 99.04 శాతం ఉత్తీర్ణత సాధించి దేశంలోనే రెండో స్థానంలో నిలిచారు. సోమవారం సీబీఎస్‌ఈ బోర్డు ఫలితాలను https://cbseresults.nic.in/ వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. పదో తరగతిలో 99.75 శాతం ఉత్తీర్ణతతో తిరువనంతపురం రీజియన్‌ మొదటి స్థానంలో నిలిచింది. చెన్నై 99.30 శాతం, బెంగళూరు 99.26 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. 12వ తరగతిలో తిరువనంతపురం 99.91 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో నిలిచింది. చెన్నై రీజియన్‌లో 98.47 శాతం, బెంగళూరులో 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రెండోసారి సీఎంగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు (చిత్తూరు జిల్లా): రాష్ట్రంలో పోలింగ్‌ సరళిని బట్టి వైఎస్సార్‌సీపీ మెజార్టీ స్థానాలు గెలుస్తుందని, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఆయన సోమవారం పుంగనూరు నియోజకవర్గంలో పోలింగ్‌ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని, భరోసాను మార్చడం ఎవరితరం కాదన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోతో మోసగించేందుకు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మకపోవడమే పోలింగ్‌ సరళికి నిదర్శనమని చెప్పారు. ప్రజలంతా ఎంతో సంతోషంగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని చెప్పారు. అత్యధిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేరుస్తుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోరంకిలో తెగబడిన పచ్చబ్యాచ్‌

పెనమలూరు: సార్వత్రిక ఎన్నికల సమరం రక్తసిక్తంగా మారింది. దొంగ ఓట్లు వేస్తూ తెలుగు తమ్ముళ్లు పట్టుబడటంతో అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. సమాచారం తెలుసుకుని ఘటనాస్థలానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోగి రమేష్, ఆయన ముఖ్య అనుచరులు లక్ష్యంగా టీడీపీ శ్రేణులు రాళ్ల దాడి చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారు. పోరంకి జిల్లా పరిషత్‌ పాఠశాలలో 13 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయి. ఈ బూత్‌లనే లక్ష్యంగా చేసుకుని టీడీపీ కార్యకర్తలు ఉదయం నుంచి దొంగ ఓట్లు వేయిస్తున్నారు. అయితే 106వ పోలింగ్‌ బూత్‌లో విదేశాల్లో ఉన్న ప్రణతి ఓటును గొడవర్రుకు చెందిన ఓ మహిళ ఓటు వేసేందుకు రాగా, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు ఆమెను గుర్తించి పోలింగ్‌ అధికారికి అప్పగించారు. పోలింగ్‌ అధికారి ఆ మహిళను విడిచిపెట్టడంతో పోలింగ్‌ అధికారి తీరును నిరసిస్తూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు దొంగ ఓట్లను ప్రోత్సహిస్తున్నారని నిరసన తెలపటంతో కొద్దిసేపు పోలింగ్‌ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఆ మహిళపై పోలీసు కేసు నమోదు చేయాలని ఆదేశించారు. తిరిగి పోలింగ్‌ ప్రక్రియ ప్రారంభమైన కొద్దిసేపటికి టీడీపీ నేతలు 106వ బూత్‌కు వచ్చి వైఎస్సార్‌సీపీ పోలింగ్‌ ఏజెంట్లను బెదిరించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓ దశలో కుర్చీలతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయి.

చురుగ్గా రబీ ధాన్యం సేకరణ

ఇప్పటివరకు 10.05 లక్షల టన్నుల సేకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ ధాన్యం సేకరణ చురుగ్గా సాగుతోంది. ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ధర అందించడంతోపాటు.. దేశంలోనే తొలిసారిగా రైతులకు గోనె సంచులు (గన్నీ), హమాలీ, రవాణా (జీఎల్టీ) చార్జీల కింద టన్నుకు రూ.2,523 అదనంగా చెల్లిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలో రబీ ధాన్యం సేకరణకు పౌర సరఫరాల సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటివరకు 1.02 లక్షల మంది రైతుల నుంచి రూ.2,196 కోట్ల విలువైన 10.05 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. వీటిల్లో నిర్దిష్ట సమయానికి 45,468 మంది రైతులకు రూ.1,008.93 కోట్లు చెల్లింపులను పూర్తి చేసింది. ఈసారి ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేసినప్పటికీ రైతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించడంతో మేలైన దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ రెండో ముందస్తు అంచనా చెబుతోంది. వాస్తవానికి రబీలో ప్రాథమికంగా 25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా అకాల వర్షాలు, అనుకోని విపత్తులు సంభవిస్తే తక్షణం ధాన్యాన్ని తరలించే విధానంపై ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ పటిష్ట ప్రణాళిక అమలు చేస్తోంది. చాలావరకు కోతలు పూర్తవడంతో ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలిస్తోంది.

50 శాతంపైనే కొనుగోలు

తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, కాకినాడ, బాపట్ల జిల్లాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎక్కువగా వస్తోంది. ఎగుమతిదారులు చాలామంది సాధారణ రకాలకు సైతం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుండటం విశేషం. ఉత్తరాంధ్రలో ఫైన్‌ వెరైటీలు సాగు చేస్తున్నారు. వాటికి బయటి మార్కెట్‌లో డిమాండ్‌ ఉండటంతో ప్రైవేటు వ్యాపారులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సీఎం జగన్‌ ప్రభుత్వం ఏటా దిగుబడుల్లో సగటున 50 శాతంపైనే కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. ఇలా ఐదేళ్లలో 37.68 లక్షల మంది రైతుల నుంచి రూ.65,142.29 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. టీడీపీ ఐదేళ్లలో కేవలం 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,236.91 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించింది.

దొడ్డు ధాన్యానికి డిమాండ్

రబీలో గోదావరి జిల్లాల్లో సాగు చేసే జయ రకం (దుడ్డు/బొండాలు) ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. గతేడాది నుంచి ప్రభుత్వం జయ రకం ధాన్యాన్ని సేకరించడం ప్రారంభించడంతో ప్రైవేటు వ్యాపారుల దందాకు అడ్డుకట్ట పడింది. పూర్తి మద్దతు ధరతోపాటు జీఎల్టీ చార్జీలను ఇస్తుండటంతో రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఆసక్తి చూపించారు. దీంతో దిగొచ్చిన ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధరకు కంటే రూ.100 నుంచి రూ.300 ఎక్కువ ఇచ్చి కళ్లాల నుంచే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఫలితంగా రైతులకు మంచి ధర కల్పించడంలో ప్రభుత్వం విజయవంతమైంది. ఈ ఏడాది 3 లక్షల టన్నుల వరకు జయ రకం ధాన్యాన్ని సేకరించేలా పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్క జయ రకం విషయంలోనే కాకుండా సాధారణ రకాల ధాన్యం ఉత్పత్తులను కూడా మద్దతు ధర/అంతకు మించి ఇచ్చి ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిల్లుల్లో ధాన్యం నాణ్యత సమస్యలను రైతులతో సంబంధం లేకుండా పరిష్కరించేందుకు కస్టోడియన్‌ అధికారుల స్థానంలో ప్రతి మండలంలో మొబైల్‌ బృందాలను నియమించింది. ప్రస్తుతం ఎన్నికల సమయం నేపథ్యంలో చాలామంది రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే పౌరసరఫరాల సంస్థ ఆయా జిల్లాల జేసీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు ప్రభుత్వ కాల్‌సెంటర్‌ వచ్చిన ఫిర్యాదులతో పాటు స్థానికంగా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నారు.

క్షీణిస్తున్న శ్రామికశక్తి సామర్థ్యం

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పుల కారణంగా భారత్‌తోపాటు పాకిస్థాన్‌లోను శ్రామికశక్తిలో ఉత్పాదకత సామర్థ్యం వేగంగా క్షీణిస్తోంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2100 సంవత్సరం చివరి నాటికి భారత్, పాకిస్తాన్‌ దేశాల్లోని కార్మికుల్లో పనిచేసే సామర్థ్యం 40శాతం కంటే తక్కువకు పడిపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆగ్నేయ, దక్షిణాసియా, పశ్చిమ, మధ్య ఆఫ్రికా, ఉత్తర దక్షిణ అమెరికాలోని ఇతర ప్రాంతాల్లో శారీరక శ్రమ సామర్థ్యం 70శాతానికి తగ్గిపోతుందని చెబుతున్నారు. తద్వారా ప్రపంచ ఆహార ఉత్పత్తికి పెనుముప్పు వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు యూకేకు చెందిన లాఫ్‌బరో విశ్వవిద్యాలయం పరిశోధకులు చేసిన ఓ అధ్యయనంలో పలు ఆందోళనకరమైన అంశాలు వెలుగుచూశాయి. ఈ అధ్యయనంలోని ముఖ్యాంశాలను 'గ్లోబల్‌ చేంజ్‌ బయాలజీ జర్నల్‌'లో ప్రచురించారు. భూగ్రహం వేగంగా వేడెక్కుతుండటంతో ఇప్పటి వరకు పంటల దిగుడి మాత్రమే తగ్గుతుందని అంతర్జాతీయ యూనివర్సిటీల పరిశోధకులు అంచనావేశారు. ఇది ఆహార భద్రతను మరింత దిగజార్చుతుందని భావించారు. కానీ, పెరుగుతున్న భూతాపం కారణంగా కేవలం పంటలు, పశువులు మాత్రమే కాకుండా ఆహారాన్ని పండించడంలో కీలకంగా ఉండే వ్యవసాయ కూలీలు కూడా తమ శక్తిని కోల్పోతున్నారని లాఫ్‌బరో విశ్వవిద్యాలయం పరిశోధకులు గుర్తించారు. ఈ పరిశోధనలో భాగంగా వ్యవసాయ కూలీలపై 700లకుపైగా ఎక్కువ ఉష్ణోగ్రత ఒత్తిడి ట్రయల్స్‌ నిర్వహించి డేటాను సేకరించారు. వివిధ స్థాయి ఉష్ణోగ్రతల్లో, తేమ ప్రదేశాల్లో పని చేసే వ్యక్తులపై సూర్యరశ్మి, గాలితో సహా విభిన్న వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయని గుర్తించారు. 1991–2010 మధ్య వాతావరణ పరిస్థితుల్లో ప్రపంచంలోని సగం మంది రైతులు 86శాతం కంటే తక్కువ సామర్థ్యంతో పని చేస్తున్నారని తేల్చారు. వ్యవసాయ కూలీలు క్రమంగా తమ సామర్థ్యాన్ని కోల్పోతున్నారని వెల్లడించారు. రాత్రిపూట, నీడలో పని చేయించడంతో కార్మికుల ఉత్పాదకతలో 5–10 శాతం మెరుగుదల కనిపించినట్లు పేర్కొన్నారు. మరోవైపు వాతావరణ మార్పులు మానవ శ్రేయస్సు, ఆరోగ్యకర పరిస్థితులకు ముప్పు అని ఇంటర్‌ గవర్నమెంట్‌ ప్యానెల్‌ తాజా నివేదిక చెబుతోంది. ఇది బిలియన్ల మంది ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తోందని పేర్కొంది. రాబోయే రెండు దశాబ్దాల్లో దక్షిణాసియాలోని సింధు, గంగానది సరిహద్దు పరీవాహనక ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడుతుందని చెబుతోంది.

సామాజిక మాధ్యమాల్లో ఓటెత్తిన చైతన్యం

- పోలింగ్‌ వేళ పోటాపోటీగా సోషల్‌ మీడియాలో పోస్టింగ్‌లు
- కొందరు అభ్యర్థులు, పార్టీల తరపున హోరాహోరీ ప్రచారం
- ఫొటోలు, కామెంట్లతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నం
- ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తెచ్చేలా సెల్ఫీ సందేశాలు



సాక్షి, అమరావతి: ఎన్నికల సంగ్రామంలో ఈసారి సోషల్‌ మీడియా కీలకపాత్ర పోషించింది. ఒక రకంగా సామాజిక వేదికలపై పెద్ద యుద్ధమే నడిచింది. ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడిన నాటి నుంచి మొదలైన ఈ వార్‌ పోలింగ్‌ రోజు మరింత ఉధృతమైంది. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల వారీగా ఏర్పడ్డ గ్రూపుల్లో ఓటింగ్‌ సందర్భంగా రాతలతో కత్తులు దూశారు. పార్టీల బలాబలాలతో పాటు గెలుపు ఓటముల గురించి అంచనాలను ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌ వంటి సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం చేశారు. ఉదయం ఓటర్లు పోలింగ్‌ కేంద్రాలకు వెళ్లిన కాసేపటికే ఫలానా పార్టీ గెలుస్తోందని, ఫలానా అభ్యర్థి ఓడిపోతున్నాడని ముందే ఊహాగానాలు గ్రూపుల్లో చక్కర్లు కొట్టాయి. ఫేక్‌ఫొటోలు, ఫేక్‌ ఆడియోలతో పాటు ఫేక్‌ వార్తలను క్షేత్రస్థాయిలో వైరల్‌ చేశారు. సోషల్‌ మీడియాను ఎక్కువగా ఫాలో అయ్యేవారు ఆ పోస్టులను చూసి అయోమయానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. సెల్‌ఫోన్లు చూస్తున్న వారు కాసేపు ఆందోళనకు గురయ్యారు. కానీ, చివరికి అప్పటికే తాము నిర్ణయించుకున్న దాని ప్రకారం తమకు నచ్చిన నాయకుడికి జనం ఓటేశారు.

వెల్లువెత్తిన చైతన్యం..

ఇక ఓటర్లలో ఈసారి చైతన్యం రెట్టింపయ్యింది. ఖచ్చితంగా ఓటు వేయాలనే కసి కనిపించింది. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓటేయడంతో పాటు తాము ఓటేసిన విషయాన్ని సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేశారు. ఓటు వేసినప్పుడు చూపుడు వేలుకు పెట్టిన గుర్తును చూపిస్తూ సెల్ఫీలు దిగి, ఆ ఫొటోలకు క్యాప్షన్లు రాశారు. వీడియోలు తీసి రీల్స్‌ను పోస్ట్‌చేశారు. వాటిని చూసిన ఫ్రెండ్స్, ఫాలోవర్స్‌ తాము కూడా ఓటేసి పోస్టింగ్‌ పెట్టాలని భావించారు. అప్పటివరకూ ఓటేయ్యడానికి వెళ్లనివారు సైతం సోషల్‌ మీడియాలో పోటెత్తుతున్న చైతన్యాన్ని చూసి బద్ధకాన్ని వదిలి పోలింగ్‌ కేంద్రాలకు పరుగులు దీశారు. నేనూ ఓటేశానంటూ సెల్ఫీలు షేర్‌ చేశారు. ఓటరు గుర్తింపు కార్డును తనిఖీ చేయడం కూడా ఈసారి చాలా సులభం అయ్యింది. ఆ కార్డులో ఉన్న క్యూఆర్‌ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్‌ చేయగానే ఓటరుకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రత్యక్షమవ్వడంవల్ల స్లిప్పులు ఇవ్వడం సులభమైంది. మరోవైపు.. సాహిత్య, సామాజిక వేదికలు సైతం ఈసారి ప్రముఖపాత్ర పోషించాయి. ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. అందులో భాగంగా ఓటు గొప్పతనాన్ని చాటిచెప్పేలా కవితలు, కథనాలు, కథలు వంటి రచనల పోటీలను సామాజిక మాధ్యమాల్లో నిర్వహించాయి. వాటిని అనేక గ్రూపుల్లోనూ, పలు ఆన్‌లైన్‌ వార్తా పత్రికలు, వెబ్‌సైట్లలోనూ ఉంచి ఓటర్లలో చైతన్యాన్ని తీసుకొచ్చాయి. పలు టీవీ ఛానళ్లు కూడా ఓటేసి సెల్ఫీలు పంపితే ఛానల్‌లో చూపిస్తామంటూ ఓటర్లను ప్రోత్సహించాయి. ఫలితంగా రాష్ట్రంలో పోలింగ్‌ శాతం భారీగా పెరగడానికి సామాజిక, ప్రసార మాధ్యమాలు తమ వంతు తోడ్పాటునందించాయి.

అల్లర్లు, దౌర్జన్యాలు, హింస

- రాష్ట్రంలో పలుచోట్ల పేట్రేగిపోయిన టీడీపీ
- ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ 58 ఫిర్యాదులు
- వైఎస్సార్‌సీపీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిరాశ, నిస్పృహలతో తెలుగుదేశం పార్టీ పలుచోట్ల అల్లర్లు, దౌర్జన్యాలు, హింసకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ లీగల్‌ సెల్‌ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉదయం నుంచి రాత్రి వరకు టీడీపీ హింసాత్మక సంఘటనలకు పాల్పడుతూనే ఉందని చెప్పారు. ఈ ఘటనలపై ఎన్నికల అధికారులకు సోమవారం ఒక్క రోజే 58 ఫిర్యాదులు చేశామని, వాటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రెండుసార్లు సస్పెండ్‌ అయిన అడిషనల్‌ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, రిటైర్డ్‌ డీజీ ఆర్పీ ఠాగూర్‌ మరికొందరు పోలీస్‌ అధికారులు మంగళగిరి టీడీపీ ఆఫీసులో కూర్చొని జిల్లాల పోలీసు అధికారులకు ఫోన్‌లు చేసి టీడీపీకి అనుకూలంగా వ్యవహరించాలని బెదిరింపులకు దిగారని చెప్పారు. వీరి ప్రభావంతో పలు చోట్ల పోలీసు అధికారులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారాన్నారు. బాపట్లలో నందిగం సురేష్‌ ఎన్నికల ఏజంట్లు ప్రయాణిస్తున్న కారుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, కారును ధ్వంసం చేసి వారిని భయభ్రాంతులకు గురిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏబీ వెంకటేశ్వరరావు, ఆర్పీ ఠాగూర్‌లు మరికొందరు రిటైర్డ్‌ పోలీసు అధికారులతో కలసి మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కూర్చుని జిల్లాల్లోని పోలీసు అధికారులకు ఫోన్‌లు చేసి రానుంది టీడీపీ ప్రభుత్వమని.. ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించాలంటూ బెదిరింపులకు దిగినట్లు తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. మంగళగిరిలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ ఓటు వేసేటప్పుడు ఆయన భార్య కూడా పోలింగ్‌ బూత్‌లోకి రావడం నిబంధనలకు విరుద్ధమని, సిబ్బంది ఆమెను ఎలా అనుమతించారని మనోహర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 255, 217, 218 పోలింగ్‌ బూత్‌లలో వృద్ధులను పోలింగ్‌ అధికారి తీసుకువెళ్లి తప్పుగా ఓటు వేయించారన్నారు. ఇదే నియోజకవర్గంలో 194, 195, 233 పోలింగ్‌ బూత్‌లలోకి వృద్ధులతో పాటు వచ్చే అటెండెట్స్‌ను పోలీసులు అనుమతించకపోవడం నియమావళికి విరుద్ధమని చెప్పారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం జెట్టి పాలెంలో 215 పోలింగ్‌ బూత్‌లో ఈవీఎంను టీడీపీ కార్యకర్తలు పగులగొట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తిని పరిగణనలోనికి తీసుకోకుండా, ఏజెంట్లు లేకుండానే అధికారులు మరో ఈవీఎంతో పోలింగ్‌ నిర్వహించడం దారుణం అన్నారు. కలెక్టర్, ఎస్పీలు సైతం టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా అనేక ఘటనలు

- దర్శి నియోజకవర్గంలో పోలింగ్‌ బూత్‌ నెంబర్‌ 145లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ సానుభూతి పరుడ్ని తలపగులగొట్టారు.
- రాయచోటి నియోజకవర్గంలో పోలింగ్‌ బూత్‌ 32లో వైఎస్సార్సీపీ ఏజెంట్లపై టీడీపీ నేతలు రాళ్ల దాడికి పాల్పడ్డారు.
- పెదకూరపాడులో పోలింగ్‌ బూత్‌ నెంబర్‌ 93, 94లలో కంచేటి సాయి అనే టీడీపీ నేత వైఎస్సార్‌సీపీ పోలింగ్‌ ఏజంట్లపై దాడి చేశారు.
- తాడిపత్రి నియోజకవర్గంలో పోలింగ్‌ బూత్‌ నెంబర్‌ 237 వద్ద పార్టీ ఎంఎల్‌ఏ కేతిరెడ్డి పెద్దారెడ్డి వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు.
- తెనాలిలో టీడీపీ నేత గొట్టిముక్కల సుధాకర్‌ ఎంఎల్‌ఏ అన్నాబత్తుని శివకుమార్‌ను, ఆయన భార్యను దూషించి ఘర్షణకు కారణమయ్యారు.
- గంగాధర నెల్లూరులో, విశాఖ వెస్ట్‌ నియోజకవర్గాలలో బౌన్సర్లతో టీడీపీ నేతలు హల్‌ చల్‌ చేశారు.
- తాడిపత్రి, చిత్తూరు, కుప్పం నియోజకవర్గాలలో సైతం టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారు.
- కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్‌లో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ అభిమానులపై దాడులకు పాల్పడ్డారు.
- రాష్ట్రంలో పలు పోలింగ్‌ బూత్‌లలో ప్రిసైడింగ్‌ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారు. వృద్ధులతో పాటు అటెండెంట్లను అనుమతించ లేదు. ఓటర్లను టీడీపీకి అనుకూలంగా ప్రభావితం చేశారు. వాటికి సంబంధించి ఆయా పోలింగ్‌ బూత్‌ నంబర్లతో సహా ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది.
- జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై దాడి చేసి కొట్టారు. తలకు గాయం అయింది.
- టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులు ఏకంగా పోలింగ్‌ బూత్‌లలో ప్రభావితం చేస్తూ చొచ్చుకు వచ్చారు. ఆయా పార్టీల రంగులున్న టీ షర్టులు, కండువాలతో లోపలికి వచ్చినా, పోలింగ్‌ అధికారులు నిరోధించలేదు.
- చాలాచోట్ల ఈవీఎంల దగ్గరకు వెళ్లి రిగ్గింగ్‌ చేయడం, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను భయపెట్టడం, పోలింగ్‌ కేంద్రాల సమీపంలోనే డబ్బులు పంచడం వంటి చర్యలకు పాల్పడ్డారు.
- టీడీపీ దాడులు, రిగ్గింగు వంటి సంఘటనల నేపథ్యంలో పలుచోట్ల రీ పోలింగ్‌ నిర్వహించాలని ఎన్నికల అధికారులను కోరాం. ఈ సంఘటనలన్నింటిపై ఈసీకి ఫిర్యాదు చేశాం.



మీ సొంత కారణం, మీ సొంత ఇంగిత జ్ఞానంతో మీరు ఏకీభవిస్తే తప్ప ఎక్కడ చదివినా, లేదా ఎవరు చెప్పినా, చివరికి నేను బోధించినా దేనినీ నమ్మవద్దు.
– గౌతమ బుద్ధుడు

సాక్షి
మంగళవారం, 14 మే 2024

పోటెత్తిన వోటర్లు!

సార్వత్రిక ఎన్నికల తొలి మూడు దశల తీరు వేరు... సోమవారంనాటి నాలుగో దశ పోలింగ్ తీరు వేరు. దేశవ్యాప్తంగా మొత్తం 96 లోక్‌సభ స్థానాల్లో జనం పెద్దయెత్తున వోటింగ్‌లో పాల్గొన్నారు. ఈ నాలుగో దశలో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అందుకోసమే కాక ఈ రాష్ట్రంవైపు దేశమంతా ఆసక్తిగా చూడటానికి ప్రత్యేక కారణం ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన అయిదేళ్ల పాలన తర్వాత ప్రజల ఆశీస్సులు కోరుతూ నిర్వహించిన 'సిద్ధం' సభలకూ, బస్సు యాత్రకూ పోటెత్తిన జనవాహినిని చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోయింది. 'మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు వోటేయండి' అంటూ ప్రజానీకానికి పిలుపునీయటం, అందుకు వచ్చిన సానుకూల స్పందన అసాధారణమైనవి. విపక్షం పూనకం వచ్చినట్టు వ్యక్తిగత దూషణలకు దిగినా, కులాల పేరిట ప్రాంతాల పేరిట చిచ్చురేపాలని చూసినా జగన్, ఆయన పార్టీ హుందాగా వ్యవహరించారు. ఈ ఎన్నికలు 'పేదలకూ, పెత్తందార్లకూ జరిగే యుద్ధం...ఇందులో మీరు ఎటువైపో తేల్చుకోండ'ని ఇచ్చిన ఆయన పిలుపును పల్లెసీమల నుంచి నగరాలు, పట్టణాల వరకూ అన్నిచోట్లా అందరూ అందుకున్నారు. కొత్తగా వోటు హక్కు వచ్చిన యువత మొదలుకొని వృద్ధుల వరకూ...వికలాంగులు మొదలుకొని అనారోగ్యంతోవున్న పెద్దల వరకూ... వేసవి తీవ్రతను కూడా లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలిరావటంలోని ఆంతర్యం అదే. కనుకనే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. వోటేయటానికి బారులు తీరిన మహిళలు, వృద్ధుల్ని చూసి టీడీపీ కూటమి వణికింది. దానికి తోడు గతంలో ఎవరూ సాహసించని, యోచించని ఒక వినూత్న ప్రయోగం చేశారు జగన్. అన్ని సామాజిక వర్గాలకూ పాలనలో సమ భాగస్వామ్యం కల్పించాలన్న పట్టుదలతో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో దాదాపు సగభాగం అట్టడుగు వర్గాలకు కేటాయించారు. అందువల్లే జనం వైఎస్సార్ కాంగ్రెస్‌ను గుండెల నిండా హత్తుకున్నారు. సాధారణంగా అయిదేళ్ల పాలన ఏ ప్రభుత్వం పైన అయినా ఎంతో కొంత అసంతృప్తి తీసుకొస్తుంది. అత్యంత జనాకర్షణగల సినీ దిగ్గజం ఎన్టీరామారావు కొత్తగా పార్టీ స్థాపించినప్పుడు రోడ్లపైకి భారీయెత్తున వచ్చిన జనమే... ఆయన పాలన చూశాక మొహం చాటేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. దాన్నుంచి కోలుకుని ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ఆయనకు మరో అయిదేళ్లు పట్టింది.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 4న వెల్లడయ్యాక దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. జనరంజక పాలన అంటే ఏమిటో... ఏం చేస్తే ప్రజల ఆదరాభిమానాలు సాధించుకోవచ్చునో అన్ని రాష్ట్రాల రాజకీయ నాయకులూ గ్రహిస్తారు. సంక్షేమం అంటే కేవలం తాయిలాలు పంచటం కాదని, వారి భవిష్యత్తును వారే నిర్మించుకునే విధంగా ఆసరాగా నిలబడటమని నిరూపించిన జగన్‌ను ఇకపై వారంతా రోల్ మోడల్‌గా తీసుకుంటారు. పిల్లలు బాగా చదువుకుని వృద్ధిలోకి వస్తేనే కుటుంబాలు బాగుపడతాయని గుర్తించి ఆ రంగాన్ని ప్రక్షాళన చేయటం, ప్రామాణికమైన విద్యనందించటం, 'నాడు-నేడు' పేరిట బడులన్నిటినీ తీర్చిదిద్దటం కనీవినీ ఎరుగనిది. వైద్యరంగంపైనా ఆయన అంతే శ్రద్ధ పెట్టారు. భారీయెత్తున సిబ్బందిని నియమించి ఆస్పత్రులను తీర్చిదిద్దటం, ఆధునాతన వైద్య పరికరాలు, ఔషధాలు సమకూర్చటం, పల్లెలకు సైతం వైద్య సేవలు చేరేయటం మామూలు విషయం కాదు. అలాగే రైతు కోసం ఏర్పాటైన వ్యవస్థలైతేనేమి... వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్లటమైతేనేమి జగన్ విజయాల్లో మచ్చుకు కొన్ని. దేశంలో ప్రజాభిమానాన్ని చూరగొనాలనుకునే నాయకులెవరైనా వీటిని అనుసరించక తప్పదు.


అయితే జనం మనస్సుల్లోంచి దీన్నంతటినీ తుడిచేయాలని చూసిన జిత్తులమారి టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి గురించీ, వారి చేష్టలకు వంతపాడిన ఎన్నికల సంఘం గురించీ ప్రస్తావించుకోవాలి. వారి నుంచి ఫిర్యాదు రావటమే తడవుగా ఉన్నతాధికారులను బదిలీ చేయటం, అయిదేళ్ల నుంచి అమలవుతున్న పథకాలకు మోకాలడ్డటం,వారు కోరిన విధంగా అడ్డగోలుగా అధికారుల్ని నియమించటం... టీడీపీ పోకడలపై ఫిర్యాదు చేసినా బేఖాతరు చేయటం లేదా ఆలస్యంగా స్పందించటం తటస్థంగా వుండాల్సిన వ్యవస్థకు తగదు. సాక్షాత్తూ బాబే ఎన్నికల సభల్లో సీఎంనుద్దేశించి దూషించినా... ఆయన్ను రాళ్లతో కొట్టాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా బాబును ఆపే ప్రయత్నం చేయలేదు. వేరే రాష్ట్రాల్లో ప్రధానినుద్దేశించి చిన్న వ్యాఖ్య చేసినా నొచ్చుకున్న ఆ వ్యవస్థ ఏపీలో వీటన్నిటినీ ఎలా కొనసాగనిచ్చింది? అన్నీ ఒక ఎత్తయితే ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై బాబు అండ్ కో సాగించిన దుష్ప్రచారం, ప్రజలను భయపెట్టడం మరో ఎత్తు. బాబు, లోకేష్‌లపై కేసులు పెట్టాలని ఆదేశించారు సరే... కానీ ఆ తర్వాత అదే అంశంపై నిబంధనలకు విరుద్ధంగా మీడియాలో పూర్తి పేజీ ప్రకటనలిస్తే ఎందుకు సంజాయిషీ కోరలేదు? నిజానికి పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగిందంటే అందుకు వైఎస్సార్ కాంగ్రెస్ సంయమనమే కారణం. అయినదానికీ, కానిదానికీ రాయలసీమపై అభాండాలేయటం బాబు దురలవాటు. కానీ చిత్రంగా అక్కడ అత్యంత ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఇతరచోట్ల టీడీపీ బరితెగింపుతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈవీఎంల ధ్వంసం, పెట్రోల్ బాంబులతో దాడి, పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలను బెదిరించటం, బౌన్సర్లతో హడలెత్తించటం, పోలీస్ స్టేషన్‌పై దండయాత్ర చేయటం దేనికి సంకేతం? ఎన్ని అవరోధాలెదురైనా నిర్భయంగా పోటెత్తి వోటేసిన ప్రజానీకం అభీష్టానిదే అంతిమ విజయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** శు.సప్తమి పూర్తి(24 గంటలు), **నక్షత్రం:** పుష్యమి ప.3.08 వరకు తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** తె.4.56 నుండి 6.36 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.52 వరకు తదుపరి రా.10.50 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.20 నుండి 10.01 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఆశల వసంతం... నిస్పృహల శిశిరం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అవినీతిపై యుద్ధం అని చెప్పి గెలిచిన ఎన్డీఏ కూటమి అవినీతిని అరికట్టలేకపోయింది. దానికి బదులు ఈ కూటమి పాలనా కాలంలో కొద్దిమందిగా ఉన్న కోటీశ్వరుల సంఖ్య పెరిగింది. ఇప్పుడు వారంతా మహా కోటీశ్వరులుగా మారారు. ఏడీఆర్ తాజా నివేదిక ప్రకారం... ఇక దేశంలో 'ఆరుగాలమూ' పాలనలో తిష్ఠవేసేది అవినీతిపరుల, కోటీశ్వరుల, మహాకోటీశ్వరుల పాలనేనని రుజువైంది. రాజ్యాంగాన్ని మార్చడం అనే విషయమూ ఎన్నికల కాలంలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు కొందరు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో తాము రాజ్యాంగాన్ని మార్చబోమని అధికార పార్టీవారు స్పష్టం చేయవలసివచ్చింది.

''తయారయ్యే ప్రతీ తుపాకీ, రంగంలో ఉన్న ప్రతీ యుద్ధనౌక, మనం ఉపయోగించే ప్రతీ రాకెట్టూ – ఆకలిదప్పులతో మలమల మాడుతున్న, మనం మాడ్చుతున్న పేదసాదల కష్టార్జితం నుంచి దోచుకున్నదే''

– అమెరికా మాజీ అధ్యక్షుడు ఐజెన్‌హోవర్ విస్పష్ట ప్రకటన

''నేటి భారతదేశంలోని లెజిస్లేటర్‌లలో 360 మంది నేర చరిత్రు లేనని, 476 మంది కోటీశ్వరులని, ఒక అభ్యర్థి రూ. 5 వేల కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారనీ, లోక్‌సభ నాలుగో విడత అభ్యర్థులపై తాజాగా 'ఏడీఆర్' (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్) సాధికార నివేదిక వెల్లడించింది. మొత్తం 1,717 మంది పోటీ పడే అభ్యర్థుల్లో 1,710 మంది వాఙ్మూలాలను విశ్లేషించి ఈ నివేదికను విడుదల చేసింది.''

ఏడీఆర్ తాజా నివేదిక ప్రకారం... ఇక దేశంలో 'ఆరుగాలమూ' పాలనలో తిష్ఠవేసేది అవినీతిపరుల, కోటీశ్వరుల, మహాకోటీశ్వరుల పాలనేనని రుజువైంది. కానీ మళ్లీ అదే ఎన్డీఏ ముఠా నినాదం – 'వచ్చే అయిదేళ్లు అవినీతిపై యుద్ధమే'నని!

ఇప్పటిదాకా ఎన్డీఏ కూటమి 'అవినీతిపై యుద్ధంలో' సాధించిన విజయాలేమిటో మోదీ చెప్పగలరా? దేశ సమైక్యత అంటూనే దేశంలో విభజనకు ఎన్డీఏ అవకాశం కలిగేలా వ్యవహరిస్తోంది. ఉత్తర-దక్షిణ భారతాల మధ్య విభజన రేఖకు ప్రస్తుత కేంద్రం వ్యవహారశైలి దారి తీస్తుందనేది కొందరి వాదన.

వేలాది గుజరాత్ దళిత పేదసాదలపై దారుణ హత్యాకాండకు కారకులైన నాటి బీజేపీ నాయకులు ఆ ఉన్మాద చరిత్రను దాచడానికి ప్రయత్నిస్తూ సుప్రీంకోర్టు విచారణను సహితం పక్కదారులు పట్టించారు. అయినా బీజేపీ-ఆరెస్సెస్ కూటమిగా ఉన్న ఎన్డీఏ 'రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్టు' పచ్చి అబద్ధమాడుతూ ఇప్పుడు తాజాగా సరికొత్త ఎదురుదాడికి సాహసిస్తోంది. పైగా, 'భారత రాజ్యాంగాన్ని దాన్ని రూపొందించిన డాక్టర్ అంబేడ్కర్ కూడా మార్చలేరని' తాజాగా ప్రధాని మోదీ బాహాటంగా 'కోతల'కు దిగడం అత్యంత హాస్యాస్పదం!

నిజానికి మనకు మోదీ హయాంలో రాజ్యాంగం అమలులో ఉందానిపిస్తోంది. ఉంటే, విదేశీ 'పెగసస్' సాఫ్ట్‌వేర్ ద్వారా దేశ యువకులను వేధించడానికి భారత పాలకులు సాహసించేవారు కాదు! రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ తను రూపొందించిన రాజ్యాంగాన్ని ఏదో తానే మార్చేయబోతున్నట్టు మోదీ ఊహించుకుని అంబేడ్కర్ సహితం దాన్ని మార్చలేరని 'ట్విస్టు' ఇచ్చారు! పైగా 'నేనింతవరకు ఈ స్థాయికి ఎదగడానికి సాయపడిన రాజ్యాంగానికి రుణపడి ఉన్నాన'ని' మరో ట్విస్టు ఇచ్చారు!

బీజేపీ నాయకుల్లో కొందరు 400 లోక్‌సభా స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామనే ప్రకటనలు ఇవ్వడం, దానిపై దేశవ్యాప్తంగా నిరసన గళాలు లేవడం తెలిసిందే. అందుకే మోదీ రాజ్యాంగాన్ని ఎవ్వరూ మార్చలేరని ప్రకటించాల్సి వచ్చింది.

రెండో మాట



మనకో గొప్ప సామెత ఉంది – కంపు నోటి వాడు సంపాదిస్తే, కమ్మని నోటి వాడు ఎగేసుకుపోయాడని! తన సమకాలీన సమాజంలోని అంతరాల దొంతర్లను, అకృత్యాలను, అన్యాయాలనూ, మౌఢ్యాన్నీ చాటలతో చెరిగి ప్రజల సుఖదుఃఖాలకు అద్దంపట్టిన ఇంగ్లండ్ మహా రచయిత చార్లెస్ డికెన్స్ 'రెండు మహానగరాలు' అన్న రచనలో చెప్పిన మాటలు నేటికీ చిరస్మరణీయాలే! అపార దేశ సంపద మధ్యనే దారుణమైన దారిద్ర్యం తాండవమాడుతోంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా సగటు మనిషి జీవితం దుర్లభం కావడం, కేవలం కొద్దిమందిగా ఉన్న కోటీశ్వరుల సంఖ్య అమాంతం పెరిగి మహా కోటీశ్వరులుగా మారిపోవడం చూస్తున్నాం. అందుకే డికెన్స్ మహాశయుడు తన కాలం నాటి ఇంగ్లండ్ పరిస్థితులను వర్ణించిన మహా వాక్యాలను తిలకించండి:

''అవి ఎంతో మంచి రోజులు. అలాగే అవి పరమ చెడ్డ రోజులు కూడా. అది జ్ఞానంతో కూడిన వివేచనా యుగం, అయినా అది మూర్ఖపు యుగం కూడా. అది విశ్వసించదగిన శకం, కానీ అది నమ్మలేని యుగం కూడా. అది అంధకారాన్ని చీల్చగలిగిన క్రాంతికి అరుదైన సమయం కూడా. అయినా అది అంధకారానికి ప్రతీక కూడా. అది ఆశల వసంతకాలం, కానీ అది నిరాశా నిస్పృహల శిశిరం కూడా. అన్నీ మా కళ్లముందే పరుచుకుని ఉన్నాయి, అయినా మా కళ్లముందు ఉండవు!''

విచిత్రమైన విషయం ఏమంటే– రాజ్యాంగాన్ని ఏదో అంబేడ్కర్ మార్చదలచినట్టు 'భావించి' ఒకవేళ 'మార్చుదామనుకున్నా మార్చలేడ'ని, అలాగే ఎన్డీఏ-ఆరెస్సెస్ కూటమి మార్చుదామనుకున్నా మార్చలేదనీ ప్రకటించిన ఎన్డీఏ నాయకుడు 'నేనీ స్థితికి (ప్రధాని పదవికి) వచ్చానంటే నన్నీ ఉన్నత స్థితికి తీసుకొచ్చింది రాజ్యాంగమే'నని ప్రకటించుకోవడం వింతలలో వింతగా ఉంది. కానీ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వాళ్లెవరూ ఫాసిస్టుల చేతుల్లో దాన్ని పెట్టి, భ్రష్టు పట్టించరు గాక పట్టించరు. మహాకవి జాషువా ఇవాళ కాదు, దశాబ్దాల క్రితమే 'హైందవ నాగరాజు' నీడల్ని పసికట్టి భారంగా ఒక సత్యాన్ని చాటాడు. 'స్వాతంత్ర్యంబును సర్వసౌఖ్యమున మా భాగంబు మాకిత్తురో, ఖాతాలేదని త్రోసిపుచ్చెదరో! వక్కాణింపవే చెల్లెలా!'

ఈ ప్రశ్నలో అప్పటికీ ఇప్పటికీ పెద్ద మార్పు లేదు. ఎంతసేపటికీ దళితుల ఖాతాలు మార్చడం తప్ప, ఉమ్మడి సొత్తులో వారి ఖాతాలు ఈ రోజుకీ మెరుగుపర్చింది లేదు. ఎందుకంటే జాతి వివక్షా విధానంలో, కులం కుళ్లు అంతర్భాగమనీ, ఇండియాలో వర్గమూ, వర్ణమూ అవినాభావ సంబంధం కలిగి, కుల సమస్యగా, వర్ణ వివక్షా సమస్యగా మనిషి ఉనికినీ, ఉసురునూ, ఉపాధినీ దెబ్బతీసే వికృత సమస్యగా ఉంది. ఇదే విషయాన్ని 50 స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు) 300 మంది కార్యకర్తలతో కలిసి ఒక ఫోరమ్‌గా ఏర్పడి 'దర్బన్' సభకు 18 పేజీల డాక్యుమెంట్‌ను సమర్పించారు. ఇది ఫోరమ్ స్థాయిలో సర్వాంగీకారం పొందిన పత్రం. ఈ దర్బన్ సభలో 'పరివార్' ప్రభుత్వ ప్రతినిధి పాల్గొని 'కుల సమస్య' దర్బన్ సభ ఎజెండాలోకి రాకుండా, వర్ణ వివక్షను పెంచి పోషిస్తున్న అమెరికా, తదితర పాశ్చాత్య రాజ్యాల అండతో సమస్యను దాటవేశారు. అలా బీజేపీ ఈ దాటవేతలో 'జయప్రద'మయింది! చివరికి ఇప్పుడు మన దేశంలో 'బీజేపీ పరివార్' ప్రభుత్వం ఏ స్థాయికి ఎదిగిపోయింది? దేశ బడ్జెట్‌లు, బిల్లులు శాసన వేదికలో సరైన చర్చ లేకుండానే మూజువాణీ ఓటుతో ఆమోదించి ముద్ర వేసుకోవడమే! నేర చరిత్ర గల అభ్యర్థులను డబ్బు కోసం కక్కుర్తిపడి పాలక పక్షం సహా దాదాపు అన్ని పక్షాలూ (కొన్నే మినహాయింపులు) ఆశ్రయించి, ఆమోదించడం! ఇదీ మన శాసన వేదికల, అభ్యర్థుల చరిత్ర, భాగోతం!

వివేకానందుడు, హరిదాస్ విహారిదాస్ దేశాయ్‌కి చికాగో నుంచి లేఖ రాస్తూ ఇలా అన్నారు: 'అణగారిపోతున్న అసంఖ్యాక నిరుపేద కష్టజీవుల రక్త మాంసాలపై ఆధారపడి విద్యావంతుడై, కులాసా జీవితం గడిపే ప్రతి ఒక్కరినీ దేశ ద్రోహిగా పరిగణించాలి. మన సంస్కర్తలు అసలు 'జబ్బు' ఎక్కడుందో చూడరు. విగ్రహాల వల్ల లాభం లేదు. హిందువనీ, ముసల్మాన్ అనీ, క్రిస్టియన్ అనే పేర్ల చాటున ఆ మతాల పదఘట్టన కింద కకావికలమవుతున్న ప్రజా బాహుళ్యం... ధన సంచులున్న వాడి పాదాల కింద శాశ్వతంగా పడి నలిగి పోవడానికే తాము పుట్టామన్న భావనకు గురి కారాదు. విగ్రహాలు ఉంటాయో, ఊడతాయో, కులాలు మంచివా, చెడ్డవా ప్రశ్నలు మనకు అనవసరం. పేదల మనస్సుల్లో భావవ్యాప్తి జరిగిన మరుక్షణం, మిగతా కార్యాచరణను వారే పూర్తి చేస్తారు!'

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



షీల్డ్ తొలగింది!



ఆస్ట్రాజెనెకా తన కోవిడ్ వ్యాక్సిన్‌లను ప్రపంచమంతటా ఉపసంహరించుకుంది. భారతదేశంలో ఇక కోవిషీల్డ్ లేనట్లే! అయితే ఇప్పటికే ఆ వ్యాక్సిన్‌ను తీసుకున్న 80 కోట్ల మంది ప్రజల సంగతేమిటి? మోదీ ఇప్పుడు క్షమాపణ చెబుతారా?

– అంకిత్ మయాంక్, వ్యాపారవేత్త

ఇలా కూడా!!



మా అమ్మకు (ఇంట్లో నేను ఆమె పక్కన ఉండగానే) బయటి నుంచి నేను చేసినట్లుగా ఒక అమ్మాయి పెద్దగా ఏడుస్తూ కాల్ చేసి, తన కారు యాక్సిడెంట్‌కు గురయిందని చెప్పింది! ఆ వెంటనే ఒక వ్యక్తి తను పోలీస్‌నని ఫోన్‌లో చెబుతూ, "మీ అమ్మాయి యాక్సిడెంట్ చేసింది. ఆమెను జైలుకు తీసుకెళుతున్నాం. మీరు వెంటనే 4 వేలు ట్రాన్స్‌ఫర్ చేస్తే బెయిల్ ఇప్పిస్తాను." అని చెప్పాడు! ఈ మధ్య ఇలాంటివి ఎక్కువయ్యాయి.

– ఎంజే, పర్వతారోహకురాలు

సీటు బెల్టుతో పాటుగా..!



1. మీకు కారు ఉంటే, వెంటనే డ్యాష్‌క్యామ్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. 2. హైవేలపై ఇకపై ఎప్పుడూ డ్రైవ్ చేయకండి. 3. సాధారణంగా రోడ్డు భద్రత అన్నది భారతదేశంలో తక్కువగా ఉంటుంది కనుక మీరు జాగ్రత్త గలిగిన డ్రైవరుగా ఉండండి – ఎల్లప్పుడూ!

– ఆనంద్ శంకర్, సోషల్ ఆంట్రప్రెన్యూర్

ఆదర్శ న్యాయం



నేరాలను నిరోధించేది కచ్చితమైన న్యాయమే కానీ, కంటి తుడుపు న్యాయం కాదు. ప్రజ్వల్ రేవణ్ణ కేసును నిర్వహించే విధానం... ఇంకా ప్రజల దృష్టికి రాని వాటితో సహా ఇలాంటి కేసులలో న్యాయ ప్రక్రియను నడిపిస్తుంది.

– రితుపర్ణ చటర్జీ, నెట్‌వర్క్, 'ఉమెన్ ఇన్ మీడియా'

ఇన్నేళ్ల తర్వాత!



మా నాన్న మా అమ్మను ఎంతగా హింసించేవారో ఈ మధ్యే కొద్ది కొద్దిగా మా అమ్మ నాకు చెప్పటం మొదలు పెట్టింది. ఇన్నాళ్లూ సీసాలో మూత పెట్టి ఉంచిన ఆ కథలను ఒకటొకటిగా ఈ 68 ఏళ్ల వయసులో ఆమె బయటికి తీసి నాకు చెబుతోంది. ఇలా నాకు చెప్పుకోవటం ద్వారా ఆమె తన గాయాలను మాన్పుకునే ప్రయత్నం చేస్తోంది. అసలే చెప్పకపోవటం కన్నా, ఆలస్యంగానైనా చెప్పటం మేలే కదా!

– గౌతమ్ ఎస్. మెంజిల్, సైబర్ అవేర్‌నెస్ వారియర్

ఆ మాట వద్దు



మీరు యువ జర్నలిస్టు అయితే కనుక దయచేసి గమనించండి. మీ రిపోర్టింగ్ స్టోరీలో 'నేను' అనే మాట వాడకండి. మీరు కథ కాదు, జర్నలిస్టు! అభిప్రాయాలు, వ్యక్తిగత వ్యాసాలు ముఖ్యమైనవే. కానీ అవి రిపోర్టింగ్‌తో సమానం కావు.

– రాగమాలిక, కమ్యూనికేటర్

ఏం టైమింగ్!!



ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కర్ణాటక బీజేపీ చేసిన ద్వేష పూరిత ప్రసంగ వీడియోను తొలగించాలని ఈసీ ట్విట్టర్‌ని ఆదేశించింది. ఈసీ మరికొంత కాలం వేచి ఉండొచ్చు, కర్ణాటక ఎన్నికలు ముగిసే వరకే ఎందుకు వేచి ఉండాలి? అన్ని విడతలూ పూర్తయ్యే వరకు ఆగితేనేం?!

– ధన్యా రాజేంద్రన్, చమేలీ దేవీ జైన్ అవార్డు గ్రహీత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

వెచ్చని హృదయ రాగ సందేశం

అభిప్రాయం



కరణ్ థాపర్

ఇది నిన్ననే జరిగినట్టుగా నా జ్ఞాపకంలో స్పష్టంగా ఉంది. నిజానికైతే, నేను తొలిసారి ఫాదర్ టెర్రీ గిల్‌ఫెడర్‌ను కలిసింది నలభై ఏళ్ల కిందట! అది 1982 వేసవి చివరిలో... నిషా, నేను మా పెళ్లికి సిద్ధం అవుతున్న సమయం. ఒక క్యాథలిక్‌గా నిషా తను కోరుకున్న సంప్రదాయబద్ధమైన చర్చి వివాహానికి నేను నా అంగీకారాన్ని తెలిపినప్పుడు, స్థానిక పారిష్ చర్చి ప్రీస్ట్‌ను కలసి ఆయన చేత మూడు ఉపదేశాలు ఇప్పించుకోవలసి అవసరం ఏర్పడటం నన్ను చీకాకు పెట్టింది. కానీ వేరే దారి లేదు. వెదికితే, అతి దగ్గరగా నార్తంబర్లాండ్ అవెన్యూలో ఉన్న పునీత మేరీ మగ్దలీనా చర్చి ఒక్కటే నిషాకు ఒక క్రైస్తవేతరునితో వివాహం జరిపించేందుకు అంగీకరించింది, నిబంధనలకు లోబడి ఉండే షరతు మీద!

సెప్టెంబరులో ఒక శనివారం, సాయంత్రం 6 గంటలప్పుడు నిషా, నేనూ ఫాదర్ టెర్రీ ఇంటి తలుపు తట్టాం. ఆయన తన డెస్క్ ముందు కూర్చొని ఉన్నారు. ఆయన కళ్లజోడు ముక్కు చివరికి దిగి ఉంది. ఆ చిన్న గదికి ఎదురుగా ఉన్న ఒక పాత, వెలసిపోయిన లెదర్ సోఫా మీద మేము కూర్చున్నాం. బయట ఎప్పుడూ లేనంత వేడిగా ఉంటే, లోపల వాతావరణం మంచులో ఉన్నట్లుగా ఉంది. నేను ఊరకే ఉండలేకపోతున్నాను.

''షెర్రీ తీసుకుంటారా?'' అని ఆయన అనటం నన్ను అమితంగా ఆశ్చర్యపరిచింది. ''మీ ఇద్దరి గురించీ నాకు తెలియదు. కానీ నేను షెర్రీ పట్ల కొంత మొగ్గుగానే ఉన్నాను'' అన్నారు.

అది టియో పెపె. నాకు ఇష్టమైనది. షెర్రీ బ్రాండ్. కానీ ఆ రోజుల్లో లండన్‌లో అది చాలా అరుదుగా మాత్రమే దొరికేది. ఫాదర్ టెర్రీ వివేచనతో కూడిన అభిరుచి గల వ్యక్తి. నేను ఆయనతో యూఎస్ ఓపెన్ టెన్నిస్, నాటింగ్ హిల్ కార్నివాల్, రష్దీ 'మిడ్‌నైట్ చిల్డ్రన్' వంటివాటిపై చర్చిస్తూ ఉన్నాను– మేము చేసుకోబోయే వివాహం, మాకు పుట్టబోయే పిల్లలు ఏ మతాన్ని అనుసరించవలసి ఉంటుంది– అనేవి తప్ప... అన్నీ.

ఫాదర్ టెర్రీ మా గ్లాసులను నింపుతూ సంభాషణను నడిపిస్తున్నారు. ఆయన నా వాదనను గ్రోలుతూనే, తన వాదనను సౌఖ్యంగా నిలిపి ఉంచుకుంటున్నారు. కాలం ఉల్లాసవంతమైన వేగంతో గడిచిపోయింది. వచ్చేవారం కలుద్దాం అనుకున్నాక, బయల్దేరేందుకు మేము లేచి నిలబడ్డాం. ఫాదర్ టెర్రీ మమ్మల్ని ఆపినప్పుడు మేము తలుపు దగ్గర ఉన్నాం.

''మీరు ఆలోచించాలని నేను కోరుకుంటున్న విషయమై ఒక ప్రశ్న నా దగ్గర ఉంది'' అన్నారు. ఆ ప్రశ్నకు సూచనగా చిరునవ్వొకటి విశాలమైన ఆయన గుండ్రటి ముఖం మీద నాట్యమాడింది. ఆయన కళ్లు సూటిగా మావైపే చూస్తున్నాయి. ''మీరిద్దరూ కలిసి ఎందుకు సహజీవనం చేయకూడదు?'' అన్నారు ఫాదర్ టెర్రీ.

మా ముఖాల్లోంచి రక్తం చివ్వున చిమ్మిందేమో నేను కచ్చితంగా చెప్పలేను కానీ, మేమిద్దరం మాత్రం నోట మాట రాక అలా ఉండిపోయాం. నిజం ఏమిటంటే నిషా, నేను అప్పటికే సహజీవనంలో ఉంటూ ఆ వాస్తవాన్ని దాచటానికి ఉద్దేశపూర్వకంగానే ఫాదర్ టెర్రీకి వేర్వేరు చిరునామాలను ఇచ్చాం. అది ఆయన ఊహించారు. అందుకే తన పద్ధతిలో అదేం పెద్ద విషయం కాదన్నట్లు చెప్పారు.



నిషా పూర్తి క్రైస్తవ సంప్రదాయంలో వివాహాన్ని కోరుకుంది. వరుడు క్రైస్తవుడు కాదు అనే విషయాన్ని పట్టించుకోకుండా ఫాదర్ టెర్రీ అందుకు సమ్మతించారు. ఆయన ఉపదేశ వాక్యం అందరి దృష్టిని ఆకర్షించింది. నరకం, అపరాధం, దైవం, సచ్ఛీలత... వీటి గురించి ఆయన ఉపదేశించలేదు. ''ఐ లవ్ యు'' అనే మూడు చిన్న పదాల గురించి మాట్లాడారు.

''కరణ్, నిషా...'', ''గుర్తుంచుకోండి. 'ఐ' నీ, 'యు'నీ 'లవ్' జత కలుపుతుంది. కానీ అది వేరు కూడా చేస్తుంది. మీరిద్దరూ వేర్వేరు వ్యక్తులని మీరు మరచిపోయిన రోజున మీ బంధం విడిపోతుంది'' అన్నారు ఫాదర్ టెర్రీ.

అదొక వెచ్చని, తేలికపాటి, హృదయపూర్వక సందేశం. లాంఛనప్రాయమైన తంతు కంటే కూడా నిప్పు చుట్టూ కూర్చొని మాట్లాడుకోవటం వంటిది. కానీ అది పావు శతాబ్దం పాటు నా మదిలో వెలుగుతూనే ఉండిపోయింది.

ఆరేళ్ల తర్వాత, ఆసుపత్రిలో నిషా చివరి ఘడియల్లో ఉన్నప్పుడు లైఫ్ సపోర్టును తొలగించటానికి కొన్ని నిమిషాల ముందు ఫాదర్ టెర్రీ ఆమె పక్కనే ఉన్నారు. ఆమెకు చివరి మతకర్మను నిర్వహించారు. అమ్మను కూడా హైందవ సంప్రదాయం ప్రకారం నిషా చెవిలో ప్రార్థనలు వినిపించమని ప్రోత్సహించారు. ఆ తర్వాత యంత్రాలు మెల్లగా, బాధగా మినుకు మినుకుమని కొడిగడుతున్నప్పుడు నిషా అంతిమ శ్వాసలో ఫాదర్ టెర్రీ నా పక్కన నిలబడ్డారు.

నాకు తెలిసిన ఏకైక క్రైస్తవ మత గురువు టెర్రీ గిల్‌ఫెడర్. ఆయన ఒక వింత మనిషి అయినప్పటికీ ఒక గొప్ప వ్యక్తి. ఒరిస్సా, కర్ణాటకలలో క్రైస్తవులపై జరిగిన దాడి గురించి చదివిన ప్రతిసారీ నేను ఆయన గురించి ఆలోచిస్తాను. గాయపడిన హృదయాలను నయం చేసే పదాలను ఆయన కనుగొని ఉంటారని నేను నమ్ముతాను. అందుకు నిస్సందేహంగా ఆయనకు షెర్రీ సహాయపడి ఉంటుంది.

– వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

కార్య సాధన సూత్రాలు

దుర్వాస శాపం వల్ల ఒకానొకప్పుడు దేవతలు తమ రాజ్యాన్నీ, వైభవాన్నీ కోల్పోయారు. వాటిని తిరిగి సాధించుకొనేందుకు సహాయం చేయమని విష్ణుమూర్తిని ప్రార్థించారు.

విష్ణుమూర్తి కాలం వాళ్ళకు అనుకూలమయ్యే దాకా వేచి ఉండమన్నాడు. ఇంతలో క్షీరసాగర మథనం చేసి, అమృతాన్ని సాధిస్తే ఉత్తరోత్తరా ఉపయోగం అన్నాడు. అయితే, ఆ మహాకార్యం రాక్షసులూ, దేవతలూ కలిసి చేస్తే తప్ప సాకారమయ్యేది కాదు. కాబట్టి ఆ పని పూర్తయ్యే దాకా, రాక్షసులకు లొంగిపోయి, వాళ్ళతో సంధి చేసుకోమన్నాడు. ఈ సందర్భంగా మహాకార్యాలు సాధించగోరేవారు గుర్తుంచుకోవాల్సిన మూడు సూత్రాలు దేవతలకు బోధించాడు.



తలపెట్టిన కార్యం ప్రయోజనం (కార్య -అర్థం) మహత్తరమైనదైనప్పుడు, ఆ కార్య నిర్వహణలో శత్రువులను కూడా కలుపుకొనిపోక తప్పదు. **అరయః అపి సంధేయాః, సతి కార్యార్థ గౌరవే** (భాగవతం, 8-6-20)

అలాగే, **న సంరంభేణ సిద్ధంతి సర్వే- అర్థాః సాంత్వయా యథాః**

అన్ని పనులూ సామమార్గం వల్ల సాధ్యమైనట్టుగా, ఆవేశాల వల్లా, హడావిడి వల్లా సాధ్యపడవు. అంతే కాదు, మహత్తర ఫలితాలు సాధించగోరేవాడికి, స్వల్ప ఫలాల మీద కక్కుర్తి కూడదు. తొలి దశలలో లభించే చిన్న చిన్న ఫలాలకే ఆశపడిపోయి, వాటితో తృప్తి చెందితే, అక్కడే ఆగిపోతారు. మహాకార్య నిర్వహణలో అనుకోకుండా ఇతర వస్తువులు లభించినప్పుడు వాటిమీద వల్లమాలిన కోరికా ఉండకూడదు. అలాంటి చిన్న వస్తువులు మరెవరో ఆరాటపడి తీసేసుకుని మనకు లేకుండా చేశారని రోషమూ, క్రోధమూ కూడా తగవు. లోభః కార్యః నవః జాతు, రోషః కామః మ వస్తుషు. చిన్న ఫలాల గురించి లోభపడకూడదు. అల్ప వస్తువులు కావాలని కోరిక గానీ, అవి దక్కలేదని రోషం గానీ పెట్టుకోవద్దు. అంతిమ లక్ష్యం దాకా ప్రయాసకొనసాగించటమే కార్య శూరత్వం.

– ఎం మారుతి శాస్త్రి

ఓటేసిన 110 ఏళ్ల బామ్మ



ఎన్‌పీకుంట: ఓట్ల పండగ ఓ బామ్మలో ఉత్సాహం నింపింది. ఓపిక లేకపోయినా ఓటేద్దామనుకుని తన కుమార్తెతో కలిసి ఓటుహక్కు వినియోగించుకుంది. వివరాల్లోకి వెళితే... శ్రీసత్యసాయి జిల్లా, ఎన్‌పీకుంట మండలంలోని ఎదురుదోన పంచాయతీ, దాసరవాండ్లపల్లికి చెందిన జి.నారాయణమ్మ (110) సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75 ఏళ్ల తన కుమార్తె రామలక్ష్మమ్మతో కలిసి ఎదురుదోన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వై.వెంకటమ్మ (95) సైతం తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

భర్త చనిపోయిన దుఃఖంలోనూ ఓటేసిన మహిళ



కారంచేడు: భర్త చనిపోయిన దుఃఖంలో ఉండి కూడా ఓ మహిళ ఓటేసిన ఘటన బాపట్ల జిల్లా కారంచేడులోని అంబేడ్కర్ నగర్ కాలనీలో సోమవారం జరిగింది. కాలనీకి చెందిన గర్నెపూడి సింగయ్య (62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఆయన భార్య గర్నెపూడి చిట్టెమ్మ భర్త చనిపోయిన బాధను గుండెల్లో మోస్తూ పోలింగ్ బూత్ వద్దకు వచ్చింది. క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకుంది.

స్ట్రెచర్‌పై వచ్చి ఓటేసిన వృద్ధురాలు



ఏలూరు రూరల్: పక్షవాతంతో బాధపడుతూ, నడవలేని స్థితిలో ఉన్న ఓ బామ్మ స్ట్రెచర్‌పై వచ్చి మరీ ఓటు వేసి నేటి యువతకు ఆదర్శంగా నిలిచింది. ఏలూరు రూరల్ మండలం, చాటపర్రు గ్రామానికి చెందిన యలమంచిలి సూర్యకుమారి(78) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. సోమవారం స్థానిక 156వ నంబర్ పోలింగ్ కేంద్రానికి స్ట్రెచర్‌పై వచ్చి ఆమె తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధాప్యం, అనారోగ్యం కావడం వల్ల హోమ్ ఓటింగ్ విధానాన్ని ఉపయోగించుకోవాలని, పోలింగ్ బూత్‌కు వెళ్లవద్దని కుటుంబ సభ్యులు చెప్పినా ఆమె వినలేదు. బతికి ఉండి ఓటు వేయకపోతే మరణించినట్లేనని ఆమె చెప్పడంతో తప్పనిసరై కుటుంబ సభ్యులు ఆమెను పోలింగ్ బూత్‌కు తీసుకొచ్చారు. సూర్యకుమారి రాకతో బూత్ వద్ద క్యూలో నిలబడ్డ ఓటర్లు తొలుత ఆశ్చర్యపోయి, అనంతరం ఆమెను అభినందించారు.

తల్లికి 102.. కుమారుడికి 72



కోడూరు: 10 పదులు వయసు దాటిన తల్లి.. 7 పదుల వయసు దాటిన కుమారుడు.. ఇద్దరూ ఓటు వేశారు. కృష్ణా జిలా విశ్వనాథపల్లికి చెందిన తల్లీకుమారుడు కొప్పనాతి ఈశ్వరమ్మ(102), కొప్పనాతి ఆదిశేషు (72) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈశ్వరమ్మ నడవలేని పరిస్థితిలో ఉండగా వృద్ధుడైన కుమారుడు ఆదిశేషుతో పాటు తోటి గ్రామస్తులు ఆమెను పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకొనేలా చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయడం ఆనందంగా ఉందని ఈశ్వరమ్మ, ఆదిశేషు తెలిపారు.

పోలింగ్ కేంద్రంలో సీఎం రమేష్ ఓవరాక్షన్

క్యూలో నిల్చున్న ఓటర్లకు ప్రలోభాలు

రిటర్నింగ్ అధికారిపై అయ్యన్న తిట్లపర్వం

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన సీఎం రమేష్ పోలింగ్ కేంద్రంలో ఓవరాక్షన్ చేశారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలంలోని కాశీపురం, దేవరాపల్లి హైస్కూళ్లలో సోమవారం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పోలింగ్ కేంద్రంలోకి చొరబడి క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. టీడీపీ ఏజెంట్లతో ఫొటోషూట్ చేశారు. సాధారణ ఓటర్ల మొబైల్స్‌ను అనుమతించని ఎన్నికల సిబ్బంది.. సీఎం రమేష్‌తో పాటు అతని అనుచరులు ఓవరాక్షన్ చేస్తున్నా.. పట్టించుకోకపోవడం గమనార్హం. పోలింగ్ కేంద్రంలో వారు చేసిన హడావుడి కారణంగా పోలింగ్ ప్రక్రియకు సైతం ఆటంకం కలిగింది. అయినా పోలీసులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. ఇక నర్సీపట్నం టౌన్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు పోలింగ్‌కు సరైన సౌకర్యాలు కల్పించలేదని అధికారులపై చిందులు తొక్కారు. జిల్లా ఎన్నికల అధికారి రవిపట్టన్‌శెట్టి, రిటర్నింగ్ అధికారి హెచ్.వి జయరాంను దూషించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న నారా కుటుంబం



ఓటు హక్కును వినియోగించుకున్న చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి



ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సిరా గుర్తును చూపిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకేశ్, ఆయన సతీమణి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో నారా కుటుంబం సోమవారం ఓటుహక్కు వినియోగించుకుంది. చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి ఉండవల్లి ప్రాథమిక పాఠశాలలో లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి ఓటు వేశారు.

మూడు రోజులు ముందుగానే 'నైరుతి'!

▶ మొదటి పేజీ తరువాయి

ఉండాలి. అంటే వీటి ఆగమనానికి ముందు అరేబియా సముద్రంలో అల్పపీడనం గానీ, వాయుగుండం గానీ ఏర్పడకూడదు. ఒకవేళ అవి ఏర్పడితే నైరుతి రుతుపవనాల రాకను ఆలస్యం చేస్తాయి. ప్రస్తుతం ఈ నెలాఖరులోగా అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడే పరిస్థితులు ఒకింత కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కానీ నిర్ధారణ అవ్వాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది. మరోవైపు గతేడాది కూడా నైరుతి రుతుపవనాలు మే 19వ తేదీనే దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించాయి. అయితే ప్రతికూల పరిస్థితుల వల్ల అవి కేరళను తాకడానికి వారం రోజులు ఆలస్యమైంది. దీంతో జూన్ ఒకటికి బదులు 8వ తేదీన కేరళను తాకాయి. ఎల్‌నినో ప్రభావంతో గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. కురిస్తే కుండపోత, లేదంటే వర్షాభావ పరిస్థితులతో పంటలకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం లభించలేదు.

మూడు రోజులు తేలికపాటి వర్షాలు

దక్షిణ అంతర్గత కర్ణాటక, పొరుగు ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 1.5 కి.మీల ఎత్తు వరకు విస్తరించి ఉంది. అలాగే దక్షిణ కర్ణాటక నుంచి వాయవ్య మధ్యప్రదేశ్ వరకు మధ్య మహారాష్ట్ర మీదుగా ద్రోణి కొనసాగుతోంది. వీటి ఫలితంగా రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. అలాగే ఒకటి, రెండు చోట్ల పిడుగులు పడేందుకు ఆస్కారం ఉందన్నారు.

పోలింగ్ సిబ్బంది 'పచ్చ'పాతం

ఓటర్లు చెప్పినవారికి కాకుండా టీడీపీకి ఓట్లు వేసిన పోలింగ్ సిబ్బంది.. రాష్ట్రంలోని పలు బూత్‌లలో సిబ్బంది అత్యుత్సాహం



అంగన్‌వాడీ టీచర్



పీవో జానకి



ఆవులవారిపాలెం పోలింగ్ బూత్‌లో ఫ్యాన్‌కు ఓటు వేయాలని వృద్ధుడు కోరితే సైకిల్‌కు ఓటు వేసిన ఓపీఓ వెంకటరమణ



వృద్ధుడు చిన్న అల్లీసా

నల్లజర్ల/మండపేట/ఆవులవారిపాలెం(క్రోసూరు): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం రాష్ట్రంలోని పలు పోలింగ్ బూత్‌లలో సిబ్బంది తమ ఇష్టానుసారం వ్యవహరించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేయడంపై అవగాహనలేని ఓటర్లకు సహకారం అందించేందుకు వెళ్లి ఓటర్లు చెప్పినవారికి కాకుండా తమకు నచ్చినవారికి ఓట్లు వేశారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలం సుభద్రపాలెంలోని 127వ నంబర్ పోలింగ్ బూత్‌లో దివ్యాంగురాలు బిరుదుగడ్డ నందెమ్మ ఓటు వేసేందుకు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్ సహాయం కోరారు. తాను చెప్పిన పార్టీకి ఓటు వేయకుండా అంగన్‌వాడీ టీచర్ సైకిల్, కమలం గుర్తులకు ఓటు వేసినట్లు నందెమ్మ గుర్తించి, బయటకు వచ్చి అధికారులకు తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తంచేసి ఆమెను విధులు నిర్వర్తించకుండా బయట కూర్చోబెట్టారు. ఇదేవిధంగా తెలికిచెర్ల గ్రామంలోని 166వ నంబర్ పోలింగ్ బూత్‌లో పీవోగా విధులు నిర్వర్తిస్తున్న జానకి కూడా పలువురికి సహాయంగా వెళ్లి సైకిల్, కమలం గుర్తులకు ఓట్లు వేశారు. ఈ బూత్‌లో పదిలం సరోజ, గోపిశెట్టి సూర్యకుమారి, తుమ్మల భాగ్యవతి తదితరులు ఓటు వేయడానికి పీవో సహాయం కోరారు. వారు చెప్పినట్లు కాకుండా ఆమె టీడీపీకి, బీజేపీకి ఓట్లు వేసినట్లు ఆ ఓటర్లతో పాటు ఏజెంట్లు గమనించారు. ఈ విషయాన్ని వారు బయటకు వచ్చి స్థానికులకు వివరించడంతో పీవో జానకిని నిలదీశారు. దీంతో తప్పయిపోయిందని ఒప్పుకున్న ఆమె... నాయకులను పక్కకు పిలిచి 'పోయిన ఓట్లు భర్తీ చేసే విధంగా మీకు ఓట్లు వేయిస్తా' అని నమ్మబలికారు. వారు ఒప్పుకోకపోవడంతో ప్లేటు ఫిరాయించి తనను ఒత్తిడి చేయడం వల్లే ఆవిధంగా ఒప్పుకున్నానని చెప్పారు. దీనిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆమె స్థానంలో సెక్టోరియల్ అధికారి వై.సత్యనారాయణను అక్కడ పీవో విధులకు నియమించారు. పీవో జానకిని పోలీసులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఉదయం నుంచి పీవో జానకి ఇదేవిధంగా వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఫ్యానుకు ఓటు వేయాలని చెబితే సైకిల్‌కు వేసిన ఓపీఓ

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఆవులవారిపాలెం పోలింగ్ బూత్‌లో వృద్ధుడు చిన్న అల్లీసా తన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఓపీవో వెంకటరమణను కోరగా, ఆమె సైకిల్ గుర్తుపై వేశారు. వీవీ ప్యాట్‌లో సైకిల్ గుర్తు చూసిన వృద్ధుడు తీవ్ర ఆగ్రహానికి గురై ఓపీవోపై తిరగబడ్డాడు. దాదాపుగా కర్రతో కొట్టేంత పనిచేశాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు వచ్చి ఆమె చేసిన తప్పిదాన్ని సరిచేయాలని కొద్దిసేపు ఆందోళన చేశారు. ఆర్వోకు, ఏఆర్వోలకు ఫిర్యాదు చేశారు. అధికారులు మాత్రం స్పందించలేదు.

ప్రిసైడింగ్ అధికారిపై కలెక్టర్‌కు వృద్ధుడు ఫిర్యాదు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని రావులపేట రావులచెరువు గట్టు వద్ద తొమ్మిదో నంబర్ సచివాలయంలో ఉన్న పోలింగ్ బూత్ ప్రిసైడింగ్ అధికారిపై ఓ వృద్ధుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ బూత్‌లో ఓటు వేసేందుకు గోకరకొండ సత్యనారాయణ(70) తన మనవడి సాయంతో వెళ్లారు. ప్రిసైడింగ్ అధికారి పీఎస్‌వీవీ సత్తిబాబు జోక్యం చేసుకుని సత్యనాయణ మనవడిని బయటకు పంపించారు. అనంతరం సత్యనారాయణ వేలితోనే రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై సత్తిబాబు నొక్కించారు. తాను ఫ్యాన్ గుర్తుకు వేయమంటే సైకిల్‌కు ఎందుకు మీట నొక్కించారని సత్యనారాయణ ప్రశ్నించగా, ఆయన్ను బలవంతంగా బయటకు పంపివేశారు. ఈ విషయాన్ని ఆయన తన కుమారుడు గోకరకొండ ప్రసాద్‌కు తెలియజేయగా, రిటర్నింగ్ అధికారి ఎల్లారావుకు, జాయింట్ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

చెరివి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు విద్యుత్ షాక్

సత్యవేడు (తిరుపతి జిల్లా): సత్యవేడు మండల పరిధిలోని చెరివి 231 పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు గోడలు విద్యుత్ షాక్ కొట్టాయి. దీంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. తక్షణమే అధికారులు సమీపంలోని రేకుల షెడ్డులోకి కేంద్రాన్ని మార్చారు. స్పందించిన పోలీసులు సమన్వయంతో ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. ఈ కారణంగా కొద్ది సమయం ఓటింగ్‌కు అంతరాయం కలిగింది. అనంతరం యథాతథంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

టీడీపీకి ఓట్లేయించిన టీచర్ తొలగింపు

పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎన్నికల బూత్‌లో ఓ ఉపాధ్యాయిని నాగమంగళం ప్రాంతానికి చెందిన పలువురు వృద్ధ మహిళా ఓటర్లతో వచ్చిన సహాయకులను కాదని.. ఆ మహిళలను వెంట తీసుకెళ్లి ఓట్లు వేయించారు. వారు ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయమని కోరితే ఇదే ఫ్యాను గుర్తంటూ సైకిల్‌కు ఓట్లు వేయించారు. దీనిని గుర్తించిన వృద్ధ ఓటర్లు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, శశి దృష్టికి తీసుకెళ్లి స్థానిక ఆర్డీఓ మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణ చేసి ఆమెను విధుల నుంచి తొలగించారు. ఉద్దేశపూర్వకంగానే ఆమె వృద్ధ మహిళలను తప్పుదారి పట్టించి టీడీపీకి ఓట్లు వేయించినట్టు తేలింది. దీనిపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల జోక్యంతో దీనికి తెరపడింది.

జమ్మలమడుగు ఎమ్మెల్యేపై రాళ్ల దాడి

- పోలింగ్ బూత్ వద్ద బూతులు తిట్టిన కూటమి అభ్యర్థి ఆదినారాయణరెడ్డి
- మైలవరం ఎ.కంబాలదిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకుడి కారుపై దాడి



పాతబస్టాండ్ సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనాలను నిలిపివేస్తున్న పోలీసులు

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో సోమవారం సాయంత్రం 6 గంటలు దాటాక నవాజ్ కట్ట సమీపంలోని 116, 117 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు బారులు తీరి ఉన్నారు. అధికారులు వారికి స్లిప్పులు ఇచ్చి పోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో డీఎస్పీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై లాఠీచార్జి చేశారు. ఇదే అదనుగా భావించిన ఆది, భూపేష్ వర్గీయులు రాళ్లతో దాడులు చేయించారు. ఈ దాడుల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తలపై గాయమైంది. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కాపాడుకునేందుకు ఎదురు దాడి చేశారు. సుధీర్‌రెడ్డిపై రాళ్ల దాడి జరిగిందన్న విషయం తెలుసుకున్న పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు హృషి కేశవరెడ్డి ఎమ్మెల్యేను పరామర్శించటానికి వెళుతున్న సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయం వద్ద గుమిగూడి ఉన్న కార్యకర్తలు రాళ్లతో దాడులు చేశారు. ఈ దాడిలో కారు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మైలవరం మండలం చేరెడ్డి చెన్న కేశవరెడ్డికి చెందిన కారును ఎ.కంబాలదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ కార్యకర్తలు దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఆదినారాయణరెడ్డి వర్గీయులు దాడి చేయగా.. ఎమ్మెల్యేకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంకటేశ్వర కాలనీ వద్ద గల 116, 117 బూత్‌ల వద్దకు బలగాలను మోహరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా ఎమ్మెల్యే కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. ముద్దనూరు మండలం నుంచి మేనమామ అయిన మునిరాజారెడ్డి తన అనుచరులతో జమ్మలమడుగుకు చేరుకున్నారు. భారీగా కార్యకర్తలు వస్తుండటంతో టీఎస్‌ఆర్ థియేటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

ప్రకాశంలో టీడీపీ దౌర్జన్యకాండ

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపర్తిపై దాడికి యత్నం
- గాలిలో కాల్పులు, బుల్లెట్ క్యాప్ తగిలి కానిస్టేబుల్‌కు గాయాలు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై కర్రతో దాడి చేయబోతున్న టీడీపీ కార్యకర్త

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై టీడీపీ వర్గీయులు రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. వారిని అదుపు చేసేందుకు కానిస్టేబుల్ గాలిలోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. తాటిపర్తి చంద్రశేఖర్ పోలింగ్ బూత్‌లను పరిశీలించటానికి పుల్లలచెరువు మండలంలోని ముటుకులకి వెళ్లారు. ఆయన పోలింగ్‌కేంద్రంలోకి వెళ్తున్న సమయంలో టీడీపీ నేతలు అడ్డుకున్నారు. పోలీసుల సహకారంతో ఆయన లోపలికి వెళ్లగా అప్పుడు టీడీపీ వర్గీయులు కర్రలు, రాళ్లతో ఆయనపై దాడికి దిగారు. ఒక దశలో చంద్రశేఖర్ తలపై కొట్టటానికి యత్నించారు. అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు అభ్యర్థిని పక్కకు నెట్టడంతో ఆ దెబ్బ వేరొకరికి తగిలింది. ఒక్కసారిగా టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడికి దిగడంతో కానిస్టేబుల్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరపగా బుల్లెట్ క్యాప్ రివర్స్ వచ్చి కానిస్టేబుల్‌కు తగిలింది. ఆయనకు స్వల్పంగా గాయమైంది.

ముందస్తు ప్రణాళికతోనే దాడి

ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట ముఖ్య అనుచరుడిగా పుల్లలచెరువు మండలంలో పెత్తనం చెలాయిస్తున్న బీవీ సుబ్బారెడ్డి ముటుకులకు వెళ్లి టీడీపీ వర్గీయులతో మంతనాలు జరిపాడు. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడి చేసేందుకు పథకం రచించారు. పోలింగ్‌కేంద్రం వద్ద రాళ్లు, కర్రలను సమకూర్చిపెట్టుకునేలా ఆయన సూచించినట్లు తెలిసింది. చంద్రశేఖర్ వస్తున్నట్లు తెలుసుకున్న వెంటనే ఆయన అక్కడి నుంచి తప్పుకున్నాడు. ఆ తరువాత టీడీపీ మూకలు ఆయనపై దాడి చేశారు.

- దర్శి నియోజకవర్గం బొట్లపాలెంలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి దిగడంతో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- దర్శి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎంఈఓ కార్యాలయంలో గల పోలింగ్ కేంద్రంలోకి టీడీపీ నేత వీసీ రెడ్డి తన అనుచరులతో వెళ్లి ఎంపీ బ్యాలెట్ ఈవీఎంను ఒక్కసారిగా చేతిలోకి తీసుకుని నేలపైకి విసిరి కొట్టడంతో బ్యాటరీ ముక్కలైంది. అక్కడున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.
- దర్శిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 118 బూత్‌లోకి టీడీపీ అభ్యర్థి లక్ష్మి తన అనుచరులైన కడియాల కుటుంబ సభ్యులు, నరసరావుపేటకు చెందిన రౌడీ మూకలతో లోపలకు ప్రవేశించి ఎన్నికలు అడ్డుకుని ఈవీఎంలను మాయం చేసేందుకు యత్నించారు. అక్కడున్న ఓటర్లు ప్రతిఘటించారు. బయటకు వెళ్లిన వారు పోలీసులపై రాళ్లు రువ్వారు.

గ్రామాల్లో టీడీపీ రాళ్లదాడి

యర్రగొండపాలెం మండలంలోని పెద్ద బోయలపల్లె, పుల్లలచెరువు మండలంలోని సిద్ధనపాలెం, శతకోడు గ్రామాల్లో టీడీపీ వర్గీయులు రెచ్చిపోయారు. పెద్దబోయలపల్లెలో పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు వేయటానికి క్యూలో నిలబడిన వైఎస్సార్‌సీపీ ఓటర్లను టీడీపీకి చెందిన కొంతమంది నెట్టివేశారు. దీంతో వారిమధ్య ఘర్షణ జరిగింది. ఈ సమయంలో టీడీపీ వర్గీయులు రాళ్లు రువ్వడంతో వైఎస్సార్‌సీపీ నేత వీరగంధం వెంకట సుబ్బయ్య తలకు తీవ్రంగా గాయమైంది. శతకోడులో పోలింగ్ కేంద్రంవద్ద టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ వర్గీయులతో ఘర్షణకు దిగి రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ముటుకుల సొసైటీ అధ్యక్షుడు కిలారి కృష్ణ తలకు తీవ్రగాయమైంది.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై దాడి

- చంద్రగిరి మండలం కూసువారిపల్లెలో ఒక కారు దగ్ధం, మరొకటి ధ్వంసం
- నలుగురు అనుచరులకు గాయాలు
- దాడిలో స్వయంగా పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



కూచువారిపల్లెలో పోలీసులను అడ్డుకుంటున్న స్థానికులు

తిరుపతి రూరల్/చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై చంద్రగిరి మండలం కూచువారిపల్లెలో సోమవారం టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఈ దాడిలో పాల్గొని మోహిత్‌రెడ్డి కారును దగ్ధం చేసి ఆయన అనుచరులపై రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడ్డారు.

అసలేం జరిగిందంటే..

చంద్రగిరి మండలం రామిరెడ్డిగారిపల్లె వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డిపై టీడీపీకి చెందిన కొందరు సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు. అతన్ని పరామర్శించేందుకు మోహిత్‌రెడ్డి తన సోదరుడు హర్షిత్‌రెడ్డితో కలిసి రామిరెడ్డి పల్లెకు బయల్దేరారు. ఆ గ్రామానికి ముందు కూచువారిపల్లెలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గుమికూడి రోడ్డు మధ్యలో మోహిత్‌రెడ్డి కారును అడ్డుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్లొద్దని చుట్టుముట్టారు. తమ నాయకుడిని పరామర్శించడానికి మీ అనుమతేంటని మోహిత్‌రెడ్డి వారిని ప్రశ్నించారు. దీంతో మోహిత్‌రెడ్డి కారును కదలనివ్వకుండా చుట్టుముట్టారు. అదే సమయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అక్కడకు చేరుకున్నాడు. దూకుడుగా వచ్చి మోహిత్‌రెడ్డి అనుచరులు కౌలిక్‌పై దాడిచేశాడు. ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. రక్తం కారేలా గాయపరిచాడు. మోహిత్‌రెడ్డిపై కూడా దాడి చేయడంటూ అనుచరులను రెచ్చగొట్టాడు. దీంతో ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. మోహిత్‌రెడ్డిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. కానీ, మోహిత్‌రెడ్డి గన్‌మెన్లు అతనికి రక్షణగా నిలబడి దాడిని అడ్డుకుని ఆయన సురక్షితంగా పక్కకు తీసుకొచ్చారు. దీంతో టీడీపీ గూండాలు మోహిత్‌రెడ్డి కారును దగ్ధంచేశారు. మరో కారును కూడా ధ్వంసం చేయడంతో వేరే కారులో మోహిత్‌రెడ్డిని గన్‌మెన్లు రామిరెడ్డిపల్లెకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కూడా నాని, ఆయన కుమారుడు, అనుచరులు 2 గంటలపాటు అక్కడే ఉండి టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు. రాత్రి 10.30 గంటలకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు.

సర్పంచ్‌పై దాడి.. ఇల్లు ధ్వంసం

రాత్రి 11:30 గంటలకు కూచువారిపల్లెలో సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిపై 500 మందికిపైగా టీడీపీ గూండాలు దాడి చేసి ఇంటిని ధ్వంసం చేశారు. ఎడ్ల బండ్లనూ తగలబెట్టారు.

చంద్రబాబుకు బాంబే హైకోర్టు షాక్

2010లో పోలీసులపై దాడికి పాల్పడిన కేసు కొట్టివేతకు నిరాకరణ



ముంబయి: టీడీపీ అధినేత చంద్రబాబుకు బాంబే హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. 2010 జూలైలో మహారాష్ట్రలో పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యవహారంలో తమపై నమోదైన కేసును కొట్టేయాలని చంద్రబాబు, టీడీపీ నేత నక్కా ఆనంద బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తులు మంగేష్ పాటిల్, శైలేష్ బ్రహ్మేలతో కూడిన డివిజన్ బెంచ్ మే 10న తీర్పు వెలువరించింది. పోలీసులతో చంద్రబాబు, నక్కా ఆనంద్ బాబు అనుచితంగా వ్యవహరించారనడానికి ఆధారాలున్నాయని పేర్కొంది. ఇందులో ఎలాంటి సందేహం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ పోలీసులు తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన రెండు పిటిషన్లను హైకోర్టు బెంచ్ కొట్టేసింది.

పోలీసులపై చంద్రబాబు దాడి

ప్రభుత్వోద్యోగిపై దాడి చేయడం, ప్రమాదకరమైన ఆయుధాలతో హాని కలిగించడం, ప్రాణాలకు హాని కలిగించే చర్యలు, శాంతికి భంగం కలిగించే ఉద్దేశంతో పోలీసులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, నేరపూరిత బెదిరింపులకు పాల్పడటం వంటి వాటిపై చంద్రబాబు, నక్కా ఆనంద్ బాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసును విచారించిన బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ మొదటి నిందితుడైన చంద్రబాబు పోలీసులపై దాడికి తన అనుచరులను ప్రోత్సహించారని పేర్కొంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మధ్య యుద్ధ వాతావరణం సృష్టించారని వెల్లడించింది. సాక్షులు సైతం పోలీసులపై దాడిలో చంద్రబాబు, నక్కా ఆనంద్‌బాబుల పాత్ర ఉందని తెలిపారని ధర్మాసనం గుర్తు చేసింది. ఆ ఘటనలో అనేకమంది పోలీసు అధికారులు గాయపడినట్లు మెడికల్ సర్టిఫికెట్లు కూడా ధ్రువీకరిస్తున్నాయని పేర్కొంది. పోలీసు సిబ్బందిపై దాడి చేయాలనే ఈ నేరం చేసినట్లు తెలుస్తోందని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కేసు ఇదీ..

2010 జూలైలో చంద్రబాబు, ఆనంద్ బాబు తదితరులను కలిపి మొత్తం 66 మందిని రిమాండ్‌కు తరలించి ధర్మాబాద్‌లోని ప్రభుత్వ విశ్రాంతి గృహంలోని తాత్కాలిక జైలులో ఉంచారు. వారి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించడంతో మహారాష్ట్ర జైళ్ల డీఐజీ వారిని ఔరంగాబాద్ సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. అయితే, చంద్రబాబు, ఆనంద్ బాబు దీన్ని అడ్డుకోవడంతోపాటు తెలుగు, ఇంగ్లిష్‌లో పోలీసు అధికారులను దూషించారు. అంతేకాకుండా బస్సు ఎక్కడానికి నిరాకరించడంతోపాటు పోలీసులపై దాడి చేశారు. దీంతో అదనపు బలగాలను రప్పించి చంద్రబాబు, ఆనంద్ బాబు తదితరులను ఔరంగాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన కేసును కొట్టేయాలని చంద్రబాబు దాఖలు చేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం రద్దు చేసింది. అయితే చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూత్రా విన్నపం మేరకు గతంలో వారికిచ్చిన మధ్యంతర రక్షణను జూలై 8 వరకు పొడిగించింది.

నిబంధనల ప్రకారమే కేసులు: ధర్మాసనం

అంతకుముందు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ ఆందోళనలు, నిరసనకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను పోలీసులు ఉపసంహరించుకున్నారని, ఆ కేసులో నిందితులందరినీ మేజిస్ట్రేట్ వెంటనే విడుదల చేశారన్నారు. అయితే, దాడి కేసులో పోలీసులు చంద్రబాబును, నక్కా ఆనంద్ బాబును ఇరికించారని ఆరోపించారు. జైళ్ల చట్టంలోని నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అధికారం జైళ్ల సూపరింటెండెంట్‌కు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుత కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది సీనియర్ జైలర్ అని, ఆయనకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారం లేదని లూత్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కోర్టు ఈ వాదనలను తిరస్కరించింది. నిందితులపై భారతీయ శిక్షాస్మృతిలోని నిబంధనల ప్రకారమే కేసులు నమోదు చేశారని స్పష్టం చేసింది. జైలు ప్రాంగణంలో నేరాలకు సంబంధించి భారతీయ శిక్షాస్మృతి ప్రకారం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి జైళ్ల చట్టం ఎలాంటి యంత్రాంగాన్ని లేదా విధానాన్ని నిర్దేశించలేదని ధర్మాసనం పేర్కొంది.

జైపూర్‌లో స్కూళ్లకు బాంబు బెదిరింపులు

జైపూర్: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. నగరంలోని 56 స్కూళ్లకు బాంబులతో పేల్చేస్తామంటూ మెయిళ్లు అందడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 2008లో జైపూర్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్లలో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటనకు సోమవారంతో సరిగ్గా 16 ఏళ్లు. ఈ పరిణామం సంభవించడం గమనార్హం. జైపూర్‌లోని 56 స్కూళ్ల ఆవరణలో బాంబులను అమర్చామంటూ మెయిల్స్ అందడంతో యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాయి. తక్షణమే పోలీసులు ప్రత్యేక బృందాలతో అణువణువూ సోధించి, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని తేల్చారు.

సీఎం కార్యాలయంలో నాపై దాడి జరిగింది

ఆప్ ఎంపీ మలివాల్ ఆరోపణలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారిక కార్యాలయంలో వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేశారని ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్)కు చెందిన రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ ఆరోపించారు. ఇందుకు సంబంధించి పోలీసులకు ఆమె ఎటువంటి ఫిర్యాదు ఇవ్వకపోవడం గమనార్హం. 'సోమవారం ఉదయం 9.34 గంటల సమయంలో ఒక మహిళ సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఢిల్లీ సీఎం నివాసంలో ఆమెపై దాడి జరిగిందని తెలిపారు. 10 గంటల సమయంలో ఎంపీ ఇక్కడికి వచ్చారు. సీఎం వ్యక్తిగత కార్యాలయం సిబ్బంది దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే దాడి జరిగినట్లుగా వైద్య పరీక్ష నివేదిక జత చేయాల్సి ఉంటుందని చెప్పాము. అయిదు నిమిషాలపాటు స్టేషన్‌లో ఉన్నారు. తర్వాత వచ్చి ఫిర్యాదు ఇస్తానంటూ ఆమె వెళ్లిపోయారు' అని నార్త్ జోన్ డీసీపీ ఎంకే మీనా తెలిపారు. అటుతర్వాత తమ ఫోన్‌కాల్స్‌కు, మెసేజీలకు స్వాతి మలివాల్ స్పందించలేదన్నారు. ఈ పరిణామంపై ఆప్ కార్యాలయం నుంచి గానీ, సీఎం నివాసం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడ లేదు.

కేజ్రీవాల్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కారణంగా ఢిల్లీ సీఎం పదవి నుంచి కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. '' సీఎం పదవి నుంచి ఒక వ్యక్తిని తొలగించాలని కోరడంలో ఉన్న ఔచిత్యమేంటి? అయినా అరెస్టును కారణంగా చూపి సీఎం పదవి నుంచి తొలగించాలన్న చట్ట నిబంధన ఏదీ లేదు. తొలగించాలని భావిస్తే సంబంధిత చర్యలు, నిర్ణయం తీసుకునే అధికారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉంటుంది. ఈ పిటిషన్‌ను మేము విచారణకు స్వీకరించట్లేము'' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషనర్ కాంత్ భాటీ తరఫు న్యాయవాదికి సూచించింది. ఢిల్లీ హైకోర్టు ఇదే తరహా పిటిషన్‌ను కొట్టేస్తూ ఏప్రిల్ 10వ తేదీన ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కాంత్‌భాటీ సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేయడం తెల్సిందే. ఆనాడు ఢిల్లీ హైకోర్టు ఇలాంటి ఒక పిటిషన్‌ను కొట్టేస్తూ.. ' ఒకే విషయంపై పలువురు పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. ఇది పార్లమెంట్ పరిధిలోని అంశం. ఇవేమీ జేమ్స్‌బాండ్ సినిమా సీక్వెల్స్ కావు. మళ్లీ మళ్లీ వేయడానికి' అని అసహనం వ్యక్తంచేసింది.

నాకూ బెయిలివ్వండి

సుప్రీంకోర్టులో సోరెన్ పిటిషన్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వీలుగా తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని సోరెన్ ప్రస్తావించారు. అదే తరహాలో తనకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ జనవరి 31న అరెస్టయిన సంగతి తెలిసిందే. సోరెన్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 17వ తేదీలోగా స్పందించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సూచించింది.

రాహుల్‌జీ... అభినవ్‌తో చర్చకు సిద్ధమా?

బీజేపీ సీనియర్ నేత తేజస్వీ సూర్య లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కీలక అంశాలు, ప్రజా సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రజల సమక్షంలో చర్చ జరపాలని సూచిస్తూ మాజీ న్యాయమూర్తులు రాసిన లేఖపై బీజేపీ సీనియర్ నేత తేజస్వీ సూర్య స్పందించారు. రాహుల్ గాంధీతో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ మేరకు సోమవారం లేఖ రాశారు. తమ పార్టీ తరఫున బీజేపీ యువమోర్చా ఉపాధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన అభినవ్ ప్రకాశ్ చర్చలో పాల్గొంటారని ప్రతిపాదించారు. దళితుడైన అభినవ్ ప్రకాశ్ విద్యావంతుడని, ఆయనతో చర్చకు ముందుకు రావాలని లేఖలో రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులు పిరికిపందలు

పాకిస్తాన్ అణుబాంబులకు భయపడుతున్నారు ● విపక్ష నేతలకు రాత్రిపూట పీడకలలు వస్తున్నాయి: మోదీ

ముజఫర్‌పూర్/హాజీపూర్/సరణ్: పిరికిపందలైన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాకిస్తాన్ అణుబాంబులకు భయపడుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ సహా విపక్ష 'ఇండియా' కూటమి నేతలు పాకిస్తాన్ అణుశక్తిని తలచుకొని చూసి బెంబేలెత్తిపోతున్నారని, వారికి రాత్రిపూట పీడకలలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. సోమవారం బిహార్‌లోని ముజఫర్‌పూర్, హాజీపూర్, సరణ్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతిపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. పిరికిపందలు, భయస్థులైన మన ప్రతిపక్ష నాయకులు ఉగ్రవాదంపై పాకిస్తాన్‌కు క్లీన్‌చిట్ ఇస్తున్నారని మండిపడ్డారు. పాకపాకిస్తాన్ భూభాగంపై మన సైన్యం చేసిన సర్జికల్ దాడుల పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, సైనికుల సాహసాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. అణ్వాయుధాలను వదిలించుకోవాలంటూ వామపక్ష నాయకులు ఇస్తున్న పిలుపును ప్రధాన మంత్రి తప్పుపట్టారు. బహిరంగ సభల్లో ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...



ప్రధాని మోదీ సోమవారం బిహార్ రాజధాని పట్నాలోని తఖ్త్ శ్రీహరిమందిర్‌జీ పట్నా సాహిబ్ గురుద్వారాను దర్శించుకున్నారు. సంప్రదాయ తలపాగా ధరించి, దర్బార్ సాహిబ్‌లో సిక్కుల పవిత్ర గ్రంథం ఎదుట ప్రణమిల్లారు. ప్రార్థనలు చేశారు. అనంతరం వంటశాలలో గరిటె తిప్పారు. కూర వండారు. రొట్టెలు కాల్చారు. లంగర్‌లో భక్తులకు స్వయంగా ఆహారం వడ్డించారు. పట్నా సాహిబ్ గురుద్వారాను దర్శించుకోవడం, ఇక్కడ ప్రార్థనలు చేయడం గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినిచ్చాయని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. సిక్కు గురువుల బోధనలు మనకి ఎప్పటికీ స్ఫూర్తిని స్తూనే ఉంటాయని, మనల్ని ముందుకు నడిపిస్తాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

పట్నా గురుద్వారాలో భక్తుల సేవలో మోదీ

గాజులు కూడా లేవా!

''పాకిస్తాన్ గాజులు తొడుక్కొని లేదని మన విపక్ష నాయకులు అంటున్నారు. అయితే, ఆ దేశం గాజులు తొడుక్కునేలా చేస్తాం. కడుపు నింపుకోవడానికి పాకిస్తాన్‌కు తిండి లేదని, ఆహారా ధాన్యాలు లేవని నాకు తెలుసు. పాకిస్తాన్‌కు విద్యుత్ సైతం లేదు. గాజులు కూడా లేవన్న సంగతి ఇప్పుడు తెలిసింది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికో ప్రధానమంత్రి మారుతారట! ఐదేళ్లకు ఐదుగురు ప్రధానమంత్రులు అనే ఫార్ములాను తీసుకొస్తున్నారు. నిజంగా అలా సంవత్సరానికో ప్రధానమంత్రి మారిపోతే దేశం ముందుకెళ్లడం సాధ్యమేనా? అలాంటి విధానం మనకు సరిపడదు. ప్రపంచదేశాల్లో మన ప్రతిష్ట పెరిగింది. అభివృద్ధి వేగవంతమైంది. మన దేశ ప్రతిష్టను ఇంకా పెంచడంతోపాటు ప్రగతిని కొనసాగించే ప్రభుత్వం కావాలి. అది బీజేపీ కూటమితోనే సాధ్యమవుతుంది. రాజకీయ నాయకుల నివాసాలు, కార్యాలయాల్లో దర్యాప్తు సంస్థలు సోదాలు చేసి, స్వాధీనం చేసుకున్న డబ్బంతా ముమ్మాటికీ పేదలకే చెందుతుంది. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల కార్యాచరణపై ప్రతిపక్ష నాయకులు గగ్గోలు పెడుతున్నారు. వారి అవినీతి, అక్రమ సొమ్మును స్వాధీనం చేసుకోవడమే ఇందుకు కారణం. గతంలో కాంగ్రెస్ పాలనలో ఈడీ కేవలం రూ.35 లక్షలు స్వాధీనం చేసుకుంది. ఒక స్కూల్‌బ్యాగ్‌లో ఆ డబ్బును సర్దొచ్చు. మేము అధికారంలోకి వచ్చాక ఈడీ రూ.2,200 కోట్లు స్వాధీనం చేసుకుంది. ఆ డబ్బును తరలించాలంటే 70 చిన్నపాటి ట్రక్కులు కావాలి. ప్రతిపక్ష నేతలకు వారసులు ఉన్నారు. ఆ వారసుల బాగు కోసమే వారు తపన పడుతుంటారు. నాకు వారసులు లేరు. సామాన్య ప్రజలే నా వారసులు. కాంగ్రెస్, ఆర్జేడీ వంటి విపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి, ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తున్నాయి. నేను బతికి ఉన్నంతకాలం ఇలాంటి ఆటలు సాగనివ్వను''. అని మోదీ వివరించారు.

నాలుగో దశలో 67.70% పోలింగ్

10 రాష్ట్రాలు,యూటీల్లోని 96 స్థానాల్లో పూర్తయిన ఎన్నికలు

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో దశ పోలింగ్ స్వల్ప ఘర్షణ ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం 10 రాష్ట్రాల్లోని 96 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాత్రి 11.45 గంటల వరకు 67.70 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నిర్ణీత పోలింగ్ సమయం లోపు పోలింగ్ కేంద్రాల వద్ద వరసల్లో నిల్చున్న ఓటర్లను పోలింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని ఈసీ పేర్కొంది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 78.37 శాతం పోలింగ్ నమోదైంది. ''శ్రీనగర్ నియోజకవర్గంలో 37.98 శాతం పోలింగ్ రికార్డయింది. ఆర్టికల్ 370 రద్దుతర్వాత కశ్మీర్ లోయలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి. శ్రీనగర్‌లో 36 శాతం స్థాయిలో పోలింగ్ నమోదవడం ఇటీవలి దశాబ్దాల్లో ఇదే తొలిసారి'' అని ఈసీ ప్రకటించింది. ఈసారి లోక్‌సభ ఎన్నికలు ఏడుదశల్లో జరుగుతుండగా తొలి దశలో 66.14, రెండో దశలో 66.71, మూడో దశలో 65.68% పోలింగ్ నమోదైంది. నాలుగో దశలో 96 స్థానాలతో కలిపి ఇప్పటిదాకా 543 స్థానాలకుగాను 23 రాష్ట్రాలు,యూటీల్లో 379 స్థానాలకు పోలింగ్ ముగిసింది. వీటితోపాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం అసెంబ్లీ స్థానాలకు, ఒడిశాలో 28 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. 2019 ఎన్నికల్లో నాలుగో దశలో 71 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా 65.51% పోలింగ్ నమోదైంది.

పశ్చిమబెంగాల్‌లో ఘర్షణలు

పశ్చిమబెంగాల్‌లోని 8 నియోజకవర్గాల పరిధిలోని కొన్ని చోట్ల తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఘర్షణలకు దిగారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఈవీఎంల మొరాయింపు, పోలింగ్ ఏజెంట్ల అడ్డగింత తదితరాలకు సంబంధించి దాదాపు 1,700 ఫిర్యాదులు ఈసీకి అందాయి. ఓటర్లను మభ్యపెట్టారని, ఏజెంట్లపై దాడులు చేశారని టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీ పరస్పరం వందలాది ఫిర్యాదులు చేశాయి. బర్ధమాన్‌లో బీజేపీ సీనియర్ నేత దిలీప్ ఘోష్‌పై రాళ్ల దాడి ఘటనలో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు గాయపడ్డారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఒడిశాలో ఇద్దరు పోలింగ్ అధికారులను ఈసీ సస్పెండ్ చేసింది. ఒడిశాలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. జార్ఖండ్‌లో మారుమూల గ్రామాల ప్రజలు ఓట్లేయకుండా మావోయిస్టులు రోడ్లపై చెట్లు నరికి పడేయగా భద్రతాసిబ్బంది సమయానికి అన్నీ తొలగించారు. ఐదో దశ మే 20, ఆరో దశ మే 25, ఏడో దశ జూన్ ఒకటో తేదీన జరగనుంది. అన్నింటి ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడతారు.

రాష్ట్రం	పోలింగ్ శాతం
ఆంధ్రప్రదేశ్	76.50
తెలంగాణ	64.93
బిహార్	57.06
జార్ఖండ్	65.20
మధ్యప్రదేశ్	70.98
మహారాష్ట్ర	59.64
ఒడిశా	73.97
ఉత్తరప్రదేశ్	58.05
పశ్చిమబెంగాల్	78.37
జమ్మూకశ్మీర్	37.98

రాయ్‌బరేలీ కోసం మేము.. అదానీ, అంబానీ కోసం మోదీ

రాయ్‌బరేలీ సభలో రాహుల్

రాయ్‌బరేలీ: రాయ్‌బరేలీ నియోజకవర్గ ప్రజల కోసం తన కుటుంబం మొత్తం పనిచేస్తే, అదానీ, అంబానీల కోసం మోదీ చాలా చెమటోడ్చారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం రాయ్‌బరేలీలో జరిగిన సభలో రాహుల్ ప్రసంగించారు. '' రాయ్‌బరేలీలో నామినేషన్ వేశాక రాహుల్ ఆ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఇదే తొలిసారి. '' నానమ్మ ఇందిరా గాంధీ, నాన్న రాజీవ్‌గాంధీ, అమ్మ సోనియాగాంధీ అందరూ రాయ్‌బరేలీ ప్రజల జీవితాలను బాగుచేసేందుకు పాటుపడ్డారు. మా కుటుంబమంతా మీ కోసం పనిచేస్తే, మోదీ మాత్రం అదానీ, అంబానీల ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారు. ఉపాధిహామీ పథకానికి 24 ఏళ్లకాలానికి ఖర్చయ్యే మొత్తానికి సరిసమానమైన బడాపారిశ్రామికవేత్తల రూ.16 లక్షల కోట్ల రుణాలను మోదీ ఒక్కదెబ్బతో మాఫీచేశారు. మోదీ హయాంలో రైతులు, నిరుద్యోగ యువత సమస్యలను జాతీయ మీడియా ఉద్దేశపూర్వకంగా చూపించలేదు. పారిశ్రామికవేత్తల కుటుంబాల ఆడంబర వివాహాలకే అగ్రతాంబూలం ఇచ్చాయి. ఆ వేడుకలనే ప్రసారంచేశాయి'' అని ఆరోపించారు.

పెళ్లి ఎప్పుడంటే?

సోమవారం రాయ్‌బరేలీలో జరిగిన ప్రచార సభలో రాహుల్ మళ్లీ అదే ప్రశ్నను ఎదుర్కొన్నారు. రాహుల్ మాట్లాడేటప్పుడు సభావేదికపై సోదరి ప్రియాంకా గాంధీ కూడా ఉన్నారు. 'నిన్ను వీళ్లేదో ప్రశ్న అడుగుతారట. సమాధానం చెప్పు' అని ప్రియాంక చెప్పగా, ఏంటా ప్రశ్న అని రాహుల్ సభికులను అడిగారు. పెళ్లి ఎప్పుడు? అని ఒక కార్యకర్త అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈసారి కొత్త సమాధానం చెప్పారు. ''తొందరపడాలిక. త్వరలోనే చేసుకుంటా'' అని అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా '' ఇన్నాళ్లు ఎందుకో పెళ్లి గురించి అంతగా పట్టించుకోలేదు', ' పెళ్లి మీదకు మనసు పోలేదు', ' మీరే అమ్మాయిని చూడండి', ' అమ్మకు నచ్చితే ఓకే' అంటూ వేర్వేరు సమాధానాలు చెప్పిన రాహుల్ సోమవారం ఇలా కొత్త సమాధానం చెప్పారు. తర్వాత ప్రియాంకను పొగిడారు.'' దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూ ఎట్టకేలకు రాయ్‌బరేలీకి వచ్చా. కానీ ప్రియాంక మాత్రం మొదట్నుంచీ రాయ్‌బరేలీలో ప్రచార బాధ్యతలు దగ్గరుండి చూసుకుంటోంది. ఆమెకు నా కృతజ్ఞతలు' అని ఆమెను అభినందించారు.



'వాళ్లేదో అడుగుతారట.. జవాబు చెప్పు' అంటూ రాహుల్‌ను ఆటపట్టిస్తున్న ప్రియాంక

ముంబై అతలాకుతలం

బీభత్సం సృష్టించిన గాలివాన

- పెట్రోల్ బంక్‌పై కుప్పకూలిన భారీ హోర్డింగ్
- 9 మంది దుర్మరణం, 65 మందికి గాయాలు
- హోర్డింగ్ కిందే కనీసం మరో 30 మంది!

ముంబై: అకాల వర్షాలు, దుమ్ము ధూళితో కూడిన బలమైన ఈదురుగాలులతో ముంబై సోమవారం అతలాకుతలమైంది. నగరంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. ముంబైవ్యాప్తంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు గంటల పాటు నరకం చవిచూశారు. దుమ్ముతో కూడిన గాలి దుమారం ధాటికి చాలామంది వాహనాలను వదిలి తలదాచుకోవడానికి చెల్లాచెదురయ్యారు. ఎక్కడ చూసినా వరద నీరు రోడ్లను ముంచెత్తడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘట్కోపర్ ప్రాంతంలోని చెడ్డానగర్ జంక్షన్ వద్ద 100 అడుగుల భారీ అక్రమంగా హోర్డింగ్ ఈదురుగాలుల ధాటికి సాయంత్రం కుప్పకూలింది. అది పక్కనే ఉన్న పెట్రోల్ బంకుపై పడటంతో తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారు. హోర్డింగ్ కింద 100 మందికి పైగా చిక్కుకున్నట్లు అధికారులు చెబుతున్నారు! గాయపడ్డ 65 మందిని ఆసుపత్రికి తరలించారు. ఇంకా హోర్డింగ్ కిందే చిక్కుకున వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషణ్ గగ్రానీ చెప్పారు. జాతీయ విపత్తు స్పందన బృందంతో పాటు అధికార యంత్రాంగం హుటాహుటిన రంగంలోకి దిగింది. భారీ హైడ్రా క్రేన్లు తదితరాలతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు పెట్రోల్ బంక్‌లో కనీసం 30కి పైగా ఆటోలు, బస్సులు, లగ్జరీ కార్లున్నట్లు ఒక కానిస్టేబుల్ తెలిపారు. వాటిలో పలు వాహనాలు హోర్డింగ్ కిందే చిక్కుకుపోయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగేలా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాదస్థలిని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు.



పక్కకు ఒరుగుతున్న హోర్డింగ్



నేలకూలిన హోర్డింగ్

రైళ్లు, విమానాలకు అంతరాయం

గాలివాన ధాటికి ముంబైలో పలు ఇతర చోట్ల కూడా బిల్ బోర్డులు, హోర్డింగులు కూలిపడ్డాయి. వడాల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ కూలి ముగ్గురు గాయపడ్డారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు నేలకొరిగిన ఉదంతాల్లో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కనీసం మరో నలుగురు మరణించినట్టు సమాచారం. ప్రతికూల వాతావరణం వల్ల సోమవారం గంటపాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. గాలి దుమారం ధాటికి ఏమీ కనిపించని పరిస్థితి నెలకొనడంతో పలు విమానాలను దారి మళ్లించారు. మెట్రో, లోకల్ రైళ్ల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నగరంలో సోమవారం అర్ధరాత్రి దాకా ఈదరగాలులు, ఉరుములు, మెరుపులతో వాన కొనసాగింది. థానె, పాల్ఘర్ తదితర ప్రాంతాల్లోనూ గాలివాన బీభత్సం సృష్టించింది.

రష్యా నూతన రక్షణ మంత్రిగా ఆండ్రీ బెలౌసోవ్

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా ఐదో విడత బాధ్యతలు చేపట్టిన వ్లాదిమిర్ పుతిన్ మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరించారు. రాజ్యాంగం ప్రకారం శనివారం మంత్రివర్గం మొత్తం రాజీనామా చేసింది. పాత కేబినెట్‌లో రక్షణ మంత్రి సెర్గీ షోయిగుకు మాత్రమే అవకాశమివ్వలేదు. రక్షణ శాఖ సహాయ మంత్రి తిమూర్ ఇవనోవ్ అవినీతి ఆరోపణలతో అరెస్ట్ కావడంతో షోయిగుకు పదవీ గండం తప్పదని కొన్ని రోజులుగా వస్తున్న వార్తలు నిజమయ్యాయి. ఆదివారం అధ్యక్షుడు పుతిన్ నూతన రక్షణ మంత్రిగా ఆండ్రీ బెలౌసోవ్(65)ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. షోయిగుకు రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించారు. ఆండ్రీ బెలౌసోవ్ 2020 నుంచి ఫస్ట్ డిప్యూటీ ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారు. అంతకుముందు ఏడేళ్లపాటు పుతిన్ సలహాదారుగా ఉన్నారు. కొత్త ఆవిష్కరణలకు, నూతన ఆలోచనలకు అనుగుణంగా రక్షణ శాఖను తీర్చిదిద్దేందుకే బెలౌసోవ్‌ను నియమించినట్లు అధ్యక్ష భవనం తెలిపింది.

హెచ్‌డీ రేవణ్ణకు బెయిల్

బెంగళూరు: కిడ్నాప్ కేసులో అరెస్టయిన మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఈనెల 4న రేవణ్ణను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

ఓటుకు 'గుర్తు'గా




బిహార్‌లోని సమస్తిపూర్‌లో..



పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లో..



తిరుపతిలో..



మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో రెండు చేతులూ లేని దివ్యాంగుడు.. కాలికి ఉన్న సిరా గుర్తును చూపిస్తున్న దృశ్యం

ఎలక్షన్ బీట్

మహిళలకు 'మహాలక్ష్మి' గ్యారెంటీ: సోనియా

న్యూఢిల్లీ: ప్రస్తుత కష్టకాలంలో మహిళలు పడుతున్న అవస్థలను కాంగ్రెస్ పార్టీ తొలగిస్తుందని, ఇదే పార్టీ గ్యారెంటీ అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చెప్పారు. ఈ మేరకు సోమవారం సోనియా ఒక వీడియో సందేశం ఇచ్చారు. '' ప్రియమైన సోదరీమణులారా.. మహిళలు దేశ స్వాతంత్రోద్యమం నుంచి నవభారత నిర్మాణం దాకా తమ వంతు అద్భుత తోడ్పాటునందించారు. అయితే మహిళలు ప్రస్తుతం ద్రవ్యోల్బణం మాటున సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. మహిళల కష్టానికి సరైన న్యాయం దక్కేలా కాంగ్రెస్ విప్లవాత్మకమైన గ్యారెంటీని ఇస్తోంది. కాంగ్రెస్ మహాలక్ష్మీ పథకం ద్వారా పేద కుటుంబంలోని మహిళకు ఏటా రూ.1లక్ష సాయం అందించనుంది. ఇప్పటికే అమలవుతున్న పథకాలతో కర్ణాటక, తెలంగాణలో ప్రజల జీవితాలు మెరుగయ్యాయి. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, ఆహార భద్రతా చట్టాలలాగే కాంగ్రెస్ తాజాగా కొత్త పథకాన్ని ముందుకు తేనుంది. కష్టకాలంలో ఎల్లప్పుడూ కాంగ్రెస్ ఆపన్నహస్తం అందిస్తుంది' అని ముగించారు. సోనియా సందేశాన్ని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీ 'ఎక్స్'లో షేర్‌చేశారు. సోనియా సందేశంపై రాహుల్ స్పందించారు. '' పేద కుటుంబాల మహిళలు ఒక్కటి గుర్తుంచుకోండి. మీ ఒక్క ఓటు ఏటా మీ ఖాతాలో జమ అయ్యే రూ.1 లక్షతో సమానం. పెరిగిన ధరవరలు, నిరుద్యోగ కష్టాల్లో కొట్టుమిట్లాడుతున్న పేద మహిళలకు మహాలక్ష్మీ పథకం గొప్ప చేయూత. అందుకే ఓటేయండి' అని అన్నారు.

నేడు వారణాసిలో మోదీ నామినేషన్

హాజరవనున్న 12 మంది సీఎంలు, కేంద్ర మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మంగళవారం యూపీలోని వారణాసి లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమంలో బీజేపీ పాలిత, మిత్రపక్షాల రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

సీఎంలకు ఆహ్వానాలు

వారణాసిలో ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆహ్వానాలు అందుకున్న ముఖ్యమంత్రుల్లో యోగి (ఉత్తరప్రదేశ్), నితీశ్ కుమార్ (బిహార్), పుష్కర్ ధామి (ఉత్తరాఖండ్), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), విష్ణు దేవ్ సాయ్ (ఛత్తీస్‌గఢ్), ఏక్‌నాథ్ షిండే (మహారాష్ట్ర), భజన్ లాల్ శర్మ (రాజస్థాన్), హిమంత బిశ్వ శర్మ (అస్సాం), నయాబ్ సైనీ (హరియాణా), ప్రమోద్ సావంత్ (గోవా), ప్రేమ్ సింగ్ తమంగ్ (సిక్కిం), మాణిక్ సాహా (త్రిపుర) ఉన్నారు. ఎన్డీఏ పక్షాల నేతలు, కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు.

ప్రజలు ఎన్‌డీఏతో ఉన్నారు: మోదీ

న్యూఢిల్లీ: నాలుగో దశలో 64 శాతానికిపైగా పోలింగ్ నమోదవడంపై ప్రధాని మోదీ స్పందించారు. '' ఈరోజు(సోమవారం) ఓటేసిన ఓటర్లకు నా కృతజ్ఞతలు. ఇంతటి చక్కటి పోలింగ్ శాతం చూస్తుంటే సుస్థిరాభివృద్ధి ప్రభుత్వం వైపే ఓటర్లు మొగ్గుచూపుతున్నట్లు అర్థమవుతోంది. ప్రజలు ఎన్‌డీఏతోనే ఉన్నారు. విపక్షాల కూటమి గురించి జనం మాట్లాడుకోవడం మానేశారు. గతంలో ఎన్నడూలేనంతగా శ్రీనగర్‌లో జనం మెరుగైన పోలింగ్‌ను నమోదుచేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ప్రజలు తమ ఆకాంక్షలు నెరవేరబోతున్నాయని ఇలా పోలింగ్ ద్వారా వ్యక్తపరిచారు' అని అన్నారు.

మోదీ గెలిస్తే ఇక ఎన్నికలుండవు: ఖర్గే

హజారీబాగ్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ప్రధాని మోదీ గెలిస్తే భవిష్యత్తులో ఇక ఎన్నికలనేవే ఉండవని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు లేకుంటే బానిసలుగా మారిపోతారన్నారు. జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ఖర్గే మాట్లాడారు. మాజీ సీఎం హేమంత్‌ను జైలుకు పంపించారు.. చేతనైతే అదానీ, అంబానీలను అరెస్ట్ చేయాలని మోదీకి సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వస్తే బీజేపీ అరెస్ట్ చేయించిన కూటమి నేతలకు స్వేచ్ఛ కల్పిస్తామన్నారు.

సుశీల్ కుమార్ మోదీ కన్నుమూత

పట్నా: బిహార్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోదీ(72) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రాజ్యసభ ఎంపీగాను, 2004 ఎన్నికల్లో భాగల్పూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2005లో ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఎమ్మెల్సీగా ఎన్నికై, డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సుశీల్‌కుమార్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుడంకుళంలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

కొరుక్కుపేట: కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం 2వ రియాక్టర్‌లో నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. కూడంకుళం న్యూక్లియర్ రియాక్టర్‌లో ప్రస్తుతం 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో 2 రియాక్టర్లు పనిచేస్తున్నాయి. ఇది కాకుండా, 3, 4, 5, 6 రియాక్టర్ల నిర్మాణం పురోగతిలో ఉంది. ఈ నేపథ్యంలో 2వ రియాక్టర్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనుల కోసం సోమవారం ఉదయం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. దీనివల్ల 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని అధికారులు పేర్కొన్నారు.

గ్రేటర్ విస్తరణ!

రాజధాని నగరం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మరింతగా పెరగనుంది. వార్డుల సంఖ్య 200 నుంచి 250కు పెరగనుంది. అలాగే మండలాల సంఖ్యను 15 నుంచి 23కు పెంచనున్నారు. ఈ గ్రేటర్ పరిధిలోకి శివారు జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న యాభై పంచాయతీలను విలీనం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తు శరవేగంగా సాగుతున్నాయి.

- చెన్నైలో పెరగనున్న వార్డులు, మండలాల సంఖ్య
- 200 నుంచి 250కు చేరనున్న వార్డులు
- 15 నుంచి 23కు మండలాలు
- 50 పంచాయతీల విలీనం
- శరవేగంగా కసరత్తు


చెన్నై వ్యూ

సాక్షి, చెన్నై: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌గా ఉన్న రాష్ట్ర రాజధాని నగరం విద్యా, వైద్య, వ్యాపార, పారిశ్రామిక తదితర రంగాలలో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. అలాగే, జనాభా సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. 2011లో తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల పరిధిలోని శివారు ప్రాంతాలను చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(సీఎండీఏ) పరిధిలోకి తీసుకొచ్చి నగరం విస్తీర్ణం 1,189 చదరపు కిలో మీటర్ల దూరంగా నిర్ణయించారు. అదే సమయంలో 174 చదరపు కి.మీ దూరం ఉన్న చెన్నై కార్పొరేషన్ పరిధిని గ్రేటర్ చెన్నైగా 424 చదరపు కి.మీ విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ విస్తీర్ణం చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, రాణి పేట జిల్లాలలోని ప్రాంతాలను పూర్తిగా తీసుకొచ్చే విధంగా 1,189 చ.కి.మీ నుంచి 5,904 చదరపు కి.మీగా విస్తరించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆ జిల్లాలోని 1225 గ్రామాలు చెన్నై 'మహా'నగరం పరిధిలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. మరో ఏడాదిలో మూడో మాస్టర్ ప్లాన్‌గా ఇది సీఎండీఏ పరిధిలో కార్యరూపం దాల్చబోతోంది. అదే సమయంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిని కూడా విస్తరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

పెరగనున్న వార్డుల సంఖ్య

చెన్నై కార్పొరేషన్ ఇది వరకు 174 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్నప్పుడు 155 వార్డులు ఉండేవి. 2011లో విస్తీర్ణం 424 చదరపు కి.మీ పెరగడంతో వార్డుల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం 200 వార్డులు, 15 మండలాలు ఉన్నాయి. అలాగే చెన్నై శివారులలో ఇటీవల తాంబరం, ఆవడి కొత్త కార్పొరేషన్లు రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుతం సీఎండీఏ పరంగా విస్తీర్ణం పెరగనుండడంతో చెన్నై కార్పొరేషన్ విస్తీర్ణంతోపాటు వార్డుల సంఖ్యను పెంచేందుకు సిద్ధమయ్యారు. వార్డుల సంఖ్యను 250గా పెంచే విధంగా విభజన ప్రక్రియకు కసరత్తు చేస్తున్నారు. అలాగే మండలాల సంఖ్యను 15 నుంచి 23కు పెంచేందుకు సిద్ధమయ్యారు. ఈ విస్తరణలో భాగంగా చెంగల్పట్టు జిల్లా పరిధిలోని తిరుప్పోరూర్, షోళింగనల్లూరు, తిరువళ్లూరు జిల్లా పరిధిలోని మదుర వాయిల్, పూందమల్లి, మాధవరం, పొన్నేరి, కాంచీపురం జిల్లా పరిధిలోని ఆలందూరు, శ్రీపెరంబదూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 50 పంచాయతీలను చెన్నై కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. చెన్నై శివారులలో ఉన్న ఈ ప్రాంతాలన్నీ అభివృద్ధి పరంగా, నిర్మాణాల పరంగా దూసుకెళ్తోన్నాయి. దీంతో ఈ పంచాయతీలన్నీ కార్పొరేషన్ పరిధిలో వార్డులుగా మారనున్నాయి. దీంతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో వార్డుల సంఖ్య 250గా పెరగనున్నాయి. ఈ ప్రాంతాలు గ్రేటర్ చెన్నై పరిధిలోకి రాబోతున్న నేపథ్యంలో తాంబరం, ఆవడి కార్పొరేషన్ల పరిధి సైతం విస్తరించాల్సిన అవశ్యం ఏర్పడి ఉంది. ఇందుకు సంబంధించిన అంశాలపై సైతం అధికారులు పరిశీలన జరుపుతున్నారు.

చెన్నైలో చేరనున్న పంచాయతీలు ఇవే..


చెన్నై కార్పొరేషన్ భవనం

తిరుప్పోరూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో: నావలూరు, తాలంబూరు, సిరుచ్చేరి, పుదుపాక్కం, కానాత్తూరు, ముట్టుకాడు, కోవళం
షోళింగనల్లూరు నియోజక వర్గంలో: మేడవాక్కం, పెరుంబాక్కం, నన్ మంగలం, కోవిలంబాక్కం, చిత్తాల పాక్కం, వేంగై వాసల్, కొట్టియంబాక్కం
ఆలందూరు నియోజకవర్గంలో: మూవరసంపట్టు, అయ్యప్పన్ తాంగల్, కొల పాక్కం, గెరుగంబాక్కం, భరణిపుత్తూరు, మౌళివాక్కం, తరపాక్కం, కోవూరు, పెరియ పనిచ్చేరి, ఎరండాం కట్టలై, తండలం శ్రీపెరంబదూరు
అసెంబ్లీ పరిధిలో: మలయం పాక్కం, కొల్లిచ్చేరి, కొలుమని వాక్కం, మదుర వాయిల్ పరిధిలోని వానగరం, అడయాలం పట్టు, అయపాక్కం, పూందమల్లి కాట్టుపాక్కం, సెన్నీర్ కుప్పం, నసరత్ పేట, పెంబూరు, అగరం మేల్, వరద రాజ పురం, పారివాక్కం మాధవరం
అసెంబ్లీ పరిధిలో: అన్నంపేడు, వెల్లనూరు, మేర్లై, వడగర్లై, కిరండలైన్, పుల్లిలైన్, తీర్థగిరియం పట్టు, విలాంకోడు పాక్కం, అలింజివాక్కం, సెండ్రం బాక్కం, పొన్నేరి అసెంబ్లీ పరిధిలో: వీచ్చూర్, వెళ్లివాయల్ చావడి

న్యూస్‌రీల్

వడపళనిలో ఘనంగా ధ్వజారోహణం

తిరువొత్తియూరు: వడపళని మురుగన్ ఆలయంలో సోమవారం ధ్వజారోహణంతో వైశాఖ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చెన్నై వడపళని మురుగన్ ఆలయంలో వైశాఖ విశాఖ నక్షత్రాన్ని పురస్కరించుకొని 10 రోజులకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలం సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు వల్లి, దేవానై సమేత సుబ్రహ్మణ్యస్వామిని తిరుమాడ వీధులలో ఊరేగించారు. 21వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు.

నా ప్రాణాలకు ముప్పు

- సౌక్ శంకర్ ఆరోపణ

సాక్షి, చెన్నై: తన ప్రాణాలకు ముప్పు ఉందని యూట్యూబర్ సౌక్ శంకర్ పోలీసులపై ఆరోపించారు. తన చేతులు విరగొట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు.. యూట్యూబర్ సౌక్ శంకర్ తన ఛానల్ వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. మహిళా పోలీసులు, అధికారినులపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు చర్చకెక్కాయి. తొలుత కోయంబత్తూరు పోలీసులు, తర్వాత చెన్నై పోలీసులు ఆయనపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. సౌక్ శంకర్‌పై గుండా యాక్ట్‌ను ప్రయోగించారు. ఈ పరిస్థితులలో సోమవారం కోయంబత్తూరు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం సౌక్ శంకర్‌ను పోలీసులు తీసుకొచ్చారు. ఈ సమయంలో ఆయన నినాదాలతో హోరెత్తించాడు. తనను చంపేస్తారని, తన ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. పోలీసులు తన చేతిని విరగొట్టేశారని ఆరోపించాడు.

సీబీఎస్ఈ ఫలితాల విడుదల

సాక్షి, చెన్నై : సీబీఎస్ఈ పది, ప్లస్–2 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సీబీఎస్ఈ బోర్డు వర్గాలు ఈ ఫలితాలను వెల్లడించాయి. దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు, ఫిబ్రవరి, మార్చి నెలలో జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోనూ లక్షలాది మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలుత ఈనెల 10వ తేదీ ఫలితాల విడుదలవుతాయని భావించారు. అయితే ఈనెల 20వ తేదీలోపు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో సోమవారం డివిజన్ల వారీగా ఫలితాలను విడుదల చేశారు. సీబీఎస్ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థులు ఫలితాలను తెలుసుకున్నారు. ఉత్తీర్ణులైన వారు అధికంగానే ఉన్నట్టు చెన్నై డివిజన్ అధికారులు పేర్కొన్నారు.

గంజాయి స్మగ్లర్‌కు పదేళ్ల జైలు

- మద్రాసు కోర్టు తీర్పు

అన్నానగర్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న కేసులో అరెస్టయిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మద్రాసు కోర్టు తీర్పు నిచ్చింది. వివరాలు.. కాంచీపురం పరిధిలోని పొన్నియమ్మన్ పట్టరై టోల్‌గేట్ సమీపంలో 2022లో బెంగళూరు జాతీయ రహదారిపై కారులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మదురై ఉసిలంబట్టికి చెందిన నీలమలై (40)ని యాంటీ నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ అరెస్టు చేసింది. అతను ప్రయాణించిన కారులో నుంచి 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక కోర్టులో న్యాయమూర్తి జూలియట్ పుష్ప ఆధ్వర్యంలో ఈ కేసు విచారణ సాగింది. సోమవారం కేసును విచారించిన న్యాయమూర్తి నీలమలపై అభియోగం రుజువవడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బాలికను గర్భవతిని చేసిన 9 మందిపై పోక్సో కేసు

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు

అన్నానగర్: తిరుపూర్ జిల్లా ఉడుమలై ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక తన తాతయ్య ఇంట్లో ఉంటోంది. గత కొద్ది రోజులుగా బాలిక అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. ఆ సమయంలో బాలిక 4 నెలల గర్భవతి అని తేలింది. ఆ తర్వాత బాలిక బంధువులు ఆమెను ప్రశ్నించగా.. ముగ్గురు అబ్బాయిలు సహా 9 మంది తనను తీసుకెళ్లి లైంగికంగా వేధించారని చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఉడుమలై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు జయకాలీశ్వరన్ (19), మదన్ కుమార్ (19), భరణికుమార్ (21), ప్రకాష్ (24), నందగోపాల్ (19), భావభారతి (22), 14, 15, 16 ఏళ్ల విద్యార్థులు సహా 9 మందిని అరెస్టు చేశారు. వీరంతా ఉడుమలై ప్రాంతానికి చెందిన వారు. అనంతరం వారందరినీ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఐపీఎల్ టికెట్‌ను బ్లాక్‌లో విక్రయించిన 10 మంది అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై చేపాక్కం స్టేడియం సమీపంలో ఐపీఎల్ టికెట్లును బ్లాక్‌లో విక్రయించిన 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై చేపాక్కంలో సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఆదివారం క్రికెట్ పోటీలు జరిగాయి. ఆదివారం సెలవు దినం కావడంతో టికెట్లు తీసుకోవడంలో తీవ్రమైన పోటీ నెలకొంది. ట్రిప్లికేన్ పోలీసులు సాధారణ దుస్తులతో ఆ ప్రాంతంలో తీవ్రంగా నిఘా వేశారు. ఆ సమయంలో ఓ ముఠా అధిక ధరకు టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు 10 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 27 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.




కమనీయం.. పుష్పాభిషేకం

ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) – చెన్నై ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పుష్పాభిషేకం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా ఆదివారం రాత్రి జరుపుకోగా, భక్తుల హరే రామ హరే కృష్ణ నామస్మరణతో ఇస్కాన్ ప్రాంగణం మారుమోగింది. ఈ పండుగ సందర్భంగా వందల కిలోల రంగురంగుల, సువాసనలు వెదజల్లే పువ్వులతో స్వామిని నేత్రపర్వంగా అభిషేకించారు. స్వామి, దేవతలు ఉత్కంఠ భరితమైన పూలతో నిండిపోయి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు నైవేద్యం అందించారు.

- కొరుక్కుపేట

ఎంపీ సెల్వరాసు అస్తమయం

- అనారోగ్యంతో మృతి
- నేడు అంత్యక్రియలు
- సీఎం సహా పలువురి నేతల సంతాపం


సెల్వరాసు (ఫైల్)

సాక్షి, చెన్నై: నాగపట్నం సీపీఐ ఎంపీ సెల్వరాసు (67) అస్తమించారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన ఆయన సోమవారం వేకువ జామున కన్ను మూశారు. ఈ సమాచారంతో సీపీఐ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. మంగళవారం తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడి సమీపంలోని స్వగ్రామంలో అంత్యక్రియలు జరగనున్నాయి. వివరాలు.. నాగపట్నం లోక్‌సభ నుంచి 2019 ఎన్నికలలో సీపీఐ అభ్యర్థిగా సెల్వరాజు పోటీ చేసి గెలిచారు. తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడి సమీపంలోని కోవిల్‌చిత్త మల్లి గ్రామానికి చెందిన సెల్వరాసు నాగపట్నం అభివృద్ధికి విశేష కృషి చేశారు. 1989, 1996,1998లలో సైతం ఆయన నాగపట్నం నుంచి లోక్ సభలో అడుగు పెట్టారు. ఐదో సారిగా సైతం ఆయనకు పోటీ చేసే అవకాశం వచ్చినా, అనారోగ్య కారణాలతో తిరస్కరించారు. ఊపిరితిత్తులు, కిడ్నీ సమస్యతో తొలుత తిరువారూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన ఆయన్ని ఈనెల 2వ తేదీన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ వచ్చిన సెల్వరాసు సోమవారం వేకువ జామున 2.40 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ సమాచారంతో సీపీఐ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి.

స్వగ్రామానికి తరలింపు

ప్రైవేటు ఆస్పత్రిలో ఉంచిన ఆయన భౌతిక కాయానికి సీపీఐ, సీపీఎం, డీఎంకే, వీసీకే, కాంగ్రెస్, అన్నాడీఎంకే, తదితర పార్టీల నేతలు నివాళులర్పించారు. ఇక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో మన్నార్‌కుడి సమీపంలోని కోవిల్‌చిత్తమల్లి గ్రామానికి తరలించారు. ఆయన పార్థీవ దేహాన్ని పార్టీ వర్గాలు, ఆప్తుల సందర్శనార్థం ఉంచారు. మంగళవారం ఉదయంపది గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి. సెల్వరాసుకు భార్య కమలావదనం, కుమార్తెలు ప్రియ , దర్శిని ఉన్నారు. సెల్వరాసు మరణ సమాచారంతో సీఎం ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత బాలకృష్ణన్, వీసీకే నేత తిరుమావళవన్, ఎండీఎంకే నేత వైగో తదితరులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఆయన సేవలను స్మరిస్తూ సీపీఐకు తీరనిలోటుగా పేర్కొన్నారు.

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్య

- కుమార్తెను హతమార్చి తల్లిదండ్రుల బలన్మరణం
- మాధవరంలో ఘటన

సాక్షి, చెన్నై: సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు చేసిన అప్పులు ఓ కుటుంబానికి భారంగా మారింది. దీనికితోడు ఇంటి పనులు అసంపూర్తిగా మిగలడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరగడంతో బలన్మరణానికి పాల్పడ్డారు. తమ కుమార్తెను ఉరివేసి చంపేసినానంతరం ఆ తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం మాధవరం మిల్క్ డిపో సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. చెన్నై శివారులోని మాధవరం మిల్క్ డిపో సమీపంలోని పెరియ సెక్కాడు గ్రామం కృష్ణప్పన్ వీధికి చెందిన జగన్నాథన్(40) మనలి మార్కెట్‌లో చిరుధాన్యాల వ్యాపారం చేస్తున్నాడు. ఆయనకు భార్య లోకేశ్వరి(35), కుమార్తె కావ్య(13) ఉన్నారు. కావ్యా స్థానికంగా ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే జీవనం సాగిస్తూ వచ్చారు. సెక్కాడులోని తనకు ఓ స్థలం ఉండడంతో అక్కడ సొంతింటిని కట్టుకునేందుకు నిర్ణయించారు. ఈ పనులు మొదలెట్టారు. ఇందుకోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ఇంటి పనులు పూర్తికాక పోవడం, వ్యాపారం తగ్గడంతో అప్పులు భారంగా మారాయి. ఒకరి వద్ద తీసుకున్న అప్పు చెల్లించేందుకు మరొకరి వద్దు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది మరింత భారంగా నెత్తి మీద కూర్చోవడంతో బలవన్మరణానికి జగన్నాథన్ సిద్ధమయ్యారు.

ఉరివేసుకుని..

సోమవారం ఉదయం వీరి ఇంటి తలుపులు ఎంతకు తెరచుకోక పోవడంతో ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. లోనికి వెళ్లి చూడగా దంపతులు ఇద్దరూ ఉరికి వేలాడుతుండటం వెలుగు చూసింది. వారిద్దరికి సమీపంలో కావ్యా సైతం మృతదేహంగా పడి ఉండటాన్ని గుర్తించారు. ఆ ఇంట్లో లభించిన లేఖ ఆధారంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్టు తేలింది. తొలుత కావ్యాను ఉరివేసి చంపేసి, ఆ తర్వాత దంపతులు ఇద్దరు బలన్మరణానికి పాల్పడినట్టుగా పోలీసులు నిర్ధారించారు. ఇన్‌స్పెక్టర్ వేలుమణి నేతృత్వంలోని బృందం కేసు నమోదు చేసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ఆసుపత్రి మార్చురికి తరలించారు. జగన్నాథన్ తన లేఖలో అద్దెకు ఉంటున్న ఇంటి ఓనర్‌ను తొలుత క్షమాపణ కోరాడు. అద్దెకు ఉన్న ఇంట్లో ఇలా బలన్మరణానికి పాల్పడటం తప్పు అని, అయితే, తమ పరిస్థితులు దయనీయంగా మారినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల భారం పెరిగిందని, సొంతింటి కల చెదిరిందని, ఇక జీవితాన్ని ముగిస్తున్నట్లు వివరించారు. తమ శవాలను అనాథలుగా భావించి అంత్యక్రియలు జరిపించాలని ప్రత్యేకంగా పోలీసులను జగన్నాథన్ విజ్ఞప్తి చేయడం చూపరులను కంటతడి పెట్టించింది.

గుండా యాక్ట్ నమోదు చేయాల్సిందే..!

- దురై వైగో డిమాండ్


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న దురై వైగో

సాక్షి, చెన్నై: నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారు చేస్తున్న పరిశ్రమల యజమానులు, లీజు దారులపై గుండా యాక్ట్‌ను ప్రయోగించాలని ఎండీఎంకే నేత దురైవైగో డిమాండ్ చేశారు. వివరాలు.. విరుదునగర్ జిల్లాశివకాశి సమీపంలోని సెంగమల పట్టి గ్రామంలోని పరిశ్రమలో జరిగిన బాణసంచా పేలుడు గురించి తెలిసిందే. ఇందులో 10 మంది మరణించారు. 16 మంది గాయపడ్డారు. మరణించిన వారి కుటుంబాలను సోమవారం ఎండీఎంకే నేత దురై వైగో పరామర్శించారు. చొక్కలింగాపురం, చిన్నయ్యపురం, అయ్యాపురం తదితర గ్రామాలకు నేరుగా వెళ్లి బాధిత కుటుంబాలను ఓదార్చారు. శివకాశి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దురై వైగో మాట్లాడుతూ, నిబంధనలు ఉల్లంఘించి బాణసంచా తయారు చేస్తున్న పరిశ్రమలపై కొరడా ఝుళిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. లీజుదారులు సైతం ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. ఇలాంటి వారిపై గుండా చట్టం ప్రయోగించి కటకటాలలోకి నెట్టాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తజన సందడి



తిరుత్తణి పురాతన ద్రౌపదీదేవి ఆలయంలో అగ్నిగుండ వేడుకలు సందర్భంగా ఆదివారం వేలాది మంది ఆలయం వద్ద పోటెత్తారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో పది వేలకు పైబడిన భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో తిరుత్తణి పట్టణంలో సందడి నెలకొంది. - తిరుత్తణి





చెన్నై
మంగళవారం, 14, మే, 2024
సాక్షి

క్లుప్తంగా

లారీ ఢీకొని మహిళ మృతి

అన్నానగర్: లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. అంబత్తూరు సమీపంలోని పుదూరు, తిరువళ్లువర్ వీధికి చెందిన రమేష్ భార్య రాధిక (44) పూల వ్యాపారం చేస్తోంది. సోమవారం ఉదయం పూలు కొనుగోలు చేసేందుకు స్కూటీలో కోయంబేడు మార్కెట్‌కు వచ్చింది. కోయంబేడు రోడ్డుపై వెళుతుండగా లారీ స్కూటీని ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన రాధికను చికిత్స నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కోయంబేడు ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్ నాగనాథన్(51)ను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌లో పడి బాలుడు..

అన్నానగర్: మీంజూరు సమీపంలోని ఇటుక బట్టీల సముదాయంలోని వాటర్ ట్యాంక్‌లో పడి ఏడాదిన్నర వయస్సున్న బాలుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుదర్శన్ (40) తిరువళ్లూరు జిల్లా మీంజూర్ సమీపం వలుదిగైమేడు గ్రామంలో ఇటుక బట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కళావతి (30). వీరికి ఇద్దరు కుమార్తెలు దర్శ (7), సారథి (3) ఉన్నారు. ఇతనికి సిరియాక్ అనే ఏడాదిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. సుదర్శన్ కుటుంబంతో కలిసి ఇటుక బట్టీలో ఉంటూ పని చేసేవాడు. ఆదివారం ఇంటి బయట పిల్లవాడు సిరియాక్ ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా సిరియాక్ ఇటుక బట్టీల సముదాయంలోని వాటర్ ట్యాంక్‌లో పడిపోయాడు. కాసేపటి తర్వాత అక్కడికి వచ్చిన కళావతి గుర్తించి చిన్నారిని బయటకు తీసి పాడియనల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. మీంజూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె పెళ్లి పత్రికలో బంధువు పేరు పెట్టలేదని తల్లి ఆత్మహత్య

అన్నానగర్: కుమార్తె వివాహ ఆహ్వానపత్రికలో బంధువు పేరు పెట్టలేదని పెళ్లికూతురి తల్లి ఆత్మహత్య చేసుకుంది. కడలూరు జిల్లా కాట్టుమన్నార్ కోయిల్ సమీపంలోని రుద్రచోళై మేలతేరుకు చెందిన కమలకన్నన్ (52) మేస్త్రి. ఇతని భార్య మాలతి (38). వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. ఈ క్రమంలో కూతురు సత్యకళ వివాహం ఈనెల 27న జరగనుంది. ఇందుకోసం వివాహ ఆహ్వాన పత్రికలను ముద్రించి బంధువులకు అందజేశారు. ఆ ఆహ్వానపత్రికలో మాలతి బంధువు ఒకరి పేరు ప్రస్తావించలేదని తెలుస్తోంది. ఈ విషయమై మాలతి భర్త కమలకన్నన్‌ను ప్రశ్నించింది. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో మాలతి ఇంటి వెనుక ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గంగమ్మ రథోత్సవం

వేలూరు: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన గుడియాత్తం గంగమ్మ రథోత్సవం సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం తమిళ వైగాసి మాసం మొదటి వారంలో ఆలయ జాతర నిర్వహించడం ఆనవాయితీ. వీటిలో వేలూరు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఉదయం శిరస్సు ఉత్సవం జరగనున్న నేపథ్యంలో అమ్మవారిని, రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని రథంలో కొలువుదీర్చి, పట్టణ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. భక్తులు రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వివిధ వేషాధారణల్లో వచ్చి, అమ్మవారికి అంబలి పోసి పూజలు చేశారు. అనంతరం రథం గోపాలపురం, నడుపేట, తదితర గ్రామాల్లో రథోత్సవం సాగింది. భక్తుల తొక్కిసలాట లేకుండా ఎస్పీ రాజేష్ కన్నన్ అధ్యక్షతన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడేళ్లు ఉత్సవాలు నిర్వహించకుండా ప్రస్తుతం రథోత్సవం నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, రథాన్ని లాగారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శిరస్సు ఉత్సవం జరగనుంది.



విశేషాలంకరణలో అమ్మవారు



గంగమ్మ రథోత్సవంలో భక్త జన సందోహం

రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ మృతి

అన్నానగర్: రోడ్డు ప్రమాదంలో వంట మాస్టర్ మృతి చెందాడు. తిరువారూరు జిల్లాకు చెందిన పళని (60) చెన్నైలోని పెరుంగళత్తూరులోని ఓ ప్రముఖ ప్రైవేట్ రెస్టారెంట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. చెంగల్‌పట్టు సమీపంలోని పరనూర్‌లోని తన కుమార్తె ఇంట్లో ఆదివారం రాత్రి బస చేసిన పళని సోమవారం తెల్లవారుజామున ఉద్యోగానికి వెళ్లాడు. పరనూర్ వద్ద పెరుంగళత్తూర్‌కు వెళ్లే బస్సును ఎక్కేందుకు హడావుడిగా జీఎస్టీ రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి తిరుచ్చి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

77 ఏళ్ల వృద్ధుడికి అధునాతన హార్ట్ వాల్వ్

• విజయవంతంగా అమర్చిన చెన్నై వైద్యులు

సాక్షి, చెన్నై: ఎస్‌ఆర్‌ఎం గ్లోబల్ ఆసుపత్రిలో 77 ఏళ్ల వృద్ధుడికి తొలిసారి హార్ట్ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చారు. ఈ వాల్వ్‌కు ఎడ్వర్డ్స్ స్పాయిన్ 3 అల్ట్రా అని నామకరణం చేశారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత అధునాతన, సురక్షితమైన గుండె కవాటాలలో ఒకటని ఎస్‌ఆర్‌ఎం గ్లోబల్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ పి. సత్యనారాయణన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ టీఆర్ మురళీ ధరన్ ప్రకటించారు. ఈ శస్త్ర చికిత్స గురించి సోమవారం స్థానికంగా వారు వివరించారు. ఈ రోగికి 12 ఏళ్ల క్రితం బైపాస్ సర్జరీ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం గుండె సంబంధిత సమస్యలతో పరిస్థితి తీవ్రతరం అయ్యింది. వృద్ధాప్యాన్ని పరిగణలోకి తీసుకుని మళ్లీ ఓపెన్ హార్ట్ సర్జరీ అసాధ్యంగా మారిందన్నారు. దీంతో ట్రాన్స్ కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ సర్జరీని ఎంపిక చేశామన్నారు. ఆధునిక పద్ధతిని అనుసరించి ఈ అధునాతన కృత్రిమ బృహద్ధమని కవాటాన్ని అమర్చినట్లు వివరించారు. ఈ వయసులో ఈ కవాటాన్ని దేశంలోనే అమర్చుకున్న తొలి రోగి ఈయనే అని పేర్కొన్నారు.



హార్ట్ వాల్వ్‌తో వైద్య బృందం

పోలీసును బెదిరించిన మహిళపై కేసు

తిరువొత్తియూరు: కోవైలో పోలీసుకు వాట్సప్ గ్రూపులో బెదిరింపులకు పాల్పడిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోవై ఆర్‌ఎస్ పురం వెస్ట్ పొన్ను రంగం వీధికి చెందిన విశ్వాదర్శిని (44) ఈమె వాట్సాప్ గ్రూపులో పోలీసులను అసభ్యంగా మాట్లాడుతూ వీడియో విడుదల చేశారు. దీని ఆధారంగా సెల్వపురం పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను అరెస్టు చేశారు. ఆ మహిళ ఓ ట్రస్ట్ నడుపుతున్నారని ఈ క్రమంలో ఆమె కొన్ని సంఘటనలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారని అయినా చర్యలు చేపట్టకపోవడంతో పోలీసులను హెచ్చరిస్తూ విశ్వదర్శని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది.

మద్యం మత్తుతో ప్రయాణికుడు..

• విమానం నుంచి దించివేసిన అధికారులు

కొరుక్కుపేట: మద్యం మత్తులో ఐదేళ్ల కూతురితో చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లేందుకు వచ్చిన వ్యాపారిని అధికారులు విమానం నుంచి కిందకు దించేశారు. ప్రవీణ్ గాంధీ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యాపారి. ఇతను చెన్నైలో వ్యాపారం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా, ఆదివారం రాత్రి తన స్వగ్రామంలో జరగనున్న ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు అహ్మదాబాద్ వెళ్లడానికి విమానంలో తన 5 ఏళ్ల కుమార్తెతో కలిసి చెన్నై దేశీయ విమానాశ్రయానికి వచ్చారు. ఆ సమయంలో ప్రవీణ్ గాంధీ పూటుగా మద్యం తాగి తూలుతూ ఉన్నాడు. అతను చిన్నపిల్లతో ప్రయాణిస్తుండగా, భద్రతా అధికారులు సరైన తనిఖీ లేకుండా లోపలికి అనుమతించారు. విమానంలో కూర్చున్న ప్రవీణ్ గాంధీ మద్యం మత్తులో తోటి ప్రయాణికులతో గొడవకు దిగాడు. దీంతో అధికారులు రంగంలోకి దిగి ప్రవీణ్ గాంధీని, ఆయన 5 ఏళ్ల కుమార్తెను విమానం నుంచి దింపారు. ఫలితంగా, అహ్మదాబాద్ విమానం ఇతర ప్రయాణికులతో కలిసి చెన్నై నుంచి సుమారు గంటన్నర ఆలస్యంగా బయలుదేరింది. ఎయిర్‌పోర్టు పోలీసులు ప్రవీణ్ గాంధీని విచారించగా.. స్వగ్రామానికి వెళ్లాలనే ఆత్రుతతో అతిగా మద్యం సేవించినట్లు తెలిపాడు. దయచేసి క్షమించి తనను పంపించాలని వేడుకున్నాడు. ఆ సమయంలో చిన్నారితో పాటు మద్యం తాగి ప్రయాణిస్తున్న ఆయనకు పోలీసులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. తర్వాత, మత్తు దిగిన ప్రవీణ్ గాంధీ మరో విమానంలో అహ్మదాబాద్‌కు బయలుదేరాడు.

నిజాయితీ చాటుకున్న పాఠశాల విద్యార్థిని

• మహిళ పోగొట్టుకున్న పర్సు పోలీసులకు అప్పగింత

అన్నానగర్: ఓ మహిళ పోగొట్టుకున్న పర్సును అప్పగించి, ఓ విద్యార్థి తన నిజాయితీ చాటుకుంది. చెన్నై అమైందకరై తిరువీధి అమ్మన్ కోవిల్ వీధికి చెందిన శశికళ అన్నానగర్‌లోని టి.వి షోరూంలో పని చేస్తోంది. ఆదివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు అన్నానగర్ టవర్ పార్క్ బస్టాండ్ వద్ద నిల్చుంది. అనంతరం బస్సు ఎక్కిన తర్వాత పర్సు మాయమైనట్లు గుర్తించి షాక్‌కు గురైంది. అందులో రూ.13 వేలు నగదు, ఏటీఎం కార్డు, రేషన్ కార్డు, వెండి లాకెట్ ఉన్నాయి. దీంతో అన్నానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అదే అన్నానగర్ టవర్ పార్క్ బస్టాప్ వద్ద తన తండ్రితో కలిసి బస్సు ఎక్కేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థిని పూజకు బస్టాప్‌లో శశికళ వదిలిపెట్టిన పర్సు కనిపించింది. దానిని అన్నానగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించింది. అనంతరం శశికళను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు ఆమె పర్సును అప్పగించారు. అలాగే పర్సును అందజేసిన విద్యార్థి పూజను పోలీసులు అభినందించి రివార్డు అందించారు.



పోలీసుల ఆధ్వర్యంలో శశికళకు పర్సు అందజేస్తున్న పూజ

హజ్ యాత్రికులకు 18 వరకు టీకాల శిబిరం

కొరుక్కుపేట: తమిళనాడు నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు సోమవారం నుంచి ఈ నెల18వ తేదీ వరకు వైద్యశిబిరంతోపాటు ప్రత్యేక టీకాల శిబిరాన్ని నిర్వహించేందుకు ప్రజారోగ్య శాఖ ప్రణాళిక రూపొందించింది. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు వైద్య శిబిరాలు, టీకా శిబిరాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది. తమిళనాడు నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికుల కోసం సోమవారం నుంచి 18వ తేదీ వరకు వైద్య శిబిరం, టీకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించాలని ప్రజారోగ్య సంచాలకులు అన్ని జిల్లాల ఆరోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది భారత్ నుంచి 1,75,025 మంది హజ్ యాత్రకు వెళ్లనున్నారు. అందులో ఒక్క తమిళనాడు నుంచే 5,803 మంది ప్రయాణిస్తున్నారు. వారికి వైద్య పరీక్షలు, టీకాలు వెంటనే నిర్వహించాలని ప్రజారోగ్య శాఖ కోరింది. 9 జిల్లాల్లో హజ్ కమిటీ సహకారంతో జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో ఈ పనులు చేపట్టాలన్నారు. తమిళనాడులోని మొత్తం 38 జిల్లాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహించబోతున్నారు. చెన్నైలోని తమిళనాడు హజ్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో సోమవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 65 ఏళ్లు పైబడిన హజ్ యాత్రికులు కూడా ఈ కాలంలో సాధారణ వ్యాధులకు టీకాలు వేయాలని అధికారులు తెలిపారు.

సిమ్స్‌లో రిబ్ కేజ్ డిజార్డర్స్ కేంద్రం



పక్కటెముకల రుగ్మతలను గురించి విస్తరిస్తున్న డాక్టర్ వీవీ బాషి

కొరుక్కుపేట: పక్కటెముకల రుగ్మతలతో (రిబ్ కేజ్ డిజార్డర్స్) బాధపడుతున్న రోగుల కోసం సిమ్స్ ఆస్పత్రిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ అండ్ అయోర్టిక్ డిజార్డర్స్ (ఐసీడీఏ) తరఫున ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసినట్టు డాక్టర్ వీవీ బాషి తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఏ డైరెక్టర్ డాక్టర్ వీవీ బాషి విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యేక యూనిట్ దక్షిణ భారతదేశంలో ఛాతీ గాయం, వైకల్య సంరక్షణ కోసం ఏర్పాటు చేశారని, ప్రధానంగా పక్కటెముకల పగుళ్లు పెక్టస్ వైకల్యం వంటి పరిస్థితులకు సమగ్రమైన అధునాతన చికిత్సను అందిస్తుందన్నారు. ఈ కేంద్రం కేవలం చికిత్సను అందించడమే కాకుండా మెరుగైన జీవన శైలికి మార్గాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పెక్టస్ డిఫార్మిటీ కరెక్షన్ కోసం మినిమల్లీ ఇన్వాసివ్ టెక్నిక్‌ల్లో ప్రత్యేక నైపుణ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కమల్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.


శునకాల దాడిలో 15 మందికి గాయాలు

అన్నానగర్: కుక్కల దాడిలో 15 మంది గాయపడ్డారు. తేని జిల్లాలోని అల్లినగరం ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ప్రజలపై కొద్దిరోజుల క్రితం వీధికుక్కలు దాడి చేస్తున్నాయి. అలాగే కడమలైకుండు పరిసర ప్రాంతాల్లో గత కొన్ని వారాలుగా కుక్కకాటుకు గురై అనేక మంది ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా కడమలైకుందు సమీపంలోని ఆలందలియూర్, కుమనందొలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కొందరిని పిచ్చి కుక్కలు కరిచాయి. దీంతో 15 మంది గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

రజనీ కూలీలో నాగార్జున?



రజనీకాంత్



నాగార్జున

తమిళసినిమా: రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాల్లో సపోర్టింగ్ పాత్రల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన స్టార్ నటులను నటింపజేయడం అనేది ఇటీవల జరుగుతోంది. ముఖ్యంగా జైలర్ చిత్రంతోనే ఇది మొదలైందని చెప్పవచ్చు. ఆ చిత్రంలో మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్, బాలీవుడ్ స్టార్ జాకీష్రాఫ్ వంటి వారు అతిథి పాత్రల్లో మెరిసి జైలర్ చిత్ర విజయానికి కారణం అయ్యారనే చెప్పాలి. ఇకపోతే తాజాగా రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న వేట్టైయాన్ చిత్రంలోనూ బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, టాలీవుడ్ స్టార్ నటుడు రాణా వంటి వారు నటిస్తున్నారు. కాగా రజనీకాంత్ త్వరలో లోకేష్‌కనకరాజ్ దర్శకత్వంలో ఆయన 171 చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ క్రేజీ చిత్రానికి కూలీ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఈ చిత్ర టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను, టీజర్‌ను వరుసగా చిత్ర ప్రారంభానికి ముందే విడుదల చేసి హైప్‌ను తీసుకొచ్చారు. కాగా కూలీ చిత్రం షూటింగ్ జూన్ నెలలో ప్రారంభం కానుంది. ఇందులో రజనీకాంత్‌కు జంటగా నటి శోభన నటించనున్నారు. అలాగే నటి శృతిహాసన్ కూడా ఇందులో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా టాలీవుడ్ స్టార్ నటుడు నాగార్జున కూడా కూలీ చిత్రంలో ముఖ్యపాత్రను పోషించనున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే దీనికి సంబంధించిన అధికార ప్రకటన వెలువడలేదన్నది గమనార్హం. కాగా నటుడు నాగార్జున ఇప్పటికే నటుడు ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్న ద్విభాషా చిత్రం కుబేరాలో ముఖ్య పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. మరి కూలీ చిత్రంలో ఈయన పాత్ర ఎలా ఉంటుందోనన్న ఆసక్తి నెలకొంది. పలు ప్రత్యేకతలతో కూడిన ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తున్నారు.



నటి ఐశ్వర్య రాజేశ్

కోలీవుడ్ టాక్స్

తమిళసినిమా: దక్షిణ భారత నటీనటుల సంఘం నూతన భవన నిర్మాణం వేగం పుంజుకుంది. నాజర్ అధ్యక్షుడిగా, విశాల్ ప్రధాన కార్యదర్శిగా, కార్తీ కోశాధికారిగా బాధ్యతలను నిర్వహిస్తున్న దక్షిణ భారత నటీనటుల సంఘం(నడిగర్ సంఘం) నూతన భవన నిర్మాణాన్ని ఆధునిక వసతులతో బ్రహ్మాండంగా నిర్మించడానికి చాలా కాలం ముందే ప్రణాళికలను సిద్ధం చేశారు. అలా కొంత భాగం భవన నిర్మాణ పనులు జరిగాయి కూడా. అయితే నిధి కొరత కాలంగా పనులు నిలిచిపోయాయి. దీంతో తాజాగా సంఘం నిర్వాహకులు నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసే పనికి పూనుకున్నారు. అందుకు కావలసిన నిధులను సమకూర్చే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ముందుగా నటుడు కమలహాసన్ నడిగర్ సంఘం నూతన భవన నిర్మాణానికి రూ. కోటిని విరాళంగా అందించారు. ఆ తరువాత నటుడు, నిర్మాత, రాష్ట్ర క్రీడాశాఖల మంత్రి ఉదయనిధి స్టాలిన్, నటుడు విజయ్ తలా కోటి రూపాయలను విరాళంగా అందించారు. అదే విధంగా నటుడు శివకార్తీకేయన్ రూ. 50 లక్షలను విరాళం ఇచ్చారు. కాగా తాజాగా సోమవారం నటుడు ధనుష్ కోటి రూపాయలను ఇచ్చారు. దీంతో నడిగర్ సంఘం నిర్వాహకులు నటుడు ధనుష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కాగా ప్రస్తుతం నడిగర్ సంఘం నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరి కల్లా నూతన భవనాన్ని పూర్తి చేయనున్నట్లు నటుడు విశాల్ ఇటీవల ఓ భేటీలో పేర్కొన్న విషయం తెలిసిందే.

నడిగర్ సంఘానికి నటుడు ధనుష్ రూ.కోటి విరాళం



నటుడు ధనుష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించిన కార్తీ, నాజర్

కుట్రం పుదిదు చిత్రానికి శ్రీకారం చుట్టారు!

తమిళసినిమా: కుట్రం పుదిదు చిత్రం సోమవారం ఉదయం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. జీకేఆర్ సినీ ఆర్ట్స్ పతాకంపై డాక్టర్ ఎస్.కార్తికేయన్, తరుణ్ కార్తికేయన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా రజిత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన కథ, కథనం, మాటలు రాసి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నవ జంట తరుణ్, సేశ్విత హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. నటుడు మధుసూదన్‌రావు, రామచంద్రన్, బాయ్ రాజన్, ప్రియదర్శిని, శ్రీనిధి, సంగీత, దినేశ్ చెల్లయ్య, శ్రీకాంత్, మీరారాజ్, డార్లింగ్ నివేదా తదితరులు ముఖ్యపాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి జసన్ విలియమ్స్ ఛాయాగ్రహణం, కరణ్ బీ.కృప సంగీతం అందించనున్నారు. చిత్రం పూజా కార్యకార్యక్రమాలకు దర్శక, నటుడు కే.భాగ్యరాజ్ తదితర సినీ ప్రముఖులు హాజరై యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. చిత్రం వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది విభిన్న థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిస్తున్న కథా చిత్రంగా ఉంటుందన్నారు. అనూహ్య సంఘటనలతో చిత్రం ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుందని చెప్పారు. చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభించి, ఏక కాలంలో పూర్తి చేయనున్నట్లు దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు.



కుట్రం పుదిదు చిత్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కె.భాగ్యరాజ్‌తో యూనిట్ సభ్యులు

అతి మంచి పనికిరాదు

తమిళసినిమా: ఇప్పుడు నటి ఐశ్వర్య రాజేశ్ అంటే సినీ ప్రపంచంలో ఒక సెలబ్రిటీ. దక్షిణాది సినిమాలో స్టార్ హీరోయిన్. చిన్న చిన్న పాత్రల నుంచి కృషి, శ్రమతో అంచలంచలుగా ఎదిగి లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాల నాయకి స్థాయికి చేరారు. మంచి పరువ వయసులోనే కాక్కా ముట్టై చిత్రంలో ఇద్దరు పిల్లల తల్లిగా నటించి ఆ పాత్రకు జీవం పోశారు. ఆ చిత్రమే ఐశ్వర్య రాజేశ్ కేరీర్‌కు పెద్ద టర్నింగ్ అయ్యింది. ప్రస్తుతం క్రేజీ కథానాయకిగా వెలుగొందుతున్న ఈమె మాతృదినోత్సవం సందర్భంగా ఒక భేటీలో తన కుటుంబం ఎదుర్కొన్న కష్టాలను, తన అమ్మకు ఎదురైన బాధలను, ఆమె ఆత్మవిశ్వాసం తదితర సంఘటలను వివరించారు. కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయడానికి తన తండ్రి ష్యూరిటీ ఇచ్చి రుణాలు ఇప్పించారన్నారు. అయితే ఆనారోగ్యం కారణంగా తన తండ్రి మరణిస్తే ఆ రుణ భారం అంతా తన తల్లిపై పడిందన్నారు. దీంతో తమకు ఉన్న ఒకే ఒక్క ప్లాట్‌ను విక్రయించి ఆ అప్పును తీర్చినట్లు చెప్పారు. అంత కష్టంలోనూ మా అమ్మ తమను మంచి పాఠశాలలో చదివించారని, ఎలాంటి కొరత లేకుండా చూసుకున్నారని చెప్పారు. తన అన్నయ్యలు ఇద్దరూ చదువు పూర్తి చేసి ఉద్యోగం చేయడానికి సిద్ధం అయిన సమయంలో ఒక ప్రమాదంలో మరణించారన్నారు. అప్పటికే కడు కష్టాల్లో ఉన్న తన అమ్మను ఆ సంఘటన మరింత కుంగదీసిందన్నారు. అయినా అమ్మ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదన్నారు. వృత్తిపరంగా తాను ఎన్నో ఎత్తుపల్లాలను ఎదుర్కొన్నా, ధైర్యంగా ముందుకు సాగడాన్ని తన తల్లి నుంచే నేర్చుకున్నట్లు చెప్పారు. అలాగే అతి మంచికి పోకూడదన్నది తన తండ్రి జీవితం నుంచి నేర్చుకున్నట్లు నటి ఐశ్వర్య రాజేశ్ చెప్పారు.

ఆనందంలో ఓలలాడిన అమ్మతనం

తమిళ సినిమా: ప్రేమకు చిరునామా అమ్మ. మమతకు మారుపేరు అమ్మ. అమ్మ ఎవరికైనా అమ్మే. ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా కన్న పిల్లల లాలనలో తరించిపోయేది అమ్మ. నటి నయనతార ఇప్పుడు అలాంటి మాతృత్వ మధుర్యాన్నే ఆస్వాదిస్తున్నారు. కథానాయకిగా అగ్రస్థానంలో రాణిస్తున్న నయనతార ఇటీవలే జవాన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, భారతీయ నటిగా గుర్తింపు పొందారు. కాగా, గత 2022లో దర్శకుడు విఘ్నేశ్ శివన్‌కు పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వారి ఆరేళ్ల ప్రేమకు నిర్వచనం ఈ పెళ్లి. కాగా అదే ఏడాది అక్టోబర్ నెలలో నయనతార, విఘ్నేశ్ శివన్‌లు సరోగసీ విధానం ద్వారా ఇద్దరు కవల పిల్లలకు తల్లిదండ్రులు అయిన విషయం, వారికి ఉయిర్, ఉలగం అని నామకరణం చేసిన సంగతి తెలిసిందే. కాగా నయనతార, విఘ్నేశ్‌శివన్‌లో తమ జీవితంలో రీల్ విషయం, రియల్ విషయం గానీ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటారు. తమ పెళ్లి వేడుకను మాత్రం ఒక ఓటీటీ సంస్థకు విక్రయించి వార్తల్లోకి ఎక్కారు. ఇక పుట్టిన రోజు గాని, ఇతర వేడుకలు గాని సామాజిక మాధ్యమాల ద్వారా తమ ఆనందాన్ని పంచుకుంటారు. అలాగే తమ పిల్లల అన్నప్రాసన వేడుక ఫొటోలను ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం మాతృదినోత్సం. ఈ సందర్భంగా నటి నయనతార తన పిల్లల్లో పిల్లగా మారిపోయారు. వారి ముద్దు మురిపాల్లో మురిసిపోయారు. పిల్లలను భుజాలపై మోస్తూ పరవశించిపోయారు. పిల్లలను లాలించి, మురిపించి అమ్మతనాన్ని అనుభవించారు. వారి చేతులు పట్టుకుని బుడి బుడి అడుగులు వేయిస్తూ ఆనందంతో పరవశించిపోయారు. ఈ వీడియోను నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్‌శివన్ తన ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. అందులో నయనతారను ఉద్దేశించి విఘ్నేశ్‌శివన్ పేర్కొంటూ నువ్వే నా ప్రాణం, లోకం అని పేర్కొన్నారు. ఈ వీడియో చాలా క్యూట్‌గా ఉంది. అమ్మకు కన్నపిల్లల ముందు తన స్థాయి అస్సలు గుర్తుకురాదని ఈ వీడియోతో నయనతార మరోసారి నిరూపించారు. ఇది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



బిడ్డను భుజాలపై మోస్తున్న నయనతార

క్లుప్తంగా

విద్యార్థినికి లైంగిక వేధింపులు

• పోక్సో చట్టం కింద టైలర్ అరెస్టు

తిరువొత్తియూరు: పాఠశాల విద్యార్థినిని లైంగికంగా వేధించిన టైలర్‌పై పోలీసులు పోక్సో చట్టం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వేలూరు జిల్లా గుడియాత్తం రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న ఉద్యోగికి 12 ఏళ్ల కుమార్తె ఉంది. ఆ బాలిక అదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. కాగా అదే ప్రాంతంలో జయకుమార్ (48) టైలర్ ఉన్నాడు. ఈ క్రమంలో విద్యార్థిని కొన్ని రోజుల క్రితం అదే వీధిలో ఆడుకుంటున్న సమయంలో అక్కడ విద్యార్థినికి చాక్లెట్ ఇస్తానని చెప్పి ఆ విద్యార్థిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి బాలికను లైంగిక వేధించాడు. దిగ్భ్రాంతి చెందిన విద్యార్థిని ఏడుస్తూ ఇంటికి వచ్చి ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు గుడియాత్తం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లిరాణి పోక్సో చట్టం కింద టైలర్ జయకుమార్‌ను సోమవారం ఉదయం అరెస్టు చేశారు.

పీహెచ్‌సీ నర్స్‌కు..

• ప్రభుత్వ డాక్టర్ అరెస్టు

తిరువొత్తియూరు: వత్తలగుండు సమీపంలో నర్సును లైంగికంగా వేధించిన ప్రభుత్వ డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. దిండుకల్లు జిల్లా వత్తలగుండు సమీపంలో మల్లంపట్టి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ ఆస్పత్రిలో శ్రీనివాసన్ (28) వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఇతను అక్కడ పని చేస్తున్న నర్స్ (31)ని లైంగికంగా వేధించాడు. దీంతో విరక్తి చెందిన ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. బంధువులు ఆమెను చికిత్స కోసం దిండుకల్లు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఇందుకు సంబంధించి నర్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రభుత్వ డాక్టర్ శ్రీనివాసన్‌ను అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.

పోలీసులను బెదిరించిన వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: పోలీసులకు కత్తి చూపి బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తంజావూరు జిల్లా తిరువోనం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు భాస్కర్, రామమూర్తి, తిరువోనం సమీపంలో పుదువిడిది ప్రాంతంలో రాత్రి వేళ గస్తీ కాస్తున్నారు. ఆ సమయంలో పుదువిడిది గ్రామానికి చెందిన శరవణన్ కుమారులు సూర్య ప్రకాష్ (25), మణికంఠన్ (23) పోలీసులను అడ్డుకుని కత్తి చూపి, తమ అనుమతి లేకుండా గ్రామంలోకి ఎలా వచ్చారని బెదిరించారు. దీంతో తిరువోనం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన పోలీసులు దీని గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి పోలీసులకు కత్తిని చూపించి బెదిరించిన సహోదరులపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సూర్యప్రకాష్ అరెస్టు చేశారు. తప్పించుకొని పారిపోయిన మణికంఠన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైలు కింద పడి విద్యార్థి మృతి

తిరువొత్తియూరు: చెన్నై ఎన్నూర్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి కిందకు దిగడానికి ప్రయత్నించిన కళాశాల విద్యార్థిని రైలు కింద పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై ఎన్నూరు కామరాజర్‌నగర్ మొదటి వీధికి చెందిన మహమ్మద్ నాజర్ విదేశాల్లో పనిచేస్తున్నాడు. ఇతని కుమార్తె మహమ్మద్ నబిల్ (17) ఈఏడాది ప్లస్‌టూ పరీక్ష పాసైంది. ఆమె ఆవడిలో ఉన్న ఒక ప్రైవేటు కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు తీసుకురావడానికి కళాశాలకు వెళ్లి వస్తానని తల్లితో చెప్పి సోమవారం ఉదయం కళాశాలకు బయలుదేరింది. ఇంటికి నుంచి వెళ్లిన విద్యార్థి అక్కడ టికెట్ తీసుకుని అదే సమయంలో వచ్చిన విద్యుత్ రైలు ఎక్కింది. అయితే ఆ రైలు తిరువళ్లూరుకు వెళ్లదని, చెన్నై సెంట్రల్‌కు వెళుతుందని తెలియడంతో విద్యార్థి హడావుడిగా రైలు నుంచి కిందకు దిగడానికి ప్రయత్నించింది. అప్పుడు అకస్మాత్తుగా కాలుజారి కింద పడడంతో రైలు ఢీకొని అక్కడికక్కడే విద్యార్థి మృతి చెందింది. సమాచారమందుకున్న కొరుక్కుపేట రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని, మొహమ్మద్ నబిల్ మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం చెన్నై స్టాండ్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కార్మికుడి హత్య

అన్నానగర్: తిరుచెందూరు సమీపంలోని ఆడైకళాపురంలో సోమవారం భవన నిర్మాణ కార్మికుడిని కొట్టి చంపారు. వివరాల్లోకి వెళితే.. తిరుచెందూరు తూత్తుకుడి రోడ్డులో ఆడైకలాపురంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. ఈ దుకాణానికి ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో ఓ యువకుడిని కొట్టి చంపినట్లు పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందింది. తిరుచెందూర్ డీఎస్పీ వసంతరాజ్, తాలూకా పోలీసు ఇన్‌స్పెక్టర్ సుందరమూర్తి, ఇతర పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరుచెందూరు తాలూకా పోలీసులు కంఠసామిపురం గ్రామ నిర్వాకుడు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో అతడు కీళతేరు ఆళ్వార్ కులమ్ ప్రాంతానికి చెందిన స్వామి కుమారుడు అళగుముముత్తు (33) అని తేలింది. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కండలేరులో 6.842 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.842 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌కు ఘన స్వాగతం



వెయిట్ లిఫ్టింగ్‌లో ఆసియా చాంపియన్‌గా నిలిచిన యువరాజ్‌ను సత్కరిస్తున్న యువత

తిరుత్తణి: వెయిట్ లిఫ్టింగ్‌లో ఆసియా చాంపియన్‌గా తిరుత్తణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించి, స్వస్థలానికి చేరుకున్న యువరాజ్‌కు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. తిరుత్తణి సన్నిధివీధికి చెందిన మహేష్ కుమారుడు యువరాజ్(20) తిరుత్తణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సర విద్యార్థి. అతని మేనమామ ఆనందన్ ప్రోత్సాహం, శిక్షణతో వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొంది నాలుగేళ్లుగా జిల్లా, రాష్ట్రా స్థాయిలతోపాటు జాతీయ స్థాయిలో కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని, విజేతగా నిలిచాడు. దీంతో వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌గా ద్వారా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై హాంకాంగ్‌లో ఇటీవల నిర్వహించిన ఆసియా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 59 కేజీల బరువు గల యువరాజ్ జూనియర్ విభాగంలో 500 కేజీల వెయిట్ లిఫ్టింగ్‌లో చాంపియన్‌గా నిలిచి, బంగారు పతకం సాధించాడు. చాంపియన్ హోదాలో తొలిసారి స్వస్థలం తిరుత్తణికి చేరుకున్న యువరాజ్‌కు శ్రీవరాహి అమ్మన్ అన్నదాన ట్రస్టు నిర్వాహకులు చంద్రన్ ఆధ్వర్యంలో మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికి చందనమాలతో సత్కరించారు. సన్నిధి వీధిలో ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి భూపతి, డీఎంకే జిల్లా మాజీ కార్యదర్శి భూపతి యువరాజ్ తదితరులు మహేష్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్ ఇన్‌స్పెక్టర్‌సహా నలుగురు పోలీసుల బదిలీ

కొరుక్కుపేట: మద్యం స్మగ్లర్ల నుంచి లంచం తీసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్‌సహా నలుగురు పోలీసులను ఆయుధప్పాడైకి బదిలీ చేస్తూ విల్లుపురం ఎస్పీ దీపాక్షి వాష్ ఆదేశించారు. పుదుచ్చేరి నుంచి ఇతర రాష్ట్రాలకు మద్యం బాటిళ్ల అక్రమ రవాణా జరగకుండా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు ముమ్మర నిఘా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం కోటకుప్పం సమీపంలోని పెరియ మొదలియార్ సావడి వద్ద ఉన్న ప్రొహిబిషన్ చెక్‌పోస్టు వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథన్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పుదుచ్చేరి నుంచి చెన్నై వెళుతున్న కారును ఆపి సోదాలు చేశారు. కారులో మద్యం సీసాలు కనిపించాయి. ఈ క్రమంలో వారిపై కేసు నమోదు చేయడానికి, వారు తిరుచ్చిరంపాళెం పక్కన ఉన్న రాత్‌ధన్ కుప్పడిలోని మద్యపాన రహిత పోలీస్ స్టేషన్‌కు మద్యాన్ని తీసుకెళ్లారు. మార్గం మధ్యలో వారితో బేరసారాలు జరిపి కేసు నమోదు చేయకుండా రూ.7 వేలు లంచం తీసుకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అప్రమత్తం అయిన జిల్లా ఎస్పీ దీపాక్షి వాష్ అనంతరం ప్రొహిబిషన్ చెక్ పోస్టులో పనిచేసిన పోలీస్ ఎస్‌ఐ విశ్వనాథన్, పోలీసులు నాగరాజ్, పుష్పరాజ్, సురేష్‌ను సాయుధ దళాలకు బదిలీ చేశారు. వారిపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించారు.

1900 ప్రభుత్వ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు

కొరుక్కుపేట: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఫుట్ బోర్డుపై ప్రయాణించకుండా నిరోధించేందుకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ 1900 పైగా బస్సులకు ఆటోమేటిక్ డోర్లను ఏర్పాటు చేసింది. దీనికితోడు బస్సుల ఎంట్రీ, ఎగ్జిట్ మెట్ల దగ్గర ప్రయాణికులు ఇరుక్కుపోకుండా కిటికీలకు గాజు పలకలను ఏర్పాటు చేశారు. గత ఫిబ్రవరిలో ప్రారంభమైన డీలక్స్, సాధారణ సర్వీసు బస్సుల పునరుద్ధరణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. కానీ పాత, శిథిలావస్థలో ఉన్న ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయడం లేదు. పాడుబడిన బస్సుల స్థానంలో త్వరలో కొత్త బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తలుపులు ఇన్‌స్టాలేషన్ కారణంగా మెట్ల ఎక్కే స్థలం కొద్దిగా తగ్గిపోయింది. అందువల్ల ఎక్కేందుకు, దిగేందుకు చాలా సమయం పడుతుందనే ఫిర్యాదు వస్తుంది. చెన్నై నగరంలో ప్రస్తుతం 629 రూట్లలో 3,100 బస్సులు తిరుగుతున్నాయి. ఇది రోజుకు 29.5 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తోంది. సగటున ఒక్కో బస్సు రోజూ 265 నుంచి 270 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేసిన డోర్లు తమకు ఎంతో సంతృప్తినిచ్చాయని బస్సు డ్రైవర్లు తెలిపారు. అయితే ఇప్పుడు ఫుట్‌బోర్డులో ఎవరైనా ఆగితే బస్సులను నడపబోమని అధికారులు చెబుతున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కొరుక్కుపేట: తిరునెల్వేలి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతను మంటల్లో చిక్కుకుని కలెక్టర్ కార్యాలయం వైపు పరుగులు తీయడంతో అక్కడ భయానక పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. నెల్లై సమీపంలోని మారుదా కులానికి చెందిన శంకర సుబ్బు (36)కు అతని బంధువులకు మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో దాఖలైన, ఫిర్యాదును రద్దు చేసినప్పటికీ, పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని సమాచారం. ఈ క్రమంలో ఆయన సోమవారం కలెక్టరేట్ వద్దకు వచ్చి, అక్కడ ఉన్న స్మార్ట్ సిటీప్రాజెక్టు కింద నదిని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. తర్వాత తాను తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తర్వాత నెల్లై కలెక్టరేట్ గేటు వైపు అరుస్తూ పరుగులు తీశాడు. దీంతో అక్కడ కాపలా ఉన్న పోలీసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అతని శరీరంపై నీళ్లు పోసి మంటలను ఆర్పారు. అనంతరం అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి పంపించారు. అక్కడ ఆయన ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేతకు హత్య బెదిరింపు

• ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: బీజేపీ నేతకు హత్య బెదిరింపు చేసిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడితోపాటు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని నంగనల్లూర్‌లో బీజేపీ నేతల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఈ స్థితిలో ఇటీవల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన డబ్బును నాయకులు ప్రజలకు పంచకుండా స్వాహా చేశారని ఆ పార్టీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో బీజేపీ చెన్నై తూర్పు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రామచంద్రన్, పలవంతాంగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత 9వ తేదీ సాయంత్రం బీజేపీ నంగనల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు జవహర్‌లాల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ప్రాంతీయ కార్యదర్శి జయకుమార్(44) తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా హత్య బెదిరింపులు ఇచ్చారని ఆ ఫిర్యాదులో తెలిపారు. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి తెల్లవారుజామున పరంగిమలై డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో పోలీసులు జవహర్ ఆర్మ్‌స్ట్రాంగ్, జయకుమార్‌ను అరెస్టు చేశారు.

కొలనులో వ్యక్తి మృతదేహం లభ్యం

తిరువొత్తియూరు: నీలంగారై కొలనులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నీలాంగరై కొలనులో ఓ వ్యక్తి దేహం తేలుతున్నట్లు పోలీసులు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. ఆ వ్యక్తికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. ఇది హత్యా లేదా ఆత్మహత్య అని పోలీసులు విచారణ చేస్తున్నారు. చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డు నీలంగరై సరస్వతి నగర్ ప్రాంతంలో ఉన్న ఒక కొలనులో సోమవారం ఉదయం ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ చేరుకున్న తిరువాన్మియూర్ అగ్నిమాపకశాఖ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. తర్వాత ఆ మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి వివరాలు తెలియరాలేదు.

భవానీ నదిలో మునిగి విద్యార్థి మృతి

అన్నానగర్: భవానీ నదిలో మునిగి విద్యార్థి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. పుదుచ్చేరిలోని పాగూర్ మామేడు ప్రాంతానికి చెందిన దశరథన్ కుమారుడు ఆకాష్ (21) కళాశాల విద్యార్థి. ఇతను ఈరోడ్ జిల్లా కోడివారి, పన్నారి, భవానీసాగర్ ఇతర ప్రాంతాలకు తమ సొంత కారులో విహారయాత్ర ముగించుకుని సోమవారం మేట్టుపాళయం వచ్చారు. అనంతరం మేట్టుపాళయంలో భోజనం చేశారు. మెట్టుపాళయం వెల్లిపాళయం రోడ్డులో కరుప్పరాయన్ దేవాలయం పక్కనే భవానీ నది ఉంది. తన కుటుంబంతో కలిసి స్నానం చేసినప్పుడు ఆకాష్ లోతులోకి వెళ్లి నీటిలో మునిగిపోయినట్లు తెలుస్తుంది. విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు మెట్టుపాళయం పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మణికంఠన్, అగ్నిమాపక స్టేషన్ అధికారి బాలసుంధరమ్ ఆధ్వర్యంలో భవానీ నదిలో గల్లంతైన ఆకాష్ కోసం గాలించి, మృతదేహాన్ని వెలికితీశారు. మేట్టుపాళయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుగు - పొరుగు

16 నుంచి శ్రీగోవిందరాజస్వామి

బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరుగనున్నాయి. ఈనెల 15వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగుతాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వాహనసేవల వివరాలివీ..

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవలు జరుగనున్నాయి. 17న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 18న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 19న కల్పవృక్షవాహనం, సర్వ భూపాల వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 20వ తేదీ ఉదయం పల్లకీ సేవ, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 21న హనుమంత వాహనం, గజ వాహనం, 22న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహిస్తారు. 23న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 24న ఉదయం చక్రస్నానం, రాత్రి చేపట్టే ధ్వజావరోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ కేంద్రాలు



మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసి పింక్ మోడల్ పోలింగ్ కేంద్రం

తిరుపతి సిటీ: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో పింక్ కలర్ బెలూన్స్‌తో ఏర్పాటు చేసిన మహిళా యూనివర్సిటీలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని చూసేందుకు ఓటర్లు ఆసక్తి చూపారు. 'ఓటరుగా నేను గర్విస్తున్నా' అనే స్లోగన్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టర్‌ను ఓటర్లు నిశితంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రశాంతతో పాటు ఓటర్లను ఆకట్టుకునే విధంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులను ఈ సందర్భంగా ఓటర్లు అభినందించారు. ఇటువంటి మోడల్ కేంద్రాలను నగరంలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్, ఎస్‌పీజేఎన్ఎమ్ కార్పొరేషన్ పాఠశాలలో సైతం అధికారులు అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి ఓటర్ల మనస్సును దోచుకున్నారు.

నగరిలో పోలింగ్ ప్రశాంతం

నగరి : నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అన్ని మండలాలు, పట్టణాల్లో పోలింగ్ స్టేషన్లు తెరవక ముందే జనం క్యూలైన్లలో బారులు తీరారు. సాయంత్రం 6 గంటలైనా నగరి మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, చింతలపట్టెడ, కేవీపీఆర్ పేట, మండలంలోని దామరపాకం, వీకేఆర్ పురంలో ఓటర్లు బారులు తీరడంతో గేట్లు వేసి లోపల ఉన్న వారికి ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. చెదురు ముదురు సంఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. డీఎస్పీ నరసింహామూర్తి ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వివాదాలు చోటు చేసుకునే ప్రాంతాలకు వెంటనే చేరుకుని అందరినీ దూరంగా పంపేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో మంత్రి ఆర్కే రోజా కుటుంబంతో పాటు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉద్యోగాలకు 'రైట్‌రైట్'

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చదువుకుని డ్రైవింగ్ ఫీల్డ్‌పై ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తోంది. ఇందులో భాగంగానే 2021లో తిరుపతి అలిపిరి డిపో పరిధిలో ప్రత్యేక డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ఇక్కడ 26 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చింది. ఇక్కడ శిక్షణ పొందిన 416 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీచేసింది. సర్టిఫికెట్లు పొందిన ప్రతిఒక్కరూ ఏదో ఒకచోట సెటిలయ్యి.. కుటుంబాలకు బాసటగా నిలిచారు.



అలిపిరి డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

- ఆర్టీసీ నేతృత్వంలో డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ
- తిరుపతి అలిపిరి డిపోలో డ్రైవింగ్ స్కూల్
- మూడేళ్లలో జిల్లాలో 416 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు
- 236 మందికి స్థానిక ఆర్టీసీ డిపోల్లోనే ఉద్యోగాలు
- ఇప్పటికే 26 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి
- త్వరలో 27వ బ్యాచ్‌కు శిక్షణ



శిక్షణ పొందుతున్న యువకులు



సర్టిఫికెట్ తీసుకుంటున్న డ్రైవర్

తిరుపతి అర్బన్: తిరుపతిలోని అలిపిరి డిపోలో ఆర్టీసీ నేతృత్వంలో 2021 మార్చిలో డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అర్హత కలిగిన వారికి 32 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. అలాగే మెకానిజంలోనూ పట్టు సాధించేలా చర్యలు చేపడుతున్నారు. ఒక్కో బ్యాచ్‌కి 16 మంది చొప్పున ఇప్పటి వరకు 26 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తిచేశారు. శిక్షణ పొందిన 416 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీచేశారు. మరో నాలుగు రోజుల్లో 27వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.


ఉద్యోగ'మస్తు'

శిక్షణ తీసుకుని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన 416 మందికి ఉద్యోగాలు లభించాయి. ఇందులో 116 మంది తిరుపతి టూ తిరుమల విద్యుత్ బస్సుల్లో పనిచేస్తున్నారు. మరో 120 మందికి జిల్లాలోని 11 డిపోల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్లుగా పనిచేయడానికి అవకాశం కల్పించారు. ఇంకో 105 మంది పక్క రాష్ట్రాల్లో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రాలో హెవీ లైసెన్స్‌లో డ్రైవింగ్ ఫీల్డ్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. 25 మంది విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్నారు. మొత్తంగా శిక్షణ పొందిన ఎవ్వరూ ఖాళీగా లేకుండా ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

ఒక్కో జిల్లాకు ఒక్కో డ్రైవింగ్ స్కూల్

రాష్ట్ర ప్రభుత్వం 2021 నుంచి 2024 మార్చి వరకు 25 జిల్లాల్లో 10,400 మందికి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీచేస్తున్నారు. ఒక్క ఆర్టీసీలోనే మూడేళ్లలో డ్రైవింగ్ స్కూల్స్ ద్వారా 10,400 కుటుంబాలకు ఉద్యోగావకాశాలు కల్పించారు.


రెండు రోజుల్లో దరఖాస్తులు



తిరుపతి అర్బన్: ఇప్పటి వరకు 26 బ్యాచ్‌లకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తిచేశాం. మరో రెండు రోజుల్లో 27వ బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానిస్తాం. ఆ మేరకు డిపో మేనేజర్ హరిబాబు కసరత్తు చేస్తున్నారు. అనంతరం శిక్షణ ప్రారంభిస్తాం. శిక్షణ సమయంలో అవసరమైన మేరకు అన్ని వసతులు కల్పిస్తాం. చిన్న పాటి సమస్యలు లేకుండా వారికి ఏర్పాట్లు చేపడుతున్నాం.

–రాము, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు

చక్కటి అవకాశం



హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం తిరుపతిలోని అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో చక్కగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో పలువురు ఆర్టీసీలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇంకొందరు విద్యుత్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. నేను ప్రైవేటుగా ఉద్యోగం చేసుకుంటున్నాను. ఇక్కడ శిక్షణ ఎంతో బాగుంది. అలిపిరి స్పెషల్ ఏంటంటే డ్రైవింగ్‌తో మెకానిజంలోనూ శిక్షణ కల్పించడం. ఇది ఎంతో సంతోషాన్నిస్తోంది.

–కే.మురళి, అలిపిరిలో శిక్షణ పొందిన డ్రైవర్

పచ్చికాపల్లంలో మద్యం స్వాధీనం

• నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కార్వేటినగరం: అక్రమంగా తరలిస్తున్న 432 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని అరెస్టు చూపారు. సీఐ మాట్లాడుతూ చిత్తూరు అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో కార్వేటినగరం స్టేషన్ పరిధిలోని అందిన సమాచారం మేరకు వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం సమీపంలోని నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆ సమయంలో అటు వచ్చిన టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో కర్ణాటకకు మద్యం 432 బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.54 వేలు ఉంటుందని అంచనా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో వాహనం డ్రైవర్ చొక్కా ప్రతాప్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే వెదురుకుప్పం మండలంలోని గోవిందవారిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున అక్రమంగా దాచి ఉంచిన 32 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నాగరాజు, భారతి, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ కార్తీక్, ఢిల్లీబాబు పలువురు పాల్గొన్నారు.

పల్నాట పచ్చమూక బీభత్సకాండ

ఓటమి భయంతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు.. ఓటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, ఏజెంట్లపై దాడులు

- మాచర్ల ఎమ్మెల్యే పీఆర్కే తనయుడు గౌతమ్, డ్రైవర్‌పై దాడి
- తంగెడలో పెట్రోలు బాంబులతో దాడి.. 8 మందికి తీవ్ర గాయాలు
- పాల్వాయి, తుమ్మకోటల్లో ఈవీఎంలు ధ్వంసం
- ముప్పాళ్లలో మంత్రి అంబటి అల్లుడు కారు అద్దాలు ధ్వంసం
- నూజెండ్ల మండలంలో దళితులపై అరాచకం
- కేశానుపల్లిలో ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి.. చోద్యం చూసిన పోలీసులు




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి,డ్రైవర్ అంజిరెడ్డి




గాయపడిన షేక్ గొరెబుడే హుసేన్, షేక్ కారంపూడి జానీ బాసా

సాక్షి, నరసరావుపేట/రెంటచింతల/నరసరావుపేట/మాచర్ల: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పల్నాడులో పచ్చ మూక పేట్రేగింది. ఓటమి ఖాయమని ముందే తెలిసిపోవడంతో ఓటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు, దళితులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. దీంతో పల్నాడు జిల్లా రణరంగాన్ని తలపించింది. యథేచ్ఛగా టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఇదేంటని ప్రశ్నించినవారిని, అడ్డుకోవడానికి ప్రయత్నించినవారిని టీడీపీ నేతలు, కార్యకర్తలు చితకబాదారు. చివరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కూడా విడిచిపెట్టలేదు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనయుడు, డ్రైవర్‌పై, ముప్పాళ్లలో మంత్రి అంబటి రాంబాబు అల్లుడి కారుపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. నూజెండ్ల మండలంలో దళితులను చితకబాదారు. దాచేపల్లి మండలం కేశానుపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లకు వెళ్లి మరీ వారిని టీడీపీ నేతలు చావగొట్టారు. పాల్వాయి, తుమ్మకోటల్లో ఈవీఎంలను ధ్వంసం చేశారు. తంగెడలో టీడీపీ నేతలు పెట్రోలు బాంబులతో దాడులు చేయడంతో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల సంఘం అధికారులు చేష్టలుడిగి వేడుక చూశారు. దీంతో టీడీపీ మూక పల్నాడులో భయానక వాతావరణం సృష్టించింది. ముందస్తు ప్లాన్‌లో భాగంగా పెట్రోల్ బాంబ్‌లు, కర్రలు, రాళ్లు సమకూర్చుకొని టీడీపీ నేతలు, కార్యకర్తలు మూకుమ్మడి దాడులు చేశారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్లలలో బయటి ప్రాంతాల నుంచి బౌన్సర్లు, గూండాలను తీసుకువచ్చి దాడులు చేయించారు.

మాచర్లలో భయానక వాతావరణం సృష్టించిన బ్రహ్మారెడ్డి..

మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా ఫ్యాక్షన్ నేత జూలకంటి బ్రహ్మారెడ్డిని తెచ్చిన చంద్రబాబు పోలింగ్ రోజు ఆయనతో బీభత్సం సృష్టించి.. ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. రెంటచింతల మండలం పాల్వాయి వద్ద వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను కొట్టి లాగేశారని తెలిసి అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కాన్వాయ్‌పై బ్రహ్మారెడ్డి ఫ్యాక్షన్ మూక దాడులు చేసింది. విచక్షణారహితంగా కత్తులు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో ఎమ్మెల్యే పీఆర్కే తనయుడు గౌతం రెడ్డి, డ్రైవర్ అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అదే మండలంలోని తుమ్మకోటలో ఏజెంట్లుగా ఉన్న షేక్ సైషావలీ, షేక్ జానీబాషాలపై విచక్షణారహితంగా దాడి చేసి వారిని తీవ్రంగా గాయపరిచారు. తుమ్మకోటలో 5 ఈవీఎంలు, పాల్వాయి, జెట్టిపాలెంలలో ఒక్కో ఈవీఎంను ధ్వంసం చేశారు. కారంపూడి మండలం ఒప్పిచర్లలో పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ఏజెంట్లుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. పొట్టి శ్రీరాములు కాలనీలో బూత్‌వద్ద రాళ్ల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి తలలు పగిలాయి. వెల్దుర్తిలో పలు బూత్‌ల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు లాగి పడేసి టీడీపీ రౌడీ మూకలు రిగ్గింగ్‌లకు పాల్పడ్డాయి. మర్సపెంటలో పుల్లారెడ్డి అనే అధికారిపై దాడి చేశారు. దుర్గి మండలం ముటుకూరులో టీడీపీ మూకల రాళ్లదాడిలో ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. నరసరావుపేట నియోజకవర్గం పమిడిపాడులో టీడీపీ, జనసేన కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ ఓటర్లను పోలింగ్ కేంద్రానికి రాకుండా కర్రలు, రాళ్లు, రాడ్‌లతో దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. దొండపాడులో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి వచ్చిన ఆయన వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు.

గురజాలలో గూండాగిరి

దాచేపల్లి మండలం కేశానుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న బొల్లా శ్రీనివాసరావు, ఆయన కుమారులు దిలీప్, మధు, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతలు పిడిగుద్దులు కురిపించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లకు వెళ్లి మరీ దాడులు చేశారు. తంగెడలో పెట్రోల్ బాంబులతో విరుచుకుపడ్డారు. దీంతో రెండు దుకాణాలు, నాలుగు బైకులు దగ్ధం కావడంతోపాటు 8 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి.

సత్తెనపల్లిలో మంత్రి అంబటితో సీఐ దురుసు ప్రవర్తన

ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద మహిళలను సీఐ అన్యాయంగా కొట్టాడని ప్రశ్నించడానికి వెళ్లిన మంత్రి అంబటి రాంబాబుతో సీఐ రాంబాబు దురుసుగా ప్రవర్తించారు. రివాల్వర్‌తో బెదిరించే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ వర్గీయులు 20 మంది గూండాలతో దాడులకు పాల్పడ్డారు. ముప్పాళ్లలో మంత్రి అంబటి అల్లుడు కారు అద్దాలను ధ్వంసం చేశారు. నకరికల్లు మండలం రూపనగుంట్ల, కుంకలగుంటలలో 8 మందికి గాయాలయ్యాయి. రాజుపాలెం మండలం గణపవరంలో టీడీపీ కార్యకర్తలు రాడ్లు, కర్రలతో వైఎస్సార్ కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. పెదకూరపాడు మండలం లగడపాడు, క్రోసూరు మండలం ఎర్రబాలెం, బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం, అచ్చంపేట మండలం మాదిపాడులో టీడీపీ మూకల రాళ్లదాడిలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెం, జంగాలపల్లిలో టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడుతుండగా అడ్డుకోవడానికి వెళ్లిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై దాడి చేయడానికి ప్రయత్నించారు.

పోలీసుల 'పచ్చ'పాతం

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ చేయాల్సిన పోలీసు శాఖ పచ్చపాతంతో పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రౌడీలు, గూండాలతో టీడీపీ బీభత్సకాండ సృష్టించినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. సాక్షాత్తూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు, పోలింగ్ ఏజెంట్లు, ఓటర్లపై దాడి చేస్తున్నా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న గ్రామాల్లో పదుల సంఖ్యలో పోలీసులు, ఆర్మ్‌డ్ సిబ్బంది నియమించి టీడీపీ రిగ్గింగ్ చేసే గ్రామాల్లో మాత్రం ఒకరిద్దరు సిబ్బందితోనే సరిపెట్టారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామం కుంకులగుంటలో డీఎస్పీ స్థాయి అధికారి అక్కడే ఉండి టీడీపీ ఏజెంట్లకు రక్షణ కల్పించారు. మాచర్ల చుట్టుపక్కలే ఉన్న ఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులను నిలవరించలేకపోయారు. పోలింగ్ రెండు మూడు రోజుల ముందు టీడీపీ అరాచకాలను అడ్డుకుంటారని భావించిన పలువురు సీఐ, ఎస్ఐలను అక్కడి నుంచి బదిలీ చేయించారు. దీంతో టీడీపీ మూకలకు మరింత స్వేచ్ఛనిచ్చినట్టయింది. పోలింగ్‌కు ముందు 48 గంటల నుంచి జిల్లాలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉండటానికి వీల్లేదు. అయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ రౌడీలు, బౌన్సర్లు ఉన్నా పోలీసుశాఖ వారిని చూసిచూడనట్టు వదిలేసింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తమ కార్యకర్తల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని పలుమార్లు జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లకు విన్నవించుకొన్నా సరిగా స్పందించలేదని వాపోతున్నారు. తాను ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎస్పీ బిందుమాధవ్ స్పందించలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మీడియాతో వ్యాఖ్యానించారు.

నరసరావుపేటలో తీవ్ర ఉద్రిక్తత

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై టీడీపీ గూండాల రాళ్ల దాడి

- ఇల్లు, ఆస్పత్రిపై దాడి.. మూడు కార్లు ధ్వంసం
- ఎమ్మెల్యే మామ, డ్రైవర్, మరో యువకుడికి తీవ్ర గాయాలు
- దగ్గరుండి దాడి చేయించిన టీడీపీ అభ్యర్థి అరవిందబాబు
- అర్ధరాత్రి కూడా కొనసాగుతున్న ఉద్రిక్తత
- ఇరువురి గృహాల వద్ద కంచె వేసిన పోలీసులు
- బాష్పవాయు గోళాల ప్రయోగం



టీడీపీ అభ్యర్థి అరవిందబాబు హాస్పిటల్ ముందు కర్రలు, రాళ్లతో టీడీపీ మూకలు



టీడీపీ మూకలపై భాష్పవాయుగోళాలను ప్రయోగిస్తున్న పోలీసులు




రాళ్లదాడిలో గాయపడిన రామకోటిరెడ్డి, యువకుడు



డ్రైవర్ హరితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేటలో సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓటమి ఖాయమని తెలిసిపోవడంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు దగ్గరుండి తన అనుచరులు, బౌన్సర్లతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇల్లు, ఆస్పత్రిపై దాడులు చేయించారు. ఈ దాడిలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కారు డ్రైవర్ హరితో పాటు ఎమ్మెల్యే మామ కంజుల రామకోటిరెడ్డి, మరో యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. టీడీపీ నేతల దాడిలో ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిముందు ఉన్న మూడు కార్లు, ఆయనకు చెందిన ఆస్పత్రి అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈ ఘటన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నరసరావుపేటలో మధ్యాహ్నం 2గంటల వరకు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న బూత్ లోపలికి టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు, 20 మంది గూండాలు, బౌన్సర్లతో వచ్చారు. అంతకుముందు అదే బూత్‌కు వచ్చిన ఎమ్మెల్యే గోపిరెడ్డిని మాత్రమే అనుమతించిన పోలీసులు ఇతర నాయకులను లోపలికి అనుమతించలేదు. అరవిందబాబు 20 మందితో రావటాన్ని బూత్‌లో ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటినపాటి గాబ్రియేలు ప్రశ్నించారు. దీంతో అరవిందబాబు గాబ్రియేలుపై చేయిచేసుకున్నాడు. దీంతో పోలీసులు అరవిందబాబుకు రక్షణ ఇస్తూ గాబ్రియేలు, అతడితో పాటు ఉన్న మరో నాయకుడు గోగుల మనోహరయాదవ్‌ను కొట్టారు. అరవిందబాబు బూత్ నుంచి బయటకు రాగానే అక్కడే కనిపించిన ఎమ్మెల్యే డ్రైవర్ హరిపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. తిరిగి వెళ్లిపోతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి వద్దకు రాగానే ఆయన ఇంటిపైన, ఆస్పత్రిపైన టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా రాళ్లు, సీసాలు, కర్రలతో వారిపై టీడీపీ గూండాలు ఎదురు దాడికి దిగారు. పోలీసుల వ్యాన్‌లపై రాళ్లు వేశారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. అయినా లెక్కచేయని టీడీపీ గూండాలు మళ్లీ గోపిరెడ్డి ఇంటిపైన దాడికి ప్రయత్నించారు. పోలీసులు ఇద్దరు నేతల ఇళ్ల వద్ద ముళ్లకంచె ఏర్పాటు చేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు ఉద్రిక్తత కొనసాగుతోంది.

దాడులు చేయడానికి టీడీపీ గూండాలు, బౌన్సర్లు

ఎన్నికల్లో అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ నేత అరవిందబాబు ఒంగోలు, హైదరాబాద్, చెన్నైల నుంచి భారీ ఎత్తున బౌన్సర్లను రప్పించినట్లు ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన నరసరావుపేటలోని తన ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడారు. మారణాయుధాలతో మళ్లీ దాడి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోందన్నారు. నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే హింసాత్మక సంఘటనలు జరిగి ఉండేవి కాదన్నారు. తనను కేవలం రెండుకార్లు మాత్రమే వాడాలని చెప్పి.. శ్రీకృష్ణదేవరాయలు మూడుకార్లు, అరవిందబాబు ఏడు కార్లతో తిరిగినా అధికారులు చూసీచూడనట్లుగా పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించారు. కలెక్టర్, ఎస్పీలు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించడం వల్ల పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయన్నారు.

జనసేన నేతల దౌర్జన్యం

- అలంపురంలో మంత్రి కుమారుడిపై దాడికి యత్నం
- పూళ్లలో ఎమ్మెల్యే సోదరుడి కారుపై దాడి



కొట్టు విశాల్‌పై దాడికి ప్రయత్నిస్తున్న జనసేన కార్యకర్తలు

తాడేపల్లిగూడెం/ భీమడోలు: జనసేన కార్యకర్తలు బరితెగించారు. పలుచోట్ల కవ్వింపు చర్యలకు పాల్పడడంతో పాటు దాడులకు తెగబడ్డారు. అలంపురంలో మంత్రి కుమారుడిపై దౌర్జన్యానికి పాల్పడగా, పూళ్లలో ఎమ్మెల్యే సోదరుడి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలంలోని అలంపురంలో మంత్రి కుమారుడిపై జనసేన కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. తాడేపల్లిగూడెం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అలంపురంలోని 165వ నంబర్ పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ఆ సమయంలో జనసేన కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడడంతోపాటు మంత్రి కుమారుడు విశాల్‌పై దౌర్జన్యానికి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఒకానొక దశలో తోపులాట జరగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. డీఎస్పీ మూర్తి అక్కడకు చేరుకుని కార్యకర్తలను చెదరగొట్టి పోలింగ్ ప్రక్రియకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు.

కారుపై రాళ్ల దాడి

ఏలూరు జిల్లా భీమడోలు మండలంలో జనసేన కార్యకర్తలు ఉంగుటూరు ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల కార్తీక్ కారుపై రాళ్ల దాడికి తెగబడ్డారు. కార్తీక్ కారులో ఉండగానే కారు అద్దాలు పగులగొట్టారు. మండలంలోని పూళ్ల – కోడూరుపాడు రైల్వే గేటు వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది.

గన్నవరంలో టీడీపీ గలాటా

- గన్నవరంలో రాళ్లు, చెప్పులు విసిరిన యార్లగడ్డ అనుచరులు
- తేలప్రోలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి
- అవనిగడ్డలో మహిళపై దాడి.. కాలు విరగ్గొట్టిన జనసేన నాయకులు



జగ్గయ్యపేట చెరువు బజారులో ఇరువర్గాల మధ్య జరుగుతున్న ఘర్షణ



తేలప్రోలులో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను చెదర గొడుతున్న పోలీసులు

సాక్షి, మచిలీపట్నం/జగ్గయ్యపేట అర్బన్/ఉంగటూరు: కృష్ణాజిల్లాలో టీడీపీ నాయకులు గన్నవరం, పెనమలూరు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీపై దాడులకు పాల్పడ్డారు. గన్నవరం మండలం ముస్తాబాద్ వద్ద యార్లగడ్డ వెంకట్రావు వర్గీయులు, వైఎస్సార్‌సీపీ కేడర్‌ను రెచ్చగొట్టడంతో తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న వల్లభనేని వంశీ అక్కడికి చేరుకోవడంతో ఒకరిపై ఒకరు చెప్పులు, రాళ్లు విసురుకున్నారు.

■ ఉంగుటూరు మండలం తేలప్రోలు జెడ్పీహైస్కూల్‌లో ఉన్న 271, 273, 274, 275 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు పరిశీలించేందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు తన అనుచరులతో ర్యాలీగా చేరుకున్నారు. ఆ తర్వాత రోడ్డుపైకి వచ్చిన ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టేలా వల్లభనేని వంశీని, సీఎం జగన్‌ను అసభ్యపదజాలంతో దూషించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాదోపవాదనలు చేరడంతో దాడికి పాల్పడ్డారు. వల్లభనేని వంశీమోహన్ అక్కడకు చేరుకుని కవ్వింపు చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిలో గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి రవికుమార్, ప్రత్తిపాటి జీవన్‌కుమార్, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా అవుటుపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

■ అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవిలంకలో వైఎస్సార్‌సీపీ నాయకుడైన మండల బీసీ సెల్ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, ఆయన కుమార్తె కేసాని తేజశ్రీలపై జనసేన నాయకులు దాడికి దిగారు. తండ్రిని కొడుతుండగా కుమార్తె తేజశ్రీ అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆమెపై దాడి చేసి కాలు విరగ్గొట్టారు.

కౌన్సిలర్ భర్తపై టీడీపీ గూండాల దాడి

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన 16వ వార్డు కౌన్సిలర్ తన్నీరు నాగమణి భర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి తన్నీరు నాగేంద్రపై స్థానిక టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నాగేంద్ర ముఖం, తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక చెరువుబజారులోని బీసీ కమ్యూనిటీ భవన్‌లో ఏర్పాటుచేసిన 33వ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు ఒక మానసిక దివ్యాంగుడికి సహాయంగా అతని కుటుంబ సభ్యుని అనుమతించాలని తన్నీరు నాగేంద్ర ప్రిసైడింగ్ అధికారి అనుమతి తీసుకునేందుకు బూత్‌లోకి వెళ్లారు. అదే సమయంలో స్థానిక టీడీపీ వ్యక్తులు నడిగొండ్ల సతీష్, తాళ్లూరి సోమయ్య, అతని కుమారుడు తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఉత్తపల్లి వెంకటేశ్వర్లు ఆయనపై దాడికి పాల్పడ్డారు. కాగా ఈ ఘటనకు అరగంట ముందు మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోదరుడు శ్రీరాం చినబాబు అదే బూత్ వద్దకు వచ్చి టీడీపీ నాయకులతో మంతనాలు జరిపాడనీ, ఆయన సూచనతోనే ఈ దాడి జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు సామినేని రవిచంద్, ఉదయభాను కుమారుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, ఉదయభాను కుమార్తె పద్మ ప్రియాంక, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజి) ఇరువర్గాలను విడదీసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఎమ్మెల్యే ఉదయభాను సోదరి చాముండేశ్వరి(బేబి)ని కూడ దుండగులు తోసేయడంతో ఆమె కింద పడి కాలుకు ఫ్రాక్చర్ అయింది.

మాచర్లలో ఘర్షణలను ప్రేరేపించింది టీడీపీనే

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలింగ్ వన్ సైడ్ జరుగుతుండటంతో భయపడిపోయిన టీడీపీ హింసకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ధ్వజమెత్తారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాచర్లలో ఘర్షణలను ప్రేరేపించింది టీడీపీ శ్రేణులేనని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. కుప్పం, మాచర్ల, తాడిపత్రిలలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నేతలపై దౌర్జన్యాలు, దాడులకు దిగి తిరిగి వారిపైనే ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఠాకూర్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావులకు టీడీపీ ఆఫీసులో పనేంటని ప్రశ్నించారు. జిల్లాల ఎస్పీలకు ఫోన్లు చేసి బెదిరించటమేంటన్నారు. ఈ ఇద్దరి వ్యవహారశైలిపై ఈసీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

చీరాలలో టీడీపీ, కాంగ్రెస్ బరితెగింపు

- గవినివారిపాలెంలో కవ్వింపు చర్యలకు దిగిన టీడీపీ అభ్యర్థి కొండయ్య
- చీరాలలో వైఎస్సార్‌సీపీ నేతపై కాంగ్రెస్ అభ్యర్థి దాడి



డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న ఎంఎం.కొండయ్య యాదవ్ కుమారుడు మహేంద్ర



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన సీహెచ్ రమణమ్మ

చీరాల టౌన్/చీరాల: బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య యాదవ్ అనుచరులు జరిపిన దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం గవినివారిపాలెం పోలింగ్ కేంద్రానికి కొండయ్య యాదవ్ అనుచరులతో వచ్చి నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేశారు. దీన్ని రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు అడ్డుకోవడంతో ఆయనపై కొండయ్య దురుసుగా ప్రవర్తించారు. ఇదే అదనుగా ఆయన అనుచరులు రాడ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చితకబాదారు. పోలీసుల కళ్లముందే ఇదంతా జరుగుతున్నా చీరాల రూరల్ సీఐ సత్యనారాయణ, డీఎస్పీ బేతపూడి ప్రసాద్ చోద్యం చూస్తున్నారే తప్ప అడ్డుకోవడానికి యత్నించలేదు. పైగా దాడిలో గాయపడిన చీదరబోయిన రమణమ్మ, మరో ముగ్గురిని బలవంతంగా పక్కకు నెట్టేశారు. గవిని శ్రీను, మరో నలుగురు వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసు జీపులో ఎక్కించుకుని పక్కకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడకు చేరుకున్న కొండయ్య కుమారుడు మహేంద్ర, అతని అనుచరులు కర్రలతో వచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. చివరకు డీఎస్పీ బేతపూడి ప్రసాద్ రంగంలోకి దిగి కొండయ్యను బతిమిలాడి అక్కడి నుంచి పంపించేశారు. ఆ తరువాత పిట్టువారిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తూ టీడీపీకి ఓట్లు వేయకపోతే అందరి అంతూ చూస్తానంటూ బెదిరింపులకు దిగారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి దౌర్జన్యం

చీరాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ టీడీపీ అభ్యర్థి కొండయ్య గెలవాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ నేత బలగంశెట్టి అంకమ్మరావుపై దాడికి దిగారు. రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద అంకమ్మరావు ప్రజలకు నమస్కరిస్తూండగా కారులోంచి దిగిన ఆమంచి దాడికి పాల్పడ్డారు. గాయపడిన ఆయన చీరాల ఏరియా వైద్యశాలలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరణంపై ఆమంచి దాడి

చీరాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ తన అనుచరులతో కలసి బీభత్సం సృష్టించారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలించేందుకు పట్టణంలోని ఏడో వార్డుకు సోమవారం సాయంత్రం వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కులం పేరుతో దూషించి, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. తన అనుచరులతో కలసి దాడికి తెగబడ్డారు. వెంకటేష్ కారు అద్దాలు పగులకొట్టించారు. అంతటితో ఆగకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చీరాల వన్‌టౌన్, టూటౌన్ సీఐలు పి.శేషగిరిరావు, సోమశేఖర్ ఎంత చెప్పినా వినకపోవడంతో ఆమంచి వర్గీయులను అక్కడ నుంచి పంపించి వేశారు.

చిత్తూరులో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై హత్యాయత్నం

- కత్తులతో పొడిచి పారిపోయిన టీడీపీ ఏజెంట్లు
- పోలింగ్ పరిశీలిస్తున్న ఎస్ఐపై పచ్చ నేతల దాడి



చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్/గుడిపాల: చిత్తూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ పలు ఉద్రిక్తలకు దారితీసింది. గుడిపాల మండలంలోని మందికృష్ణాపురం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్లుగా ఉన్న సురేష్, ఇతని అన్న రమేష్‌పై టీడీపీ ఏజెంట్ కత్తులతో హత్యాయత్నం చేశాడు. తొలుత సురేష్‌రెడ్డిని చంద్ర అనే టీడీపీ ఏజెంటు బయటకు వెళ్లాలని హుకుం జారీ చేశాడు. తాను వెళ్లేదిలేదని మొండికేశాడు. కాసేపటి తరువాత పోలింగ్ కేంద్రం బయటకు వచ్చిన ఆయన్ను అప్పటికే అక్కడ కాపుకాచిన టీడీపీ నేత సుబ్బయ్యనాయుడు సూచనతో చంద్ర కూడా బయటకు వచ్చి సురేష్ రెడ్డిపై కత్తితో దాడిచేశాడు. అక్కడే ఉన్న రమేష్ రెడ్డి అడ్డుకోవడానికి యత్నించడంతో ఆయనపైనా కత్తితో దాడిచేశాడు. సురేష్ రెడ్డి కడుపులోకి కత్తి దిగబడగా, రమేష్‌రెడ్డి చేతికి తీవ్ర గాయమైంది. ఇద్దరినీ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, రమేష్‌రెడ్డి కడుపుపై వైద్యులు 18 కుట్లు వేశారు. ప్రస్తుతం ఇతని పరిస్థితి విషమంగా ఉంది. టీడీపీ నేతలపై పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదుచేశారు. ఇక గుడిపాల పోలింగ్ కేంద్రం వద్ద గొడవ జరిగే అవకాశం ఉందని సమాచారం రాగా, ఎస్ఐ శ్రీనివాసరావు అక్కడకు వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బెంగళూరుకు చెందిన పలువురు యువకులు ఎస్ఐతో వాగ్వావాదానికి దిగారు. ఆయన చొక్కాలాగి దాడికి పాల్పడ్డారు. కొద్దిసేపటి తరువాత పోలీసు బలగాలు రావడంతో పరిస్థితి సద్దుమణిగింది. రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. టీడీపీ అభ్యర్థి జగన్‌మోహన్‌నాయుడు గుడిపాల చేరుకుని ఎస్ఐను అంతుచూస్తామని బెదిరించారు. చిత్తూరు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేత సీకే బాబు హల్‌చల్ చేశారు.

సాక్షి
ఫ్యామిలీ
చెన్నై
మంగళవారం ॥ 14-5-2024

రెడ్ కార్పెట్



నిహారికా ఎన్.ఎమ్.

కాన్స్ ఫెస్టివల్‌లో
సినిమాలకు ఎంట్రీ దొరికినా
సెలబ్రిటీలకు ఆహ్వానం దొరికినా
చాలా ఘనత.
ఈసారి కాన్స్‌లో చాలా ఏళ్ల తర్వాత
ఒక భారతీయ సినిమా
ప్రదర్శితం కానుంది.
అదలా ఉంటే మన దేశానికి చెందిన
ముగ్గురు యువ ఇన్‌ఫ్లుయెన్సర్లను
కాన్స్ ఆహ్వానించింది.
మే 14-25 మధ్య జరగనున్న ఈ ఫెస్టివల్‌లో
ఆర్‌జె కరిష్మా, ఆస్థా షా, నిహారికా ఎన్.ఎమ్
రెడ్ కార్పెట్ మీద దర్జాగా నడవనున్నారు.
వారి పరిచయాలు.

కాన్స్‌లో ఆ ముగ్గురు

ప్రపంచ సినిమా ప్రతిష్ఠాత్మకంగా భావించే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నేటి నుంచి (మే 14) నుంచి ఫ్రాన్స్‌లోని కాన్స్ నగరంలో ప్రారంభం కానుంది. ఆస్కార్ అవార్డ్స్‌తో సమానంగా కాన్స్ అవార్డులను భావిస్తారు. ఈసారి భారతదేశం నుంచి పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' సినిమా మెయిన్ కాంపిటీషన్‌లో ఎంట్రీ సాధించింది. సినిమాకు, సంస్కృతికి ప్రాధాన్యం ఇచ్చే ఈ ఫెస్టివల్‌లో భారతదేశం నుంచి కొంతమంది యువ ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆహ్వానం అందింది. అతిరథ మహారథులతో కలిసి రెడ్ కార్పెట్ మీద నడిచే అవకాశం వీరు పొందారు. స్ఫూర్తినిచ్చే తమ జీవితాల ద్వారా, ప్రతిభ, విజయం ద్వారా వీరు అవకాశం పొందారు. అలాంటి ముగ్గురి పరిచయం.

ఆస్థా షా



ఆస్థా షా

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తన జీవిత పోరాటంతో ప్రభావం చూపుతున్న ఆస్థా షాది ఢిల్లీ. 24 ఏళ్ల ఆస్థా 8 ఏళ్ల వయసు నుంచి విటిలిగో (తెల్లమచ్చలు) బారిన పడింది. పూర్తిగా నివారణ లేని ఈ చర్మవ్యాధి ఆమె ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ప్రతి ఒక్కరూ 'ఈ అమ్మాయికి పెళ్లవుతుందా' అని తల్లిదండ్రులను వేధించేవారు. అన్ని రకాల వైద్య విధానాలతో విసిగిపోయిన ఆస్థా నేను ఎలా ఉన్నా నా జీవితం ముఖ్యం అనుకుని చదువు మీద దృష్టి పెట్టింది. మంచి ప్రతిభ చూపి ఇప్పుడు హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్‌లో ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పని చేస్తోంది. ఇన్‌స్టా, ట్విటర్ ద్వారా పాపులర్ అయ్యి డబ్బు సంపాదిస్తోంది. 'ఆడపిల్లలకు విటిలిగో ఉంటే ఆ అమ్మాయిలను తల్లిదండ్రులే ఇంటి నుంచి బయటకు రానీకుండా చూస్తారు. ఆమెను న్యూనతకు గురి చేస్తారు. విటిలిగో కేవలం ఒక చర్మస్థితి. ఇప్పుడు నేను పూర్తి విటిలిగోతో తెల్లగా అయిపోయాను. కాని నా జీవితాన్ని సమర్థంగా జీవిస్తున్నాను. మీరు ఎలా ఉన్నారో అలా కనపడుతూ ముందుకు సాగిపోండి' అని చెప్పి లక్షలాది మంది అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెంచుతోంది ఆస్థా. అందుకే ఆమెకు ఆహ్వానం.

ఆర్‌జె కరిష్మా



ఆర్‌జె కరిష్మా

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా నెలకు 30 లక్షలు సంపాదిస్తున్న కరిష్మా బహురూపాలు వేసి కామెడీ చేయడంలో నేర్పరి. చిన్నప్పుడు ఒక రోజు కరిష్మా గదిలో నుంచి రకరకాల గొంతులు వినిపిస్తుంటే తల్లి కంగారు పడి తలుపు తట్టి 'కరిష్మా నీతో ఎవరున్నారు' అని అడిగితే తలుపు తెరిచిన కరిష్మా అవన్నీ తాను మిమిక్రీ చేస్తున్న గొంతులని చెప్పింది. జమ్ము కశ్మీర్‌కు చెందిన కరిష్మా నటి కావాలనుకుని ఆర్.జె. అయ్యి ఆ తర్వాత కామెడీ బిట్స్ చేసే యూట్యూబర్‌గా ఖ్యాతి పొందింది. ఇండోర్‌లో రెడ్ ఎఫ్.ఎం.లో పని చేసేటప్పుడు ఆమె షో సూపర్‌హిట్ అయ్యింది. మానవ ప్రవర్తనల్లోని భిన్నత్వాన్ని ఆమె చూపే విధానం వల్ల చాలా సీరియస్ విషయాలను కూడా తేలిగ్గా తీసుకుని ముందుకు సాగవచ్చనే దిలాసా ఇస్తుంది. అందుకే ఆమెకు ఈ ఆహ్వానం.

నిహారికా ఎన్.ఎమ్.


బెంగళూరులో పుట్టి పెరిగి ఇప్పుడు లాస్ ఏంజెలిస్‌లో ఉంటున్న నిహారికకు తెలుగు బాగా వచ్చు. బహుశా తెలుగు మూలాలు ఉండొచ్చు. యూట్యూబ్‌లో, ఇన్‌స్టాలో నిహారిక చేసే వీడియోలకి లక్షల మంది ఫాలోయెర్స్ ఉన్నారు. నిహారికతో షో చేస్తే ప్రచారం లభిస్తుందని భావించే పెద్ద పెద్ద సెలబ్రిటీలు ఉన్నారు. 27 ఏళ్ల ఈ ఇన్‌ఫ్లుయెన్సర్ లోపలొకటి బయటొకటిగా ఉండే మనుషులను గేలి చేస్తూ బోలెడన్ని వీడియోలు చేసి నవ్విస్తుంటుంది. 'మార్కులు వస్తేనే జీవితం. గొప్ప మార్కులు వచ్చినవారే గొప్ప జీవితాన్ని గడపగలరు అనే భావన నుంచి తల్లిదండ్రులు బయటపడాలి. పిల్లల తెలివితేటలు, ఆసక్తిని బట్టి వారిని ప్రోత్సహిస్తే వారు సక్సెస్ అవుతారు. నేను డాక్టరో ఇంజనీరో కావాలని మా అమ్మా నాన్నలు అనుకున్నారు. కాని లక్షలాది మంది అభిమానించే యూట్యూబర్‌ని అయ్యాను. కలలు కని ముందుకు సాగండి' అనే సందేశం ఇస్తుంటుంది నిహారిక. ఆమె ఇప్పుడు రెడ్ కార్పెట్ మీద హంగామా చేయనుంది.

చెన్నైకి చెందిన చరణ్య కుమార్‌కు గేమింగ్ అంటే ఎంతో ఇష్టమో, పురాణాలు అంటే కూడా అంతే ఇష్టం. అందుకే పురాణాలలోని ఆసక్తికర అంశాలను, స్ఫూర్తిదాయకమైన విషయాలను గేమింగ్‌లోకి తీసుకువచ్చింది చరణ్య కుమార్. ఆమె ప్రారంభించిన 'చిత్తం' గేమింగ్ కంపెనీ విజయపథంలో దూసుకుపోతోంది...

రూట్స్

ఆటలకు పురాణ సౌరభం





చరణ్య కుమార్

యూఎస్‌లో ఇంజినీరింగ్ చేసిన చరణ్య కుమార్ ఎన్నో పెద్ద కంపెనీలలో కన్సల్టింగ్ విభాగంలో పనిచేసింది.

కొన్ని సంవత్సరాల క్రితం వ్యక్తిగత జీవితంలో ఏర్పడిన సమస్యల వల్ల పురాణాలకు దగ్గరైంది. వాటిని చదవడం తనకు ఎంతో సాంత్వనగా ఉండేది.

అమ్మమ్మ ద్వారా పురాణాలలోని గొప్పదనం గురించి చిన్న వయసులోనే విన్నది కుమార్.

'జీవితంలో ప్రతి సమస్యకు పురాణాల్లో సమాధానం దొరుకుతుంది' అంటుంది కుమార్.

ఉద్యోగం నుంచి బ్రేక్ తీసుకున్న కుమార్ ఆ తరువాత ఎంబీఏ చేసింది.

'పురాణాలు ఆధ్యాత్మికతకు మాత్రమే పరిమితమైనవి కాదు. పౌరాణిక విషయాలు నిత్యజీవితంలో ఎన్నో రకాలుగా దారి చూపుతాయి. కష్టకాలంలో పురాణ పఠనం నాకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు సొంతంగా ఏదైనా ప్రారంభించాలనే పట్టుదలను కూడా ఇచ్చింది. కానీ ఏం చేయాలో ఎలా చేయాలో తెలియదు. నేను ధైర్యంగా వేసిన మొదటి అడుగు ఎంబీఏ చేయడం' అంటున్న కుమార్ గేమింగ్ కంపెనీ 'చిత్తం' రూపంలో తన కలను నెరవేర్చుకుంది.

తక్కువ ప్రాడక్ట్‌లతో మొదలైన 'చిత్తం' మొదటి సంవత్సరంలోనే పదమూడు ప్రాడక్ట్స్‌కు చేరుకుంది.

'ఫన్' ఎలిమెంట్స్‌ను జత చేస్తూ 'చిత్తం' రూపొందించిన గేమ్స్, యాక్టివిటీస్, బుక్స్ సూపర్ హిట్ అయ్యాయి.

తమిళ సామెతలను దృష్టిలో పెట్టుకొని 'పార్టీ టాక్స్' అనే గేమ్‌ను డిజైన్ చేశారు.

'భరత విలాస్' అనేది చిత్తం బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఈ కార్డ్ గేమ్ మన సంస్కృతిలోని రకరకాల నృత్యరూపాలు, వంటల రుచులు... మొదలైన వాటిని వెలికి తీస్తుంది.

'సింపుల్ గేమ్ ప్లే-సింపుల్ కంటెంట్ అనే రూల్‌ని నమ్ముకొని ప్రయాణం ప్రారంభించాం. మా నమ్మకం వృథా పోలేదు' అంటుంది చరణ్య.

వ్యాపార అనుభవం లేకపోవడం వల్ల మొదట్లో ఫండింగ్ విషయంలో కాస్తో కూస్తో ఇబ్బంది పడినా ఆ తరువాత మాత్రం తనదైన ప్రత్యేకతతో ఇన్వెస్టర్‌లను ఆకర్షించి విజయపథంలో దూసుకుపోతోంది 'చిత్తం'.

సాగుబడి
కృత్తిక కార్తె :
మే 11 నుంచి

గుర్రాల విసర్జితాలతోనూ జీవామృతం!

- గుర్రాల పేడ, మూత్రంతో అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతాన్ని తయారు చేసి సేంద్రియ పంటలు పండిస్తున్న మహిళా రైతు జయ దగ
- ట్యూబ్ పద్ధతిలో గిర్ ఆవులు, గుర్రాల వ్యర్థాలతో వేర్వేరుగా అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతం ఉత్పత్తి
- ఆవుల జీవామృతంతో పోల్చితే గుర్రాల జీవామృతం ప్రభావశీలంగా పనిచేస్తోందని జయ అంటున్నారు

ప్రకృతి వ్యవసాయానికి ముఖ్యంగా అవసరమైనది జీవామృతం. దేశీ ఆవుల పేడ, మూత్రం, బెల్లం తదితర పదార్థాలతో తయారు చేసే జీవామృతం ప్రభావశీలంగా పనిచేస్తుందన్న భావన ఉంది. అయితే, రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో రాజస్థాన్‌కు చెందిన మహిళా రైతు 'జయ దగ' అందుకు భిన్నంగా.. గుర్రాల పేడ, మూత్రంతో కూడా ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్నారు. గిర్ ఆవుల విసర్జితాలతోనే కాకుండా.. గుర్రాల విసర్జితాలతో కూడా ఆమె వేర్వేరుగా ద్రవ జీవామృతం తయారు చేసి తమ పొలాల్లో వివిధ పంటల సేంద్రియ సాగులో ఆమె వాడుతున్నారు.

అహ్మదాబాద్‌కు చెందిన మహేశ్ మహేశ్వరి అభివృద్ధి చేసిన ట్యూబ్ పద్ధతిలో అధిక కర్బనంతో కూడిన అడ్వాన్స్‌డ్ ద్రవ జీవామృతాన్ని ఈ రెండు రకాలుగా జయ గత 8 నెలలుగా తయారు చేసి వినియోగిస్తున్నారు. ఈ జీవామృతంతో తమ వ్యవసాయ క్షేత్రాల్లో నేపియర్ గడ్డి, మునగ, మామిడి తదితర పంటలను సేంద్రియంగా సాగు చేస్తున్నారు.

ఆవుల జీవామృతంతో పోల్చితే గుర్రాల విసర్జితాలతో తయారైన జీవామృతం పంటల సాగులో మరింత ప్రభావశీలంగా పనిచేస్తోందని జయ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. అయితే, గుర్రాల జీవామృతాన్ని ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న వేసవి కాలంలో పంటలకు వాడకూడదని, ఇతర కాలాల్లో ఏ పంటలకైనా వాడొచ్చని ఆమె సూచిస్తున్నారు.



గుర్రాల పెంపక క్షేత్రంలో జయ దగ



గుర్రాల పెంపక క్షేత్రాలు

రాజస్థాన్‌కు చెందిన జయ దగ కుటుంబీకుల ప్రధాన వ్యాపారం గుర్రాల ద్వారా ఔషధాల ఉత్పత్తి. ఇందుకోసం సుమారు 2 వేల వరకు గుర్రాలను రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని ముత్పూర్, రాజాపూర్ గ్రామాల్లో గల తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆమె పెంచుతున్నారు. పాములు, తేళ్లు కాటు వేసినప్పుడు విరుగుడుగా వాడే ఇంజక్షన్లతో పాటు.. కుక్క కాటు వేసినప్పుడు రేబిస్ సోకకుండా వేసే ఇంజక్షన్లను సైతం పోనీల ద్వారా దాదాపు మూడు దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఇంజక్షన్లను భారత ప్రభుత్వానికి విక్రయించటంతో పాటు.. అనేక ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు తమ విన్స్ బయో ప్రోడక్ట్స్ సంస్థ ద్వారా ఎగుమతి చేస్తున్నట్లు జయ దగ వివరించారు.

అహ్మదాబాద్‌కు చెందిన ఆవిష్కర్త మహేశ్ మహేశ్వరి వద్ద నుంచి పొందిన టెక్నాలజీ ద్వారా జయ ట్యూబ్ పద్ధతిలో అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని తమ క్షేత్రంలో గత 8 నెలలుగా తయారు చేస్తున్నారు. ట్యూబ్ ద్వారా ప్రత్యేక పద్ధతిలో తయారవుతున్న ఈ అడ్వాన్స్‌డ్ జీవామృతం తమ పొలాల్లో మంచి ఫలితాలనిచ్చిందని ఆమె సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా ఆమె క్షేత్రంలో పెరుగుతున్న నేపియర్ గడ్డి, మునగ తోటలు చాలా ఆరోగ్యంగా, ఆకుపచ్చగా ఆకర్షణీయంగా ఉండటం విశేషం. నేపియర్ గడ్డి, మునగ ఆకు ముక్కలతో పాటు బార్లీ, సోయా, మొక్కజొన్నల మొలకలు, గోధుమ తవుడుతో కూడిన దాణాను కూడా ఆవులు, గుర్రాలకు ఆమె మేపుతున్నారు.

అడ్వాన్స్‌డ్ జీవామృతం అరెకరానికి ఉచితం!



రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లోని తమ క్షేత్రానికి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న రైతులు ఎవరైనా సేంద్రియ వ్యవసాయం చెయ్యాలనుకుంటే.. ఒక్కో రైతుకు అరెకరానికి సరిపోయే అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని ఉచితంగా ఇస్తాను. వరి లేదా పత్తి వంటి పంటలకు ఎకరానికి 400 లీటర్ల అడ్వాన్స్‌డ్ జీవామృతం అవసరం ఉంటుంది. ఒక్కో రైతుకు అరెకరానికి సరిపడా 200 లీటర్లను రెండు దఫాలుగా ఇస్తాను. గిర్ ఆవుల జీవామృతం లీటరు రూ. 10. గుర్రాల జీవామృతం లీటరు రూ. 15. ఆర్గానిక్ పురుగుల మందు లీటరు రూ. 20కి విక్రయిస్తున్నాం. వీటితో సాగు చేసిన నేపియర్ గడ్డి మేపిన తర్వాత గిర్ ఆవు పాలలో కొవ్వు శాతం 3.4 నుంచి 4.7కు పెరిగింది. ఇతర వివరాలకు డాక్టర్ వెంకటేశ్ (98482 09696)ను సంప్రదించవచ్చు.

– జయ దగ, మహిళా రైతు, తిమ్మాపూర్, రంగారెడ్డి జిల్లా jsd@vinsbio.in

ఆర్గానిక్ పురుగుల మందు కూడా..

ఆర్గానిక్ పురుగుల మందును కూడా 200 లీటర్ల ట్యూబ్ ద్వారా మహిళా రైతు జయ దగ తయారు చేస్తున్నారు. మహేశ్ మహేశ్వరి నుంచి తెచ్చిన మైక్రోబియల్ కల్చర్ 2 లీటర్లు, 2 కిలోల దేశీ ఆవు పేడ, 10 కిలోల పెరుగుతో చేసిన మజ్జిగ, 40 లీటర్లు దేశీ ఆవు మూత్రం కలిపి ట్యూబ్‌లో పోస్తారు. 30 రోజులు ఇలా పోస్తూనే ఉండాలి. 30 రోజుల తర్వాత ట్యూబ్ నుంచి ఆర్గానిక్ పురుగుమందును తీసుకొని వాడుకోవచ్చు. ఈ పురుగుమందును నేరుగా పంటలపై చల్లకూడదు. 1 లీ. పురుగు మందును 1 లీ. నాటు ఆవు మూత్రం, 1 లీ. పుల్ల మజ్జిగ, 17 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయాలి. ఈ ఆర్గానిక్ పురుగుమందును పిచికారీ చేసిన రోజు జీవామృతం పిచికారీ చేయకూడదని జయ తెలిపారు.



50 వేల లీటర్ల ట్యూబ్‌లు రెండు..

గుర్రాలు, పోనీలతో పాటు వందలాది గిర్ ఆవుల పోషణ కోసం గత 8 నెలల నుంచి తిమ్మాపూర్ వ్యవసాయ క్షేత్రంలో అనేక ఎకరాల్లో నేపియర్ గడ్డిని, మునగ ఆకును జయ దగ సేంద్రియ పద్ధతిలో చేస్తున్నారు. ఇందుకోసం 50,000 లీటర్ల సామర్థ్యం గల ట్యూబ్‌లు రెండింటిని ఆమె ఏర్పాటు చేసుకున్నారు. ఒక దాని ద్వారా గిర్ ఆవుల పేడ, మూత్రంతో.. రెండో దానిలో గుర్రాల పేడ, మూత్రంతో అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారు చేస్తున్నారు. ఒక్కొక్క ట్యూబ్ రోజుకు వెయ్యి లీటర్ల అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని తయారు చేస్తున్నారు.

రోజూ వెయ్యి లీటర్లు..

50 వేల లీటర్లు పట్టే ట్యూబ్ నుంచి మహిళా రైతు జయ దగ వెయ్యి లీటర్ల జీవామృతం పొందుతున్నారు. అంతే మొత్తంలో లోపలికి పోస్తున్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 కేజీల ఆవులు లేదా గుర్రాల పేడ, 40 లీ. మూత్రం, 20 కిలోల బెల్లం, 10 కిలోల పండ్లు, 20 కిలోల కూరగాయలు, 10 కిలోల కలబంద జ్యూస్, 300 లీటర్ల జీవామృతంతో పాటు మిగతా 430 లీటర్ల నీటిని కలిపి ట్యూబ్‌లో పోస్తున్నారు. ఈ రోజు పోసింది నెలరోజుల తర్వాత అడ్వాన్స్‌డ్ జీవామృతంగా మారి బయటకు వస్తుంది.

ఏడాదిన్నర నిల్వ ఉంటుంది

సాధారణ జీవామృతంలో నలకలు పిప్పి ఉంటుంది. అయితే, ట్యూబ్‌లో గాలి తగలకుండా 30 రోజులు మగ్గిన తర్వాత అసలు ఏ నలకలూ, చెత్త లేని జీవామృతం వెలువడుతుంది. ఇందులో కర్బనం 15% వరకు ఉంటుందని, అందువల్ల ఇది సాధారణ జీవామృతం కన్నా ప్రభావశీలంగా పనిచేస్తుందని మహేశ్ మహేశ్వరి చెబుతున్నారు.

సాధారణ జీవామృతం 15 రోజుల తర్వాత పనికి రాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కలియతిప్పాలి. అయితే, ట్యూబ్ జీవామృతం కనీసం ఒక ఏడాది నుంచి ఏడాదిన్నర కాలం వరకు నిల్వ ఉంటుంది. ప్రతి రోజూ కలియతిప్పాల్సిన అవసరం లేదు. బ్యారెల్స్‌లో నింపుకొని నిల్వ చేసుకుంటే చాలు. మరో విషయం ఏమిటంటే.. ట్యూబ్‌ని కానీ, దానిలో తయారైన జీవామృతాన్ని గానీ నీడలోనే ఉంచాలన్న నియమం లేకపోవటం మరో విశేషం అని జయ దగ చెబుతున్నారు. ఈ ప్రత్యేకతల వల్ల అడ్వాన్స్‌డ్ జీవామృతాన్ని ఒక చోట తయారు చేసి, దూర ప్రాంతాలకు కూడా రవాణా చేసుకొని అవసరం అయినప్పుడు వాడుకోవచ్చు. ట్యూబ్ టెక్నాలజీ వల్ల తమకు గడ్డి సమస్య శాశ్వతంగా తీరిపోయిందని ఆమె సంతోషిస్తున్నారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

అడ్వాన్స్‌డ్ జీవామృతం 30 రోజుల్లో తయారవుతుంది!

సాధారణ జీవామృతం తయారీ ప్రక్రియకు.. ట్యూబ్ ద్వారా అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారీ ప్రక్రియకు చాలా వ్యత్యాసం ఉంది. ట్యాంకు లేదా డ్రమ్ములో వేసి నీటిలో నాటు ఆవు పేడ, మూత్రం, పప్పులపిండి, బెల్లం, పిడికెడు మంచి మట్టిని కలిపితే.. సాధారణ జీవామృతం 48 గంటల్లో వాడకానికి సిద్ధమవుతుంది. ఇందులో పిప్పి, పీచు, నలకలు అలాగే ఉంటాయి.

అయితే, ట్యూబ్‌లో అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారు కావటానికి 30 రోజులు పడుతుంది. ట్యూబ్‌ను ఏర్పాటు చేసుకొని, ఆ ట్యూబ్ పరిమాణాన్ని బట్టి నిర్ణీత పరిమాణంలో పేడ, మూత్రం, కూరగాయలు, పండ్ల వ్యర్థాలు తదితరాలను ద్రవ రూపంలోకి మార్చి ట్యూబ్‌లోకి వేస్తూ ఉంటారు. దీనికి తోడు మహేశ్ మహేశ్వరి రూపొందించిన ప్రత్యేక మైక్రోబియల్ కల్చర్‌ను కూడా తగిన మోతాదులో కలిపి వేస్తూ ఉంటారు. ఇలా ప్రతి రోజూ ట్యూబ్ లోపలికి వేస్తూనే ఉండాలి.

30 రోజులు వేసిన తర్వాత నుంచి ప్రతి రోజూ ఎటువంటి పిప్పి, పీచు, నలకలు లేని శుద్ధమైన అడ్వాన్స్‌డ్ జీవామృతం ట్యూబ్ నుంచి వెలికివస్తుంది. ప్రతి రోజూ ఎంత పరిమాణంలో పేడ తదితరాలను ట్యూబ్‌లో ఒక వైపు నుంచి వేస్తూ ఉంటామో.. ట్యూబ్ వేరే వైపు నుంచి అంతే మోతాదులో అడ్వాన్స్‌డ్ జీవామృతం బయటకు వస్తుంది. సాధారణ ద్రవ జీవామృతాన్ని 15 రోజుల్లో వాడేయాలి. అయితే, ఈ అడ్వాన్స్‌డ్ జీవామృతం ఏడాదిన్నర వరకు నిల్వ ఉంటుందని.. అధిక కర్బనం, సూక్ష్మజీవుల జీవవైవిధ్యంతో కూడినదైనందు వల్ల ఎంతో ప్రభావశీలంగా పనిచేస్తుందని మహేశ్ మహేశ్వరి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు.




అడ్వాన్స్‌డ్ జీవామృతం తయారుచేసే ట్యూబ్‌లు

ధాన్యం తడవకుండా కాపాడే మంచె!

వరి పంట పండించటంలోనే కాదు, పంటను నూర్పిడి చేసి ఆరుబయట కళ్లంలో ధాన్యాన్ని ఆరబెట్టుకోవటంలోనూ రైతులకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షాలకు కళ్ళాల్లో వరి ధాన్యం తడిచిపోవటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కళ్లాల్లో పంట కళ్లెదుటే నీటిపాలవ్వకుండా రక్షించుకోవటానికి రైతులు ఎవరికి వారు తమ కళ్లం దగ్గరే నిర్మించుకోదగిన ఓ ప్లాట్‌ఫామ్ గురించి సింగరేణి మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీరామ సూచిస్తున్నారు.

ఇది కళ్లం/పొలంలోనే నిర్మించుకునే శాశ్వత నిర్మాణం. నలు చదరంగా ఉండే పొలంలో అయితే, ప్లస్ ఆకారంలో,



సుమారు 6 అడుగుల వెడల్పు, 3 అడుగుల ఎత్తుగల మంచెను పర్మనెంటుగా వేసి ఉంచాలి. దీర్ఘ చతురస్రాకార పొలమైతే, పొడుగ్గా దీన్ని నిర్మిస్తే చాలు. దీనికి, పొలం గట్లపై ఉండే 2 లేక 3 తాడి చెట్లు కొట్టి వేస్తే చాలు. తాటి మొద్దులను 5 అడుగుల ముక్కలుగా కోసి, భూమిలోకి 2 అడుగులు, భూమి పైన 3 అడుగులు ఎత్తున ఉండేలే చూడాలి. రెండు మొద్దుల మధ్య దూరం 6 అడుగులు ఉంటే చాలు. దీని మీద జీఐ చెయిన్ లింక్ ఫెన్స్ లేదా మెటల్ ఫెన్స్ లేదా రోజ్ హెడ్ నెయిల్స్ సహాయంతో వ్యవసాయ సీజన్ మొదట్లోనే అమర్చి ఉంచుకోవాలి. అకాల వర్షం వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన సమయంలో ఈ మంచెపైన టార్పాలిన్ షీట్ పరచి, దానిపైన ధాన్యాన్ని ఎత్తి పోసుకోవాలి. ధాన్యంపైన కూడా టార్పాలిన్ షీట్ కప్పి చైన్ లింక్ ఫెన్స్‌కి తాళ్లతో గట్టిగా కట్టాలి. ఎంతపెద్ద గాలి అయినా, తుపాను అయినా, 2 అడుగుల లోపు వరద వచ్చినా, ధాన్యం తడవకుండా ఇలా రక్షించుకోవచ్చు. ధాన్యం ధర తగ్గించి అమ్ముకోవాల్సిన అవసరం ఉండదు.

చిన్న కమతాల్లో అయితే అకాల వర్షం నుంచి పంటను కాపాడుకోవటానికి రైతు, అతని భార్య ఈ పని చేసుకోవచ్చు లేదా ఇద్దరు మనుషులు చాలు. ఈ మంచెకు పొలం విస్తీర్ణంలో ఒక శాతం అంటే ఎకరానికి ఒక సెంటు స్థలాన్ని కేటాయిస్తే చాలు. ఆ స్థలం కూడా వృథా కాదు. దీన్ని పందిరిగా వాడుకుంటూ బీర, ఆనప, చిక్కుడు తదితర తీగ జాతి కూరగాయలు సాగు చేసుకోవచ్చు.

చిత్రంలో సూచించిన మాదిరిగా మంచెను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇక్కడ సూచించిన కొలతలను రైతులు తమ అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు. ఎకరానికి ఒక సెంటు భూమిలో ఇలా తక్కువ ఖర్చుతో, రైతుకు తేలికగా దొరికే తాడి దుంగలతో వేదికను నిర్మించుకుంటే సరిపోతుందని శ్రీరామ (83095 77123) సూచిస్తున్నారు.



నేరుగా ఫైనల్లో పోటీపడనున్న కిశోర్, నీరజ్

ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్లు నీరజ్ చోప్రా, కిశోర్ నేరుగా ఫైనల్లోనే పోటీపడతారు. ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ మూడేళ్ల తర్వాత స్వదేశంలో ఓ టోర్నీలో పాల్గొంటున్నాడు. కనీస అర్హత ప్రమాణం 75 మీటర్లను పలుమార్లు తమ కెరీర్‌లో అధిగమించినందుకు నిర్వాహకులు నీరజ్, కిశోర్‌లకు నేరుగా ఫైనల్లో పాల్గొనే అవకాశం ఇచ్చారు.

నెదర్లాండ్స్ టి20 జట్టులో తేజ



పురుషుల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడిన నెదర్లాండ్స్ జట్టుకు స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో పోటీపడ్డ నెదర్లాండ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన తేజ నిడమనూరు టి20 ప్రపంచకప్‌నకు కూడా ఎంపిక కావడం విశేషం. నెదర్లాండ్స్ జట్టు: స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), ఆర్యన్ దత్, బస్ డి లిడీ, డోరమ్, క్లాసెన్, కైల్ క్లీన్, లొగాన్ వాన్ బీక్, మాక్స్ ఓ డౌడ్, లెవిట్, మీకెరెన్, సైబ్రాండ్, తేజ నిడమనూరు, ప్రింగిల్, విక్రమ్ సింగ్, వెస్లీ బారెసి.

నిఖత్ శుభారంభం



అస్తానా (కజకిస్తాన్): ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన 52 కేజీల విభాగం తొలి రౌండ్‌లో నిఖత్ 5–0తో రఖీమ్‌బెర్డీ జన్సాయా (కజకిస్తాన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన మీనాక్షి (48 కేజీలు), అనామిక (50 కేజీలు) కూడా తొలి రౌండ్‌లో విజయాలు అందుకున్నారు. మీనాక్షి 4–1తో గసిమోవా రొక్సానా (కజకిస్తాన్)పై గెలుపొందగా... అనామిక పంచ్‌ల ధాటికి ఆమె ప్రత్యర్థి జుమ్‌బయేవా అరైలిమ్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి భారత బాక్సర్‌ను విజేతగా ప్రకటించారు. ఇస్మిత్ (75 కేజీలు), సోనియా (54 కేజీలు) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ఇష్మిత్ 0–5తో అర్మాత్ (కజకిస్తాన్) చేతిలో, సోనియా 0–5తో చాంగ్ యువాన్ (చైనా) చేతిలో ఓడిపోయారు.

ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ



రోమ్: ఇటాలియన్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–2తో అర్నాల్డి–పసారో (ఇటలీ) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట మూడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో బొలెలీ–వావాసోరి (ఇటలీ)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు.



గుజరాత్ అవుట్

వర్షంతో మ్యాచ్ రద్దు

- టైటాన్స్, కోల్‌కతాలకు చెరో పాయింట్
- 19 పాయింట్లతో టాప్ –2 ఖాయం చేసుకున్న నైట్‌రైడర్స్

అహ్మదాబాద్: సొంతగడ్డపైనే గుజరాత్ టైటాన్స్ పుట్టి మునిగింది. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచి ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉన్న నిరుటి రన్నరప్ టైటాన్స్ ఆశల్ని భారీ వర్షం ముంచేసింది. తెరిపినివ్వని వానతో నరేంద్ర మోదీ స్టేడియం తడిసిముద్దయ్యింది. కనీసం 5 ఓవర్ల మ్యాచ్‌గానైనా నిర్వహించేందుకు గ్రౌండ్ సిబ్బంది చాలా కష్టపడింది. కానీ ఆగినట్లే ఆగిన వాన మళ్లీ చినుకు చినుకుగా పడటంతో నిర్వాహకులు చేసేదేమీలేక తుది నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. నిజానికి రాత్రి 10 గంటలైనా అసలు టాస్ వేసేందుకే అవకాశం లేకపోయింది. చివరిసారిగా రాత్రి 10.36 గంటలకు మైదానాన్ని పరిశీలించిన ఫీల్డు అంపైర్లు నవ్‌దీప్ సింగ్, నిఖిల్ పట్వర్ధన్ మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ లభించగా, ఆటగాళ్లు పరస్పర కరచాలనంతో మైదానంలోని ప్రేక్షకుల్ని పలుకరిస్తూ డ్రెస్సింగ్ రూమ్‌వైపు నడిచారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో వర్షంవల్ల రద్దయిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.

పటిష్టస్థితిలో కోల్‌కతా

ఫలితం తేలని మ్యాచ్‌తో టాప్-2 స్థానాలు మాత్రం తేలిపోయాయి. మ్యాచ్ రద్దుతో వచ్చిన ఒక పాయింట్‌తో కోల్‌కతా 19 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. కేకేఆర్ మిగిలున్న ఆఖరి మ్యాచ్‌లో ఓడినా... తొలి రెండు స్థానాల్లో ఉండటం ఖాయమైంది. ప్రస్తుతం 16 పాయింట్లతో ఉన్న రాజస్తాన్ రాయల్స్ తమ రెండు లీగ్ మ్యాచ్‌ల్లోనూ ఒకవేళ గెలిస్తే 20 పాయింట్లతో అగ్రస్థానంలోకి ఎగబాకుతుంది. అప్పుడు నైట్‌రైడర్స్ రెండో స్థానానికి పడిపోయినా ఎలిమినేటర్ ఆడే పరిస్థితి అయితే రాదు. ఐపీఎల్‌లోకి ప్రవేశించిన గత రెండేళ్ల నుంచి ఫైనల్ చేరిన గుజరాత్ ఈసారి ఇంకో మ్యాచ్ మిగిలున్నా... లీగ్ దశలోనే నిష్క్రమించనుంది. 2022లో టైటిల్ గెలిచిన టైటాన్స్ గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ప్రస్తుతం 13 మ్యాచ్‌ల్లో ఐదింట గెలిచిన టైటాన్స్ ఖాతాలో 11 పాయింట్లున్నాయి. ఒకవేళ ఆఖరిపోరు గెలిచినా... 13 పాయింట్లవద్దే ఆగిపోతుంది. అయితే పట్టికలో ఇప్పటికే కోల్‌కతా (19), రాజస్తాన్ (16), చెన్నై (14), హైదరాబాద్ (14) ముందు వరుసలో ఉండటంతో గుజరాత్ ఖేల్ లీగ్‌తోనే ముగిసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లక్నో	12	6	6	0	12	-0.769
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ఢిల్లీ
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత 85వ గ్రాండ్‌మాస్టర్‌గా శ్యామ్

12 ఏళ్ల తర్వాత మూడో జీఎం నార్మ్ అందుకున్న తమిళనాడు ప్లేయర్



దుబాయ్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా 12 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ అనుకున్నది సాధించాడు తమిళనాడు చెస్ ప్లేయర్ శ్యామ్ నిఖిల్. 31 ఏళ్ల శ్యామ్ నిఖిల్‌భారత చెస్‌లో 85వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. జీఎం హోదా దక్కాలంటే చెస్ ప్లేయర్ 2500 ఎలో రేటింగ్‌ను దాటడంతోపాటు మూడు జీఎం నార్మ్‌లు సాధించాలి. ఈ రెండూ సాధ్యమైతేనే జీఎం హోదా లభిస్తుంది. 2012లోనే శ్యామ్ 2500 ఎలో రేటింగ్‌ను అందుకోవడంతోపాటు రెండు జీఎం నార్మ్‌లు సాధించాడు. అయితే చివరిదైన మూడో జీఎం నార్మ్ కోసం సుదీర్ఘంగా నిరీక్షించాల్సి వచ్చింది. 12 ఏళ్లపాటు వేచి చూశాక ఎట్టకేలకు శ్యామ్ నిఖిల్ దుబాయ్ పోలీస్ మాస్టర్స్ ఓపెన్ చెస్ టోర్నీలో జీఎం హోదా ఖరారు కావడానికి అవసరమైన మూడో జీఎం నార్మ్‌ను అందుకున్నాడు. ఈ టోర్నీలో శ్యామ్ నిఖిల్ ఐదు పాయింట్లతో 39వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ క్రమంలో ఏడుగురు గ్రాండ్‌మాస్టర్లతో తలపడిన శ్యామ్ ఒకరిపై గెలిచి, ఆరుగురితో 'డ్రా' చేసుకొని మూడో జీఎం నార్మ్‌ను సాధించాడు. 'ఎనిమిదేళ్ల వయస్సులో చెస్ ఆడటం ప్రారంభించాను. అయితే మూడేళ్లపాటు ఏ టోర్నీలోనూ ఆడలేదు. ఆ తర్వాత అండర్–13 రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాను. 2012లోనే రెండు జీఎం నార్మ్‌లు అందుకున్నా మూడో జీఎం నార్మ్ సులభంగా రాలేదు. పలుమార్లు చేరువై దూరమయ్యాను. ఎట్టకేలకు 12 ఏళ్ల తర్వాత మూడో జీఎం నార్మ్ అందుకోవడంతో చాలా సంతోషంగా ఉంది' అని 2022లో కామన్వెల్త్ చాంపియన్‌గా నిలిచిన శ్యామ్ నిఖిల్ వ్యాఖ్యానించాడు.

షాట్‌పుట్‌లో ఆభా జాతీయ రికార్డు



భువనేశ్వర్: ఫెడరేషన్ కప్ జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో రెండో రోజు కొత్త జాతీయ రికార్డు నమోదైంది. మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో ఆభా ఖటువా జాతీయ రికార్డు నెలకొల్పింది. బెంగాల్‌లో జన్మించి మహారాష్ట్ర తరఫున పోటీపడుతున్న ఆభా ఇనుప గుండును 18.41 మీటర్ల దూరం విసిరి జాతీయ రికార్డు సృష్టించడంతోపాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. గత జాతీయ రికార్డు కూడా ఆభా (18.06 మీటర్లు) పేరిటే ఉండటం గమనార్హం. మరోవైపు పురుషుల 200 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షణ్ముగ శ్రీనివాస్ (20.97 సెకన్లు) రజత పతకం సాధించాడు.

ఐపీఎల్ నుంచి స్వదేశానికి...

ఇంగ్లండ్‌కు పయనమైన బట్లర్, జాక్స్



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగింపు దశకు చేరగా... ఆయా జట్లకు కీలకమైన ఇంగ్లండ్ ఆటగాళ్లు తిరుగుపయనమయ్యారు. జోస్ బట్లర్ (రాజస్తాన్), లివింగ్‌స్టోన్ (పంజాబ్ కింగ్స్), విల్ జాక్స్, రీస్ టాప్లీ (బెంగళూరు)లు ఇంగ్లండ్‌కు బయలుదేరారు. వచ్చే నెల 2 నుంచి అమెరికా, వెస్టిండీస్‌లలో జరిగే టి20 ప్రపంచకప్‌కు తుది సన్నాహంగా సొంతగడ్డపై ఇంగ్లండ్ జట్టు పాకిస్తాన్‌తో టి20 సిరీస్ ఆడనుంది. మే 22 నుంచి ఇరు జట్ల మధ్య నాలుగు టి20ల సిరీస్ జరుగుతుంది. 22, 25, 28, 30 తేదీల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా... ఈ ఐపీఎల్ సీజన్‌లో లివింగ్‌స్టోన్ ఆకట్టుకోలేకపోయాడు. బట్లర్ రాజస్తాన్ స్టార్ ఓపెనర్. ఈ సీజన్‌లో ఒంటిచేత్తో కొన్ని మ్యాచ్‌ల్ని గెలిపించాడు. బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జాక్స్, టాప్లీలలో జాక్స్‌ది కీలకపాత్ర. బెంగళూరు వరుస విజయాల్లో భాగమైన అతను లేకపోవడం జట్టుకు లోటే! చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు... చెన్నైతో ఈ నెల 18న తలపడుతుంది.

సినిమా



● విష్ణు మంచు

కాన్స్‌లో కన్నప్ప

ప్రతిష్ఠాత్మక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీమ్ సందడి చేయనుంది. విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ నెల 14 నుంచి 25 వరకూ జరగనున్న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 20వ తేదీన 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'గా కన్నప్ప మూవీ టీజర్‌ని ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విష్ణు మంచు సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ''కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో 'కన్నప్ప' సినిమా టీజర్‌ను ఆవిష్కరించనుండటం ఆనందంగా ఉంది. మేం ఎంతో ఇష్టంగా రూపొందిస్తున్న కన్నప్పను ప్రపంచ ప్రేక్షకులకు చూపించేందుకు కాన్స్ అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. మన భారతీయ చరిత్రను ప్రపంచ వేదికపైకి తీసుకురావడం, మన కథలు, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం'' అని ట్వీట్ చేశారు విష్ణు మంచు.

డబ్బింగ్ డన్



● దీపికా పదుకోన్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ సినిమా ద్వారా హీరోయిన్ దీపికా పదుకోన్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 27న విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. 'కల్కి 2898 ఏడీ'లో తన పాత్రకి సంబంధించిన డబ్బింగ్‌ని పూర్తి చేశారట దీపికా పదుకోన్. హిందీ, కన్నడ భాషల్లో ఆమె డబ్బింగ్ చెప్పినట్లు సమాచారం. హీరో రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్‌లకు 2018 నవంబర్ 14న వివాహం అయింది. ప్రస్తుతం దీపిక గర్భవతి. దీంతో సినిమాలకు గ్యాప్ ఇచ్చి జూన్ నెల నుంచి పూర్తిగా ఇంటికే పరిమితమై ఆమె విశ్రాంతి తీసుకోనున్నారని టాక్. ఈ కారణంగానే 'కల్కి 2898 ఏడీ' మూవీలో తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారట ఆమె. అదే విధంగా ఈ సినిమా ప్రమోషన్స్ కోసం దీపిక స్పెషల్ ఇంటర్వ్యూలని కూడా ముందుగానే ప్లాన్ చేసిందట చిత్ర యూనిట్. ఇదిలా ఉంటే ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లిష్... ఇలా పలు భాషల్లో విడుదల కానుంది. హిందీ, కన్నడ వెర్షన్లకు దీపిక డబ్బింగ్ చెప్పారు. ఇతర భాషల్లో ఆమె పాత్రకు వేరేవారితో డబ్బింగ్ చెప్పిస్తారా? లేక దీపికానే చెబుతారా? అనేది తెలియాల్సి ఉంది.

ఆడపిల్లనే... ఐతే ఏంటంట

హీరోలకు ప్రేమ కబుర్లు చెప్పే పాత్రలే ఎక్కువగా చేసే హీరోయిన్లు ఫర్ ఎ చేంజ్ నేరస్తులకు బుద్ధి చెప్పే పనిలో పడ్డారు. న్యాయ పోరాటం కోసం ఏం చేయడానికి అయినా వెనకాడని పోలీసాఫీసర్లుగా బెల్టు బిగించారు... తుపాకీ గురి పెట్టారు.. లాఠీకి పని చెప్పారు. 'ఆడపిల్లనే... ఐతే ఏంటంట' అంటూ ఓ హీరోయిన్ పోలీస్ పాత్రలో రెచ్చిపోయారు. మిగతా కథానాయికలు కూడా దాదాపు అలానే అంటూ పోలీసు పాత్రల్లో విజృంభించారు. ఆ పోలీసాఫీసర్ల గురించి తెలుసుకుందాం.



● 'సత్యభామ'లో కాజల్ అగర్వాల్

సత్యభామ సాహసం

హైదరాబాద్ సిటీ ఏసీపీ కె. సత్యభామగా చార్జ్ తీసుకున్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఓ అమ్మాయి కేసు విషయంలో సత్యభామ పోలీసాఫీసర్‌గా ఆల్మోస్ట్ సస్పెండ్ అవ్వాల్సిన పరిస్థితి. మరి.. సత్యభామ ఈ కేసును ఎలా సాల్వ్ చేసింది? ఈ క్రమంలో ఆమె ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అన్నది 'సత్యభామ' సినిమాలో చూడాలి. సత్యభామగా కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్ చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో తక్కలపల్లి శ్రీనివాసరావు, బాబీ తిక్క నిర్మించారు. ఓ అమ్మాయి హత్యాచారం నేపథ్యంలో 'సత్యభామ' సినిమా కథ ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ నెల 17న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రంలో డీజీపీ నారాయణదాస్ పాత్రలో ప్రకాశ్‌రాజ్, అమరేందర్ అనే పాత్రలో నవీన్ చంద్ర లీడ్ రోల్స్‌లో నటించారు. నాగినీడు, హర్షవర్ధన్, రవివర్మ కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఈ సంగతి ఇలా ఉంచితే... పోలీసాఫీసర్‌గా కాజల్ అగర్వాల్ నటించడం ఇది తొలిసారి కాదు. 2014లో తమిళ హీరో విజయ్ నటించిన 'జిల్లా', గత ఏడాది విడుదలైన తమిళ చిత్రం 'ఘోస్ట్'లో కాజల్ పోలీసాఫీసర్‌గా నటించారు. ఆ రెండు చిత్రాల్లోనూ పవర్‌ఫుల్ పోలీస్‌గా ఒదిగిపోయారు కాజల్. తాజాగా 'సత్యభామ'లో కూడా పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా విజృంభించారని యూనిట్ పేర్కొంది.

పాయల్ రక్షణ

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తొలిసారి 'రక్షణ' కోసం ఖాకీ డ్రెస్ ధరించి, లాఠీ పట్టారు. పాయల్ రాజ్‌పుత్ ఫస్ట్ టైమ్ పోలీసాఫీసర్‌గా నటించిన చిత్రం ఇది. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఓ పోలీసాఫీసర్ జీవితంలోని ఓ ఘటనను ఆధారంగా చేసుకుని, ఈ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను తెరకెక్కించినట్లుగా యూనిట్ పేర్కొంది. రోషన్, మానస్, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ స్వరకర్త.

అగ్ని నక్షత్రం

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మర్డర్ మిస్టరీ చిత్రం 'అగ్ని నక్షత్రం'. ఈ చిత్రంలో మంచు లక్ష్మి ఓ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె దీక్ష అనే పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఎమ్. వంశీకృష్ణ దర్శకత్వంలో మంచు లక్ష్మి, మంచు మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మర్డర్ మిస్టరీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. మలయాళీ నటుడు సిద్ధిఖ్, సముద్రఖని, విశ్వంత్, చైత్ర శుక్లా ఈ సినిమాలో ఇతర కీ రోల్స్‌లో కనిపిస్తారు. ఈ చిత్రం విడుదలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఐతే ఏంటంట?

'కలర్ ఫోటో', 'గామి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు నటిగా మరింత దగ్గరయ్యారు హీరోయిన్ చాందినీ చౌదరి. ఈ బ్యూటీ ఇటీవల పోలీసాఫీసర్‌గా డ్యూటీ చేశారు. ఈ డ్యూటీ 'యేవమ్' సినిమా కోసం. ఈ సినిమాలో చాందినీ చౌదరితో పాటు వశిష్ఠ సింహా, జై భారత్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించారు. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించారు. మహిళా సాధికారిత నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ఎస్‌ఐ సౌమ్య పాత్రలో కనిపిస్తారు చాందినీ చౌదరి. ఇటీవల విడుదలైన ఈ సినిమా పోస్టర్‌పై 'ఆడపిల్లనే!.. ఐతే ఏంటంట?' అనే క్యాప్షన్ ఉంది. దీన్నిబట్టి ఈ సినిమాలో చాందిని పాత్ర చాలా స్ట్రాంగ్‌గా ఉంటుందని ఊహించవచ్చు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది.

ఇలా పోలీసాఫీసర్లుగా కనిపించనున్న దక్షిణాది హీరోయిన్లు మరికొంతమంది ఉన్నారు.



● 'అగ్ని నక్షత్రం'లో మంచు లక్ష్మి



● 'రక్షణ'లో పాయల్ రాజ్‌పుత్



● 'ఏవమ్'లో చాందిని

హీరోయిన్ త్రిష నటించిన తొలి వెబ్ సిరీస్ 'బృందా'. త్రిష టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ఇది. ఇందులో త్రిష పోలీసాఫీసర్ పాత్ర చేశారు. సూర్య వంగల దర్శకత్వం వహించిన ఈ తెలుగు వెబ్ సిరీస్ చిత్రీకరణ పూర్తయింది. స్ట్రీమింగ్ తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ క్యారెక్టర్ కావడం వల్లే త్రిష ఈ వెబ్ సిరీస్ చేశారని కోలీవుడ్ టాక్.



● 'బృందా'లో త్రిష

సాక్షి బిజినెస్
మంగళవారం
14-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
112	49
72,776	22,104

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,376	▲	35
డోజోన్స్	39,429	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,415	▽	19
డాక్స్	18,742	▽	31
షాంఘై	3,148	▽	7
నికాయ్	38,104	▽	125

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,490
బంగారం (99.5 స్వచ్ఛత)	72,200
వెండి (కిలో)	83,265

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.11	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.47	106.01
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.08	54.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	52.81	57.62
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.33	64.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

మార్చి త్రైమాసిక ఫలితాలు

జిందాల్ స్టీల్ మెరుపులు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం జిందాల్ స్టీల్ అండ్ పవర్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 933 కోట్లను తాకింది. వాటాదారులకు షేరుకి రూ. 2 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,708 కోట్ల నుంచి రూ. 13,521 కోట్లకు స్వల్పంగా నీరసించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 12,749 కోట్ల నుంచి రూ. 12,358 కోట్లకు తగ్గాయి. ముడివ్యయాలు రూ. 6,168 కోట్ల నుంచి రూ. 5,265 కోట్లకు దిగివచ్చాయి. ఈ కాలంలో 2.05 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయగా.. 2.01 ఎంటీ స్టీల్‌ను విక్రయించింది. ఇక పూర్తి ఏడాదికి / ందాల్ స్టీల్ నికర లాభం రూ. 3,193 కోట్ల నుంచి రూ. 5,943 కోట్లకు జంప్‌చేసింది. మార్చికల్లా కంపెనీ నికర రుణభారం రూ. 11,203 కోట్లుగా నమోదైంది.

జిందాల్ స్టీల్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 939 వద్ద ముగిసింది.

జొమాటో టర్న్‌అరౌండ్



క్యూ4లో రూ. 175 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో లిమిటెడ్ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 175 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 188 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,056 కోట్ల నుంచి రూ. 3,562 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,431 కోట్ల నుంచి రూ. 3,636 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి జొమాటో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 351 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022–23లో రూ. 971 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 7,079 కోట్ల నుంచి రూ. 12,114 కోట్లకు ఎగసింది. కాగా.. బ్లింక్ కామర్స్(గతంలో గ్రోఫర్స్ ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్ కొనుగోలు నేపథ్యంలో ఫలితాలను అంతక్రితం ఏడాదితో పోల్చిచూడతగదని జొమాటో పేర్కొంది. క్విక్ కామర్స్ బిజినెస్‌లో భాగంగా స్టోర్ల ఏర్పాటు వేగంగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. 2025కల్లా వీటి సంఖ్య 1,000కు చేరనున్నట్లు తెలియజేసింది.

పేమెంట్ లైసెన్స్ వెనక్కి

ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా సేవలందించేందుకు లభించిన అధీకృత సర్టిఫికెట్‌ను అనుబంధ సంస్థ జొమాటో పేమెంట్ ప్రయివేట్ లిమిటెడ్ స్వచ్ఛందంగా ఆర్‌బీఐకు తిరిగి అప్పగించనున్నట్లు జొమాటో వెల్లడించింది. డిజిటల్‌చెల్లింపుల విభాగంలో భారీ లబ్ధికి అవకాశం లేదని భావిస్తున్నట్లు తెలియజేసింది. వెరసి వాణిజ్య ప్రాతిపదికన పేమెంట్స్ బిజినెస్ లాభసాటికాదని నిర్ణయించుకున్నట్లు వివరించింది.

జొమాటో షేరు బీఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 194 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ స్పీడ్



న్యూఢిల్లీ: కరూర్ వైశ్యా బ్యాంక్ లాభం 35 శాతం పెరిగి రూ. 338 కోట్ల నుంచి రూ. 456 కోట్లకు చేరింది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం 45 శాతం వృద్ధి చెందింది. రూ. 1,605 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యాపారం 16 శాతం పెరిగి రూ. 1,40,806 కోట్ల నుంచి రూ. 1,63,536 కోట్లకు వృద్ధి చెందింది. నికర వడ్డీ మార్జిన్ 1 బీపీఎస్ పెరిగి 4.19 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏలు 0.74 శాతం నుంచి 0.40 శాతానికి దిగి వచ్చాయి.

బ్యాంక్ షేర్ బీఎస్‌ఈలో 1 శాతం తగ్గి రూ.188 వద్ద ముగిసింది.

డీఎల్‌ఎఫ్ పటిష్టం



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం డీఎల్‌ఎఫ్ లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 62 శాతం దూసుకెళ్లి రూ. 921 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 570 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,576 కోట్ల నుంచి రూ. 2,317 కోట్లకు జంప్‌చేసింది. ఇక పూర్తి ఏడాదికి డీఎల్‌ఎఫ్ నికర లాభం రూ. 2,036 కోట్ల నుంచి రూ. 2,727 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 6,012 కోట్ల నుంచి రూ. 6,958 కోట్లకు బలపడింది.

డీఎల్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 838 వద్ద ముగిసింది.

యూపీఎల్ నేలచూపు



న్యూఢిల్లీ: అగ్రోకెమికల్స్ దిగ్గజం యూపీఎల్ లిమిటెడ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 95 శాతం పతనమై రూ. 40 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో ఏకంగా రూ. 792 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 15 శాతం క్షీణించి రూ. 14,078 కోట్లను తాకింది. అంతక్రితం ఇదే కాలంలో రూ. 16,569 కోట్ల ఆదాయం సాధించింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 3,033 కోట్ల నుంచి రూ. 1,933 కోట్లకు భారీగా తగ్గింది. ఇబిటా మార్జిన్లు 34.4 శాతం నుంచి 29.4 శాతానికి బలహీనపడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) 21 కోట్ల డాలర్ల విస్తరణ వ్యయ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో యూపీఎల్ షేరు బీఎస్‌ఈలో 6.5 శాతం జంప్‌చేసి రూ. 534 వద్ద ముగిసింది.

5% దిగువనే రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 5 శాతం దిగువనే కొనసాగింది. సూచీ సమీక్షానెల్లో 4.83 శాతంగా నమోదయ్యింది. మార్చిలో నమోదయిన 4.85 శాతంతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. ఇది 11 నెలల కనిష్ఠ స్థాయి. అయితే 2023 ఇదే నెలతో పోల్చితే (4.7 శాతం) అధికంగా ఉంది. నెలవారీగా చూస్తే, ఒక్క ఆహార ద్రవ్యోల్బణం 8.52 శాతం (2024 మార్చి) నుంచి 8.70 శాతానికి పెరిగింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2తో 4 శాతంగా ఉండాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	550–00
చిత్తూరు	608–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00

గ్రీన్‌కో జీరోసీ భారీ కాంట్రాక్ట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమోనియా తయారీలో ఉన్న గ్రీన్‌కో జీరోసీ భారీ కాంట్రాక్ట్ దక్కించుకుంది. అమోనియా ట్రేడింగ్, పంపిణీలో ప్రపంచ దిగ్గజ సంస్థ అయిన ఓస్లోకు చెందిన యారా క్లీన్ అమోనియా తాజాగా ఏఎం గ్రీన్‌కు చెందిన గ్రీన్‌కో జీరోసీతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. గ్రీన్‌కో జీరోసీకి చెందిన కాకినాడ ప్లాంటు నుంచి యారా క్లీన్‌కు పునరుత్పాదక, కార్బన్ రహిత అమోనియా సరఫరా చేస్తామని ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ మహేశ్ కొల్లి తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్ వ్యవస్థాపకులు అయిన మహేశ్ కొల్లి, అనిల్ చలమలశెట్టి ఏఎం గ్రీన్‌ను స్థాపించారు. పర్యావరణ అనుకూల అమోనియా తయారీ కేంద్రాన్ని కాకినాడ వద్ద 10 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో కంపెనీ రెండు దశల్లో నిర్మిస్తోంది.

దక్షలో కోరమాండల్ వాటాల పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్ల తయారీ సంస్థ దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌లో అదనంగా 7 శాతం వాటా తీసుకుంటున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. దీంతో కంపెనీలో తమ మొత్తం వాటాలు 58 శాతానికి చేరతాయని వివరించింది. ఇందుకోసం రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు. ప్రారంభ దశ నుంచి దక్షతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిఫెన్స్, అగ్రి ఇన్‌పుట్ కంపెనీల నుంచి దక్షకు ప్రస్తుతం రూ. 265 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి.

బీఎండబ్ల్యూ బైక్ రూ.45 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సూపర్ ప్రీమియం బైక్స్ తయారీ దిగ్గజం బీఎండబ్ల్యూ భారత్‌లో సరికొత్త ఎం 1000 ఎక్స్‌ఆర్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.45 లక్షలు. పూర్తిగా తయారైన బైక్‌ను భారత్‌కు దిగుమతి చేసుకుంటారు.

భారీ నష్టాల్లోంచి లాభాల్లోకి..

- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- కలిసొచ్చిన ఆఖరి గంట కొనుగోళ్లు

ముంబై: భారీ నష్టాల నుంచి పుంజుకున్న స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 798 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 112 పాయింట్లు పెరిగి 72,776 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 234 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ ఆఖరికి 49 పాయింట్లు బలపడి 22,104 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు.., మిడ్ సెషన్ తర్వాత కోలుకున్నాయి. ముఖ్యంగా అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీవీఎస్ షేర్లు ఒక శాతానికి పైగా రాణించడంతో పాటు సూచీల రికవరీకి తోడ్పాటు అందాయి. సర్వీసెస్, రియల్టీ, ఫార్మా, పారిశ్రామికోత్పత్తి, కమోడిటీస్, బ్యాంకింగ్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కన్జూమర్, టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లోకి ట్రేడవుతున్నాయి.



→ క్యూ4 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో టాటా మోటార్స్ షేరు ఎనిమిది శాతానికి పైగా నష్టపోయి రూ.960 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 9.44% క్షీణించి రూ.948 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29,016 కోట్లు కోల్పోయి రూ.3.19 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.

indegene

హెల్త్‌కేర్ టెక్ సంస్థ ఇండిజెన్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.452)తో పోలిస్తే 45% ప్రీమియంతో 660 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో ఆరంభ లాభాలను కోల్పోయి 26% లాభంతో రూ.571 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.13,614 కోట్లుగా నమోదైంది.

పచ్చ మూకల విధ్వంస కాండ



టీడీపీ దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్



దేవాండ్లపల్లెలో రాళ్ల దాడి



వేములలో రోడ్డుపై పడిన రాళ్లు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో ఓటమి భయంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఫ్యాక్షన్, రౌడీ మూకలతో కలిసి బీభత్సం సృష్టించారు. కర్రలతో దండెత్తారు. కత్తులతో విరుచుకుపడ్డారు. ఏకంగా బాంబు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య ఓటర్లపై యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు బరితెగించి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఇళ్లు, వాహనాలపై దాడులకు తెగబడి విధ్వంస కాండతో చెలరేగిపోయారు. సామాన్య ప్రజానీకాన్ని హడలెత్తించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ విధ్వంసానికి దిగారు. ఈ గొడవలన్నింటికీ కర్త, కర్మ, క్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే పోలింగ్ సరళి టీడీపీకి వ్యతిరేకంగా ఉందనే విషయం స్పష్టం కావడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ బెంబేలెత్తిపోయారు. దాంతో ముందస్తు పన్నాగంతో సిద్ధం చేసిన తమ రౌడీమూకలకు పచ్చ జెండా ఊపారు. ఆ వెంటనే టీడీపీ, జనసేన రౌడీలు యథేచ్ఛగా దాడులకు తెగబడి రాష్ట్ర వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. ఉదయం మొదలైన ఈ దాడులు, దౌర్జన్య కాండ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

హడలెత్తిన టీడీపీ, జనసేన

సోమవారం ఉదయం పోలింగ్ మొదలు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వారిలో మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉండటం విశేషం. అంటే ఓటింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందన్నది స్పష్టమైంది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు.. విధ్వంసం సృష్టించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కర్రలు, కత్తులతోపాటు పెట్రోల్ బాంబులు కూడా ముందుగానే సమకూర్చుకోవడం టీడీపీ, జనసేన కుట్రకు నిదర్శనం. చంద్రబాబు ఆదేశించగానే.. టీడీపీ, జనసేన రౌడీలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడ్డారు.

చోద్యం చూసిన ఈసీ

టీడీపీ, జనసేన గూండాలు బరితెగించి విధ్వంసానికి పాల్పడి పోలింగ్‌కు ఆటంకులు సృష్టించినా ఎన్నికల కమిషన్(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నివ్వెర పరుస్తోంది. వారం రోజుల ముందు నుంచే టీడీపీ ఎన్నికల ప్రలోభాలపై వైఎస్సార్‌సీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా వుయ్ యాప్ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండటంపై పూర్తి ఆధారాలను కూడా సమర్పించింది. టీడీపీ గూండాలు దాడులకు పాల్పడిన ఉదంతాలను.. పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించేందుకు పదును పెడుతున్న కుట్రలను కూడా ఈసీ దృష్టికి తీసుకువెళ్లింది. అయినా సరే పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఈసీ పూర్తిగా విఫలమైంది. అసలు టీడీపీ, జనసేన గూండాలు వీధుల్లోకి వచ్చి చెలరేగిపోతున్నా, పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నా.. ఈవీఎంలను ధ్వంసం చేసినా.. ఏకంగా బాంబు దాడులకు పాల్పడినా సరే ఈసీ మాత్రం క్రియాశీలంగా స్పందించనే లేదు. పైగా వైఎస్సార్‌సీపీ నేతలనే కట్టడి చేసేందుకు యత్నించడం విభ్రాంతి కలిగిస్తోంది. గుంటూరు జిల్లా తెనాలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నబత్తున శివకుమార్‌ను మాత్రమే గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసులను ఏకపక్షంగా ఆదేశించడం విస్మయ పరిచింది. ఆయన్ను దూషించిన టీడీపీ కార్యకర్తపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసంపై టీడీపీ రౌడీలు దాడికి పాల్పడి, అక్కడ ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. కానీ ఈసీ మాత్రం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచమని పోలీసులను ఆదేశించడం విడ్డూరంగా ఉంది.

మచ్చుకత్తితో దాడి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో స్లిప్పుల పంపిణీ కోసం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శిబిరం వద్దకు ఓటర్లు వెళ్లడంతో ఓర్చుకోలేని టీడీపీ కార్యకర్త ఇడగొట్టు రంగప్ప మచ్చుకత్తితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంద్రప్పను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై పేగులు బయటకు వచ్చాయి. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఓటర్లు చెల్లాచెదురయ్యారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో పురుషోత్తం రెడ్డి కారు ధ్వంసమైంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌లపై హత్యాయత్నం

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రాణ భయంతో వారు తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. దాదాపు 300 మంది టీడీపీ గూండాలు వెంట పడటంతో కారెంపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం పొట్టి శ్రీరాములు కాలనీలోని ఎన్నికల బూత్‌ల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగి రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. కారెంపూడిలోని 288 నెంబర్ బూత్‌లో ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న గోగుల సాంబశివరావు తమ్ముడిపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడడంతో దాడిని అడ్డుకునే యత్నంలో సాంబశివరావు తలకు గాయమైంది. వైఎస్సార్ జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నూలి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం రాళ్ల దాడి చేశారు. కాగా, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో వైఎస్సార్సీపీకి చెందిన లావనూరు హనుమంతురెడ్డి కారు అద్దాలు పగిలాయి. రాళ్ల దాడిలో జల్లా సునంద అనే మహిళకు చేయి విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

పూతలపట్టులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై పచ్చ మూక దాడులకు పాల్పడింది. పేటగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అనంతరం పేటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుస్వామినాయుడుపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో గురుస్వామి నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వావిల్‌తోట పంచాయతీ సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా వున్న హరిబాబుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే జిల్లా సోమల మండలం కందూరు పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు దాడికి పాల్పడ్డాడు. పోలింగ్ కేంద్రంలో వద్ద ఏర్పడిన వివాదంతో సుబ్రమణ్యం నాయుడు తన అనుచరులతో కలసి దాడి చేశాడు. గంగాధర్ నెల్లూరు మండలం జంగాలపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు గ్రామస్తులపై దౌర్జన్యం చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్ళ కండ్రిగలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి వైఎస్సార్సీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. కారును ధ్వంసం చేసి ఓ నాయకుడిని తీవ్రంగా గాయపరిచారు. తొలుత టీడీపీ నాయకులు ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుకు అడ్డంగా పందిరి వేశారు. దీనిని పోలీసులు తీసి వేయడంతో జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. ఇనుప రాడ్లు, కొయ్యలతో పలువురిని తీవ్రంగా గాయపరిచారు.

'చింతమనేని' వర్గీయులు కత్తెరతో దాడి

పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చలపాటి రవిపై చింతమనేని అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన రవి భుజంపై కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడిన రవి ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నాడు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆసుపత్రికి చేరుకుని రవిని పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూలులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా వచ్చారు. అప్పుడే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలపై లాఠీఛార్జి చేశారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాల బూత్‌లో డీఎస్పీ మల్లికార్జున రావు వైఎస్సార్ సీపీకి చెందిన బూత్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారు. వారి గుర్తింపు కార్డులను లాక్కొని బయటకు వెళ్లాలంటూ ఆదేశించారని బూత్ ఏజెంట్లు పలువురు ఆరోపించారు. పాతూరివారిపేటలో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి చేసేందుకు ప్రయత్నించినా పోలీసులు పట్టించుకోలేదు.

పసుపు కండువాతో 'గంటా' హల్‌చల్

భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్ చేశారు. తన అనుచరులతో కలిసి పోలింగ్ స్టేషన్‌లోకి వెళుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లడంతో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన మల్లాడి చిన ధర్మారావు, మల్లాడి నర్సింహులు, అరదాని శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారు. రామకృష్ణారావుపేటలో కొందరు టీడీపీ సానుభూతిపరులు చేసిన దాడిలో మాజీ కార్పొరేటర్ రోకళ్ళ సత్యనారాయణతో పాటు మరికొందరు గాయపడ్డారు. రూరల్ కరప మండలం పెదకొత్తూరులో పోలింగ్ బూత్ వద్ద జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి చెందిన చింతా సత్యనారాయణపై దాడి చేసి మొబైల్ ఫోన్ లాక్కొని వివాదం సృష్టించారు. పిఠాపురం నియోజకవర్గం విరవ, విరవాడ ప్రాంతాల్లో కూడా జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు.

కత్తిపోటు నుంచి బాంబు దాడుల వరకూ..

- పోలింగ్ మొదలైన కాసేపటికే టీడీపీ రౌడీలు చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఏజంట్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం పోలింగ్ శాతం పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన దాడుల తీవ్రతను అమాంతం పెంచుకుంటూ పోయాయి.
- బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నప్పటికీ ఆమంచి శ్రీనివాస్.. టీడీపీ అభ్యర్థి ఎంఎ.కొండయ్య యాదవ్‌కు అనుకూలంగా పని చేశారు. పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నేత అంకమ్మగారుపై దాడి చేసి చెంపపై దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య యాదవ్ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు.
- వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, ఆయన వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో సుధీర్‌రెడ్డికి గాయమైంది. ఎర్రగుంట్ల 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షాహీద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు.
- వీరపునాయునిపల్లె మండలంలోని యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. కడపలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ముస్లింలపై టీడీపీ గూండాలు రాళ్ల దాడికి తెగబడ్డాయి.


అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకుని ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

- రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడటంతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజంట్లపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.
- రాయచోటి నియోజకవర్గం పరిధిలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైమరీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ!

కేంద్రం ఎంపిక చేసిన ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్

- దాదాపు 10–15 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడికి అవకాశాలు
- ఇప్పటికే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023ని రూపొందించిన రాష్ట్రం
- రాష్ట్రంలో రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతున్న ఎన్టీపీసీ
- దీనిద్వారా రోజుకు 1,200 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి
- రాష్ట్ర అవసరాలు తీర్చడంతోపాటు ఎగుమతి చేయడమే లక్ష్యం



సాక్షి, అమరావతి: శిలాజ ఇంధనాలను వీలైనంత మేర తగ్గిస్తూ ఓవైపు పర్యావరణ పరిరక్షణ, మరోవైపు ఇంధన వ్యయాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదిగేందుకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా 2050 నాటికి గ్రీన్ హైడ్రోజన్ రంగంలో 78 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి అవకాశాలున్నాయని ఆసియా సొసైటీ ఇన్‌స్టిట్యూట్ తాజాగా విడుదల చేసిన 'గ్రీన్ హైడ్రోజన్ ఫర్ డీకార్బనైజింగ్ ఆసియాస్ ఇండస్ట్రియల్ జెయింట్స్' నివేదిక వెల్లడించింది. ఈ ప్రాజెక్టు కోసం దేశం మొత్తం మీద ఐదు రాష్ట్రాలను కేంద్రం ఎంపిక చేయగా వాటిలో మన రాష్ట్రం కూడా ఉండటం విశేషం. దీనికనుగుణంగా ఇప్పటికే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ–2023ని రాష్ట్రం రూపొందించింది. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేసింది. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటివాటిపై వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. తద్వారా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీలో 10 నుంచి 15 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడికి అవకాశాలున్నాయని ఇంధన శాఖ అంచనా వేసింది.

రాష్ట్రానికి అరుదైన గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళలో ఐదు జాతీయ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించింది. ఇది ఏపీకి దక్కిన అరుదైన గుర్తింపు. ఈ హబ్‌లను 25 గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ క్లస్టర్లుగా విభజించి గ్రీన్ హైడ్రోజన్‌ను వివిధ రంగాలకు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించింది. మొదటి తరం జాతీయ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులుగా పిలుస్తున్న వీటిలో పన్నెండు.. రసాయనాలు, రిఫైనరీ, ఉక్కు పరిశ్రమల్లో పారిశ్రామిక డీ–కార్బనైజేషన్ ప్రాజెక్టులు. మరో మూడు భారీ రవాణా ప్రాజెక్టులు, మరో మూడు.. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) ప్రాజెక్టులు. మిగిలిన ఏడు.. మునిసిపాలిటీల్లో వ్యర్థాల నుంచి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో వీటి ద్వారా 2025 నాటికి 150 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రీన్ హైడ్రోజన్‌కు అనుకూలంగా ఏపీ

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలున్నాయి. ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేయడానికి, రాష్ట్ర అవసరాలు తీర్చడానికి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రం అనుకూలంగా ఉంది. రాష్ట్రంలో ఏటా 400 కిలోటన్నుల దేశీయ హైడ్రోజన్‌కు డిమాండ్ ఉంది. 2030 నాటికి కనీసం 500 కిలోటన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీని సాయంతో శిలాజ ఇంధన వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని(డీకార్బనైజ్) భావిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై నివేదికను సిద్ధం చేసింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటే లక్ష్యంగా పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌ల అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పట్ల కృతనిశ్చయంతో ఉంది. ఫలితంగా ఏపీలో కేంద్ర సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. విశాఖలో దాదాపు 1,200 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గ్రీడ్ హైడ్రోజన్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. 1,200 ఎకరాల్లో రోజుకి 1,200 టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ హబ్ ఏర్పాటు కానుంది.

అమెరికాకే అందలం!

అమెరికన్ యూనివర్సిటీల వైపే భారతీయ విద్యార్థుల మొగ్గు

- వివక్ష, దాడులు పెరుగుతున్నా తగ్గని ప్రవేశాలు
- ప్రస్తుతం విదేశీ విశ్వవిద్యాలయాల్లో 13.20 లక్షల మంది భారత విద్యార్థులు
- అమెరికాలో 4.60 లక్షలు, కెనడాలో 1.83 లక్షల మంది
- యూకే, జర్మనీ, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, బెల్జియం వైపు కూడా ఆసక్తి

సాక్షి, అమరావతి: విదేశీ విద్య కోసం భారతీయ విద్యార్థులు అమెరికా వైపే అత్యధికంగా మొగ్గు చూపుతున్నారు. అక్కడ వివక్ష చూపుతున్నా, దాడులు పెరుగుతున్నా అమెరికానే ముద్దంటున్నారు. ఉజ్వల భవిష్యత్తు కావాలంటే ఆ దేశమే ఉత్తమమనే ఉద్దేశంతో ఉన్నారని కన్సల్టెన్సీలు చెబుతున్నాయి. జీమ్యాట్ పరీక్ష నిర్వహించే గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ (జీమ్యాక్) సైతం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల దరఖాస్తుల్లో తగ్గుదల లేదని స్పష్టం చేసింది. కోవిడ్ సమయంలో మినహా అమెరికాలో అడ్మిషన్లు స్థిరంగా ఉన్నాయని వెల్లడించింది. భవిష్యత్తులో మరింత వృద్ధిని సాధిస్తాయని అంచనా వేసింది.



అమెరికాలో 4.60 లక్షల మంది

ప్రస్తుతం 13.20 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. వీరిలో అత్యధికంగా 4.60 లక్షల మంది అమెరికాలోనే ఉన్నారు. తర్వాత 1.83 లక్షల మంది కెనడాలో విద్యనభ్యసిస్తున్నట్టు ప్రపంచ బ్యాంక్ బ్లాగ్ డేటా వెల్లడించింది. ఇక ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం.. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన భారతీయుల సంఖ్యలో 2022–23లో 35 శాతం వృద్ధి నమోదైంది. దీంతో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో 2.70 లక్షల ప్రవేశాలు నమోదయ్యాయి. వరుసగా మూడో ఏడాది కూడా అమెరికా విశ్వవిద్యాలయాల్లో పది లక్షల మంది విదేశీ విద్యార్థులు చేరితే అందులో 25 శాతం మంది భారతీయులే కావడం విశేషం. 2009–10 తర్వాత తొలిసారిగా అమెరికాలో గ్రాడ్యుయేట్ విదేశీ విద్యార్థుల సంఖ్యలో చైనాను అధిగమించిన దేశంగా భారత్ రికార్డు సృష్టించింది.

అత్యధికంగా ఈ దేశాలకు..

ఉన్నత చదువుల కోసం భారతీయ విద్యార్థులు అత్యధికంగా వెళ్తున్న దేశాల్లో అమెరికా, కెనడా, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్, హంగేరీ, న్యూజిలాండ్, పోలాండ్, బెల్జియం ఉంటున్నాయి. ఇంజనీరింగ్, లా, మేనేజ్‌మెంట్, గణితం కోర్సుల కోసం జర్మనీని ఎంచుకుంటున్నారు. నెదర్లాండ్స్‌లో ఎంబీఏ, హంగేరీలో ఆర్థిక శాస్త్రం, న్యూజిలాండ్‌లో సృజనాత్మక కళలు, ఎంబీఏ, రీసెర్చ్, పోలాండ్‌లో మెడికల్, ఐటీ, బెల్జియంలో సోషల్ సైన్సెస్ కోర్సులను అభ్యసించేందుకు వెళ్తున్నారు. జర్మనీలో 42,997 మంది, నెదర్లాండ్స్‌లో 3,500, పోలాండ్‌లో 2,500 మంది, హంగేరీలో 1,000 మంది, బెల్జియంలో 24,732 మంది, న్యూజిలాండ్‌లో 15,000 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

కెనడాలోనే ఎక్కువ మరణాలు..

యూఎస్‌లో భారతీయ విద్యార్థులపై దాడులు, యూకేలో ఆర్థిక మాంద్యం సంక్షోభంలోనూ విద్యార్థులు అక్కడికే వెళ్తుండటం గమనార్హం. 2024లో తొలి రెండు నెలల్లోనే ఏడుగురు భారతీయ విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు. డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2018 నుంచి ఇప్పటి వరకు విదేశాల్లో 403 మంది భారతీయ విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఇందులో 36 మరణాలతో అమెరికా నాలుగో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో నిలిచిన కెనడాలో 91 మరణాలు నమోదయ్యాయి. రెండో స్థానంలో నిలిచిన యూకేలో 48, మూడో స్థానంలో నిలిచిన రష్యాలో 40 మంది మరణించారు. ఆస్ట్రేలియాలో 35, జర్మనీలో 20, సైప్రస్‌లో 14, ఇటలీ, ఫిలిప్పీన్స్‌లో 10 మంది చొప్పున భారతీయ విద్యార్థులు మృతి చెందారు. అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశానికి మారుతున్న సమయంలో భారతీయ విద్యార్థులు అక్కడి వివక్ష, వ్యక్తిగత పక్షపాతం, విమర్శలను తట్టుకుని నిలబడేలా ప్రోత్సాహం అవసరమని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. అనుకున్న లక్ష్యం సాధించడానికి, ఆర్థిక స్థిరత్వం కోసం ఒత్తిడికి లోనవడంతో పాటు రిస్కుతో కూడిన పార్ట్‌టైమ్ ఉద్యోగాలను ఎంపిక చేసుకోవడంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సమయంలో విదేశీ చట్ట సహాయం, మానసిక ఆరోగ్య రక్షణకు వైద్యుల సలహాలు తీసుకోవాలని చెబుతున్నారు.

భూసార పరీక్షలకు సర్వం సిద్ధం

ఖరీఫ్‌కు ముందే ప్రతి రైతుకూ సాయిల్‌హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు

మట్టి నమూనా విశ్లేషణలో అత్యాధునిక సాంకేతికత

ఫలితాలు మొబైల్ ద్వారా రైతులకు అందేలా చర్యలు



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్ కంటే ముందు భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆర్బీకే స్థాయిలో మట్టి నమూనాలను తీసుకుంటూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విశ్లేషించి కచ్చితమైన ఫలితాలను నేరుగా రైతుల మొబైల్‌కు పంపించేలా చర్యలు చేపట్టింది. తద్వారా ప్రతి రైతుకూ భూసార కార్డులు జారీకి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

రెండున్నర ఎకరాలకు ఓ నమూనా

పూర్వం గ్రిడ్ పద్ధతిలో భూసార పరీక్షలు జరిగేవి. 25 ఎకరాల విస్తీర్ణానికి ఓ మట్టి నమూనా తీసుకుని దాన్ని విశ్లేషించి గ్రామంలో అందరికీ అదే ఫలితాలతో కూడిన కార్డులు ఇచ్చేవారు. అశాస్త్రీయంగా జరిగే ఈ విధానం సరైనది కాదని రైతులు ఆందోళన వ్యక్తం చేసేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి రెండున్నర ఎకరాలకు ఓ మట్టి నమూనా చొప్పున తీసుకుని శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ విశ్లేషించాలని సంకల్పించింది. 2019–20లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని 2.26 లక్షల మంది రైతు క్షేత్రాల్లో మట్టి నమూనాలను సేకరించి విశ్లేషించి ఫలితాలను వారికి నేరుగా అందజేశారు. కోవిడ్ కారణంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండేళ్లపాటు భూసార పరీక్షలు నిర్వహించలేదు.

అగ్రి ల్యాబ్స్‌లో ఆధునిక పరికరాలు

2023–24 నుంచి ప్రతి సీజన్‌కు ముందే ప్రతి రైతు క్షేత్రంలో మట్టి నమూనాలను సేకరించి, విశ్లేషించడంతోపాటు ప్రతి రైతుకూ కనీసం మూడేళ్లపాటు వర్తించేలా భూసార కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న భూసార పరీక్షా కేంద్రాలను ఆధునికీకరించడంతోపాటు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో రూ.25 లక్షల విలువైన పరికరాలను సమకూర్చారు. మరోవైపు క్యూఆర్ కోడ్‌తో ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌సీ మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేశారు.

పోర్టల్‌లో రైతుల వారీగా భూసార ఫలితాలు

2023–24 సీజన్‌లో ఆర్బీకే స్థాయిలో 2.50 లక్షల మట్టి నమూనాలను రైతుల సమక్షంలోనే మొబైల్ యాప్ ద్వారా సేకరించారు. నేల ఆరోగ్య స్థితిని తెలుసుకునేందుకు వీలుగా సాయిల్ ఫెర్టిలిటీ మ్యాప్‌ను అధికారులు రూపొందించారు. అగ్రి ల్యాబ్స్‌లో విశ్లేషించిన ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డ్ పోర్టల్‌లో జియో కో–ఆర్డినేట్స్‌తో రైతుల వారీగా పొందుపరిచారు. దీనివల్ల ఫలితాలు రైతులకు నేరుగా తెలియడంతోపాటు ఆయా భూముల్లో గుర్తించిన లోపాలను అధిగమించేందుకు అనుసరించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు ఆర్బీకేల ద్వారా అవగాహన కల్పించారు.

4 లక్షల నమూనాల సేకరణ లక్ష్యం

2024–25 సీజన్‌లో 4 లక్షల మట్టి నమూనాలు సేకరించి, విశ్లేషించి రైతుల వారీగా భూసార పరీక్షా కార్డులు అందజేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. గడచిన రబీ సీజన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూడా కొనసాగించాలని నిర్ణయించారు. 49 కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు, టీచర్లకు ఈ మేరకు శిక్షణ కూడా ఇచ్చారు. వీరి ద్వారా ఎస్‌హెచ్‌సీ మొబైల్ యాప్ సాయంతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తారు. మే మొదటి వారంలో ఈ కార్యక్రమం చేపట్టి జూన్ నెలాఖరులోగా మట్టి నమూనాల సేకరణ, విశ్లేషణ పూర్తి చేసి సాగుకు ముందుగానే రైతులకు హెల్త్ కార్డులు జారీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

దుర్గమ్మ ఆలయం.. ఇక స్వర్ణశోభితం

- పూర్తి ఆలయానికి బంగారు తాపడం
- సుమారు 70 కిలోల బంగారం అవసరం
- దాతల నుంచి విరాళాల సేకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయం ఇక స్వర్ణశోభితం కానుంది. 2008లో అప్పటి ఈవో చంద్రకుమార్ నేతృత్వంలో 88 కిలోల బంగారంతో ఆలయ శిఖరానికి బంగారం తాపడం పనులు పూర్తి చేశారు. తాజాగా అమ్మవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు ఈవో కె.ఎస్.రామారావు నడుం బిగించారు. ప్రస్తుతం అమ్మవారి శిఖరం రూఫ్ లెవల్ వరకు బంగారు తాపడం ఉంది. రూఫ్‌లెవల్ నుంచి ఫ్లోరింగ్ లెవల్ వరకు బంగారు తాపడం చేయించాలని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డోనర్ సెల్‌లో బంగారు తాపడం పనులకు విరాళాల సేకరణను చేపట్టారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించి భక్తుల నుంచి విరాళాలు స్వీకరించారు. తొలి రోజే సుమారు రూ.13 లక్షల విరాళాలు అందాయి. ఆలయం పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు సుమారు 70 కిలోల బంగారం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మల్లేశ్వరస్వామి ఆలయ శిఖరానికి కూడా బంగారు తాపడం చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

బ్యాంకుల్లో 195 కిలోల బంగారం

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి బ్యాంకుల్లో 195 కిలోల మేర బంగారు నిల్వలు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉన్న ఈ బంగారం నుంచి ఏటా రూ.2 కోట్ల మేర వడ్డీ రూపేణా దేవస్థానానికి ఆదాయం లభిస్తోంది. మరో వైపు నిత్యం భక్తులు అమ్మవారికి ఆభరణాల రూపంలో బంగారాన్ని కానుకగా సమర్పిస్తున్నారు. ఇలా సమర్పించిన బంగారం మరో 8 కిలోలను దేవస్థాన లాకర్‌లో భద్రపరిచారు.

గుంటూరు రౌడీలతో కన్నా హల్‌చల్

- చాగంటివారిపాలెంలో రాళ్లదాడి.. పలువురికి గాయాలు
- మంత్రి అంబటిని బయటకు వెళ్లాలంటూ రివాల్వర్ గురిపెట్టిన సీఐ



చాగంటివారిపాలెంలోని జెడ్పీ పాఠశాల వద్ద రోడ్డుపై ఉన్న రాళ్లు



జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎదురుపడ్డ అంబటి, కన్నా



టీడీపీ మూకల రాళ్ల దాడిలో గాయపడిన బ్రహ్మారెడ్డి

చాగంటివారిపాలెం (ముప్పాళ్ల): గుంటూరు నుంచి తెచ్చుకున్న రౌడీలతో మాజీమంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ చాగంటివారిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద హల్‌చల్ చేశారు. రాళ్లదాడి చేసి పలువురిని గాయపరిచారు. ఒకదశలో మంత్రి అంబటికి సీఐ రివాల్వర్ గురిపెట్టడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చాగంటివారిపాలేనికి చెందిన 241, 242, 243, 244 పోలింగ్ కేంద్రాలను ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. 242 పోలింగ్ కేంద్రంలో వృద్ధుడు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరగా, అక్కడే ఉన్న టీడీపీ ఏజెంటు టీడీపీ అభ్యర్థికి ఓటు వేశాడు. ఈ విషయంలో ఏజెంట్ల మధ్య వివాదం జరిగింది. అదే సమయంలో సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు పోలింగ్ కేంద్రానికి వస్తూ క్యూలైన్‌లో ఉన్న మహిళలపై లాఠీఛార్జి చేశారు. ఎందుకు కొట్టారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీఐని నిలదీయటంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి అంబటి రాంబాబుకు గ్రామస్తులు సీఐ ప్రవర్తను వివరిస్తుండగా సీఐ మళ్లీ వైఎస్సార్‌సీపీ శ్రేణుల పట్ల అనుచితంగా ప్రవర్తించారు. వాస్తవాన్ని వివరించేందుకు ప్రయత్నించిన మంత్రి అంబటి తలకు సీఐ రివాల్వర్ గురిపెట్టి మీరు బయటకు వెళ్లాలంటూ దురుసుగా ప్రవర్తించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బంది, స్థానికులు సీఐని బయటకు పంపించారు.

గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత

పోలింగ్ కేంద్రం నుంచి మంత్రి అంబటి బయటకు వెళుతుండగా.. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఆయన తనయుడు నాగరాజు గుంటూరుకు చెందిన జైపాల్‌రెడ్డి, సత్తెనపల్లి రౌడీషీటర్లతో లోపలికి వెళుతూ ఎదురుపడ్డారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కన్నా లక్ష్మీనారాయణ వెంట ఉన్న రౌడీషీటర్లు పాఠశాల పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై నుంచి రాళ్ల దాడికి దిగారు. దీంతో ఓటర్లు పరుగులు తీశారు. రాళ్ల దాడిలో రేకుల షెడ్డు కూలిపడి ఇంట్లో ఉన్న మహిళలకు గాయాలయ్యాయి. ఈ దాడిలో పోలీసు వాహనం అద్దాలు పగిలి పోయాయి. ఘటన నుంచి తేరుకున్న చాగంటివారిపాలెం గ్రామస్తులు రౌడీమూకల వెంట పడటంతో కన్నా లక్ష్మీనారాయణ, నాగరాజు వారి వాహనాల్లో తిరుగుముఖం పట్టారు. ఈ రాళ్లదాడిలో తల్లి వెంట పోలింగ్ కేంద్రానికి వచ్చిన ముప్పా శ్రీలోకేష్ అనే చిన్నారి, వైఎస్సార్‌సీపీకి చెందిన వనమాల బ్రహ్మారెడ్డి, అన్నపురెడ్డి రంగస్వామిరెడ్డి, ముప్పా వెంకటనారాయణ, తొరటి ఆదిశేషు గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం అంబటి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి చాగంటివారిపాలెం గ్రామానికి వెళ్లి దాడిలో గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

హింసాత్మక పోలింగే టీడీపీ లక్ష్యం

సత్తెనపల్లి నియోజకవర్గంలో హింసాత్మక పోలింగ్ లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పని చేశాయని మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో ఎప్పుడూ ఇలాంటి హింస జరగలేదని చెప్పారు. గెలవలేమనే అక్కసుతో టీడీపీ అభ్యర్థి ఈ విషసంస్కృతిని తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. ముప్పాళ్ల మండలంలోని తొండపి, చాగంటివారిపాలెం, నకరికల్లు మండలంలోని గుళ్ళపల్లి, కుంకలగుంట, చీమలమర్రి గ్రామాల్లోను, మరికొన్నిచోట్ల రాళ్లదాడికి, ఈవీఎంల ధ్వంసానికి పాల్పడ్డారని, నార్నెపాడు బూత్‌లో ఏజెంట్లను లాగేసి ఈవీఎంల బటన్లు నొక్కే ప్రయత్నం చేశారని చెప్పారు. వీటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. వీటిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంజేఎం రామలింగారెడ్డి తదితరులున్నారు.

ఓటమి భయంతో కూటమి అరాచకం

సాక్షి, తిరుపతి: కూటమికి ఓటమి భయం పట్టుకుంది. దీంతో సోమవారం పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులపై కూటమి నేతలు దాడులకు తెగబడ్డారు. తిరుపతి జిల్లా చిల్లకూరు జెడ్పీ హైస్కూల్ వద్ద వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై రాళ్లతో దాడికి యత్నించారు. గూడూరు నియోజక వర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు మురళీధర్ చిల్లకూరు దర్గా సమీపంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడు పట్టాభిరెడ్డి దురుసుగా మాట్లాడుతూ మురళిని పక్కకు తోసేశారు. టీడీపీ కార్యకర్త రాయి విసరడంతో అది మురళి పక్కనే ఉన్న అనుచరుడికి తగిలింది. అక్కడే ఉంటే ఘర్షణ జరిగే అవకాశం ఉందని భావించి మురళీధర్ జెడ్పీ హైస్కూల్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ కూడా టీడీపీ ఏజెంట్లు వాగ్వాదానికి దిగారు. టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు ఆ పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, నాయకులు, కార్యకర్తలపై కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారు. అంతటితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్రోల్, డీజిల్ పోసి తగులబెట్టేందుకు యత్నించారు. టీడీపీ అభ్యర్థి తన అనుచరులతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడంతో గంటకుపైగా పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది.

దళితులపై దాడి

చంద్రగిరిలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేతలు దళితులపై మరోసారి దాడికి తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేయకుండా అడ్డుకునేందుకు పోలింగ్ బూత్‌లో ఉన్న దళిత ఏజెంట్లను లాక్కొచ్చి దాడి చేశారు. దళితవాడలోకి చొరబడి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రామచంద్రాపురం మండలం రావిళ్లవారిపల్లె పంచాయతీ బ్రాహ్మణకాలువ దళితవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ దాడులను అడ్డుకునేందుకు యత్నించిన కేంద్ర బలగాలకు చెందిన జవానుపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయన అయిదు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. చంద్రగిరి మండలం కాసిపెంట్ల వద్ద (హెరిటేజ్ సంస్థ ఉన్న ప్రాంతం) టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఈ విషయమై స్వతంత్ర అభ్యర్థి ఏజెంట్ రాజశేఖర్ సంతకం చేయనని చెప్పడంతో టీడీపీ ఏజెంట్లు, నాయకులు అతడిపై దాడికి పాల్పడ్డారు. దాడిచేసిన వారిపై, పీఓపై చర్యలు తీసుకోవాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించారు. చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి పరిధిలోని కందులవారి పల్లెలోనూ టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై దాడికి పాల్పడ్డారు. పాకాల మండలం ఆదినపల్లి పోలింగ్ బూత్ లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ అనిల్‌కుమార్‌పై టీడీపీ అభ్యర్థి కుమారుడు పులివర్తి వినీల్, అనుచరులతో కలిసి దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి.

శ్రీకాళహస్తిలో బొజ్జల దౌర్జన్యం

శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల వద్ద హల్‌చల్ చేయడమే కాక పోలీసులు, అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. శ్రీకాళహస్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలో కొందరు అధికారులపై టీడీపీ నేతలు దురుసుగా వ్యవహరించారు. అధికారులను ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు దాడి చేసేందుకు యత్నించారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అక్కడకు చేరుకొని అంతు చూస్తానంటూ పోలీసులకు వేలు చూపిస్తూ బెదిరించారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి



ఏనుగు దాడిలో మృతి చెందిన కాత్తవరాయన్



మణిపిరెడ్డిపల్లి సమీప పొలాల్లో ఉన్న ఏనుగు

పాకాల: ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా పాకాల మండలంలోని మణిపిరెడ్డిపల్లి పరిసర ప్రాంతాల్లో సోమవారం జరిగింది. సోమవారం స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు..స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న గుట్ట నుంచి ఒక ఏనుగు మణిపిరెడ్డిపల్లి సమీప పొలాల్లోకి వచ్చింది. స్థానికులు ఏనుగును వెంబడించడంతో ద్విచక్రవాహన దారుడిపై అది తిరగబడింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం పాక్షికంగా దెబ్బతింది. సమీపంలోని గుట్ట వద్ద కాసి రాళ్లు కొడుతున్న ప్రదేశానికి చేరుకున్న ఏనుగు అక్కడ ఉన్న తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా పెరిమకోలాపడికి చెందిన కాత్తవరాయన్(52)ను తరిమి తొండంతో పట్టుకుని నేలకేసి కొట్టి చంపేసింది. అక్కడ నుంచి వస్తున్న ఏనుగు మణిపిరెడ్డిపల్లికి చెందిన పార్థసారధిపై దాడికి తెగబడి తీవ్రంగా గాయపరిచింది. అనంతరం మణిపిరెడ్డిపల్లి సమీప పంట పొలాల్లోంచి, పాకాల–చిత్తూరు రోడ్డు, సమీపంలోని రైల్వే ట్రాక్‌ను దాటుకుని పాకాల పెద్ద చెరువులోకి వెళ్లింది. ఏనుగు ఆచూకీ కోసం డ్రోన్లతో తిరుపతి, చిత్తూరు అటవీ శాఖ అధికారులు తమ సిబ్బందితో గాలిస్తున్నారు. కాత్తవరాయన్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943